



www.aksharamtelugudaily.com

# అక్షరం

సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక

బుధవారం 23 జూలై 2025 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా

పేజీలు : 12 సంపుటి : 08 సంచిక : 117 వెల : రూ.3/- కొత్తగూడెం తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, A SIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI


## బిజెపిది బిసి వ్యతిరేక వైఖరి

**అందుకే రిజర్వేషన్లను వ్యతిరేకిస్తోంది**

**బిసిల కోసం అవసరమైతే ఎంపిలు రాజీనామా చేయాలి**

**మీడియాతో మంత్రి పొన్నం ప్రభాకర్**



హైదరాబాద్,జులై 22: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం అసాధ్యం అనడం బీజేపీ అసలు స్వరూపాన్ని బయటపెడుతోందని

### అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు

# పేదలకు చేరాలి



**ప్రభుత్వ లక్ష్యలు నెరవేరేలా కలెక్టర్లు కృషి చేయాలి**

**పథకాల ఫలితాలు అందేలా క్షేత్రస్థాయి చర్యలు**

**వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లకు మంత్రుల ఆదేశం**

**హైదరాబాద్,జులై 22:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పలు అభివృద్ధి సంక్షేమ పథకాల అమలులో జిల్లా కలెక్టర్లు కీలకంగా వ్యవహరించాలని, ఆయా సంక్షేమ ఫలాలు పేద ప్రజలకు చేరే విధంగా తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం ఉదయం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు,కార్యదర్శులు, విభాగాధిపతులతో అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, భూభారతి, వివిధ రెసిడెన్షియల్ స్కూళ్లలో భోజన, మౌలిక వసతుల ఏర్పాటు, వనమహోత్సవంలో మొక్కలు నాటడం, మహాలక్ష్మి పథకం తదితర అంశాలపై సమీక్ష చేశారు. రాష్ట్ర మంత్రులు వివిధ అంశాల వారీగా జిల్లా కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ లక్ష్యాల మేరకు కలెక్టర్లు, అధికారులు నిర్విరామంగా కృషి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రులు పొంగులేటి తదితరులు మాట్లాడుతూ ప్రజాపాలనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో ఈ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టిందని,క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్లు, అధికారులు ముఖ్య పాత్ర పోషించాలని, పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న ఎన్నో పథకాల ఫలితాలను వారికి అందే విధంగా తగు చర్యలు తీసుకోవాలని, దానికగుణంగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి ఆదేశాలకనుగుణం సాంఘిక,

### ధన్‌ఖర్ రాజీనామాకు రాష్ట్రపతి

# ఆమోదం

**జగ్‌దీప్ ఆయురారోగ్యాలతో ఉండాలని మోదీ ఆకాంక్ష**



**న్యూఢిల్లీ,జూలై22:**

ఉప రాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా సమర్పించగా.. మంగళవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము దానికి ఆమోదం తెలిపారు. ఈ సమాచారాన్ని రాష్ట్రపతి కార్యాలయం హోంమంత్రిత్వ శాఖకు తెలియజేసింది. అలాగే దీనికి సంబంధించి త్వరలో నోటిఫికేషన్ జారీ కానుంది. అనారోగ్య కారణాలతో ధన్‌ఖడ్ రాజీనామా చేస్తున్నాట్లుగా ప్రకటించారు. అయితే ఆయన రాజీనామాపై ఎలాంటి అనుమానాలు ప్రభుత్వం పక్షాన వ్యక్తం కాలేదు. సరికదా ఆయన ఆయురారోగ్యా లతో ఉండాలని కోరుకుంటున్నానని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. ఉప రాష్ట్రపతి పదవితో సహా వివిధ హోదాల్లో ధన్‌ఖడ్ దేశానికి సేవలు అందించారని అన్నారు. రాజ్యసభ ఛైర్మన్ హోదాలో పార్లమెంటు- వర్షాకాల సమావేశాల

### బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై

# వెనకడుగు లేదు

**ఎలాటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధం**

**అవసరమైతే న్యాయపోరాటినికి కూడా వెనకాడం**

**కేంద్రం దీనిని వెంటనే ఆమోదించి చిత్తశుద్ది చాటాలి**

**రామచంద్రరావు లీగల్ నోటీసులకు జడిసేది లేదు**

**మీడియాతో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క**



**హైదరాబాద్,జులై 22**

: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై న్యాయపరమైన సమస్యలు వస్తే –ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని తెలంగాణ డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. కులగణన సర్వే ఆధారంగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించామన్నారు. సచివాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. బిసి రిజర్వేషన్లలో వెనక్కి పోయే ప్రసక్తి లేదని అన్నారు. కులగణన అవసరం లేదని భాజపా మొదట మాట్లాడింది. తెలంగాణ ప్రభుత్వం, రాహుల్ గాంధీ ఒత్తిడితో జనగణనలో కులగణన చేరుస్తామని ప్రధాని మోదీ ప్రకటించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉంది. ఈ బిల్లుకు పార్లమెంట్‌లో అన్ని పార్టీల మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తాం. కులగణనను క్యాబినెట్‌లో, శాసనసభలో ప్రవేశపెట్టి ఆమోదించాం. అసెంబ్లీలో మద్దతు తెలిపిన పార్టీలు పార్లమెంట్‌లోనూ

## ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**చేసిన పనులపై ఎప్పటికప్పుడు వివరించాలి**

**పెద్ద ఎత్తున కార్యక్రమాలపై వివరించేలా ప్రచారం**

**సమాచారశాఖ అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష**

**హైదరాబాద్,జులై 22**

: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఏడాదిన్నర కాలంలో ఎన్నోసంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తూ ముందుకు సాగుతున్నదనిరాష్ట్రరెవెన్యూ,హౌసింగ్,సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అయితే ఎన్ని మంచి పనులు చేసినప్పటికీ చేసిన మంచి పనులను సవివరంగా ప్రజల్లోకి తీసుకెళ్లలేక పోతు న్నామని అభిప్రాయపడ్డారు. నేడు ప్రతి పక్షంలో ఉన్న పార్టీ పదేళ్లు అధికారంలో ఉన్న సమయంలో చెయ్యనివాటిని చేసినట్లుగా గోబెల్స్ ప్రచారంతో ప్రజలను మభ్య పెట్టిందని, ప్రతిపక్షంలో కూడా అదే ఒరవడిని కొనసాగిస్తూ ప్రజల కళ్లకు గంతలు కడుతోందని విమర్శించారు. తమ ప్రభుత్వం చేసినదాన్ని కూడా



# జివో 49పై వెనక్కి తగ్గిన ప్రభుత్వం

**ఆదివాసీ గూడాల్లో ఆనందం**

**తమ పోరాటం ఫలించందని సంబరం**


**ఆదిలాబాద్,జూలై22(:**

ఎక్కడో ఒకచోట పులి జాడలుకనిపిస్తేనే వణికిపోయిన గిరజనం ఇప్పుడు..కవ్వాల్ టైగర్ ఫారెస్ట్ జోన్ ప్రకటనతో చలించిపోయింది. తాము ఉన్న ఊళ్లు వదలాల్సి వస్తుందని ఆందోళన చెందారు. అందుకు జీవో 49కి వ్యతిరేకంగా ఉద్యమించారు. జిల్లా బంద్ చేపట్టారు.



## ఉచితబస్సు ప్రయాణంలో రికార్డు

**200 కోట్లకు చేరిన జీరో టిక్కెట్ల జారీ**



## అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు

# పేదలకు చేరాలి

బిసి, మైనారిటీ- సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, హాస్టళ్లలో నిర్వాహణపై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి వారంలో ఒక్కరోజు అధికారులందరూ ఆ హాస్టళ్లలో బస చేయాలని కలెక్టర్లను మంత్రులు ఆదేశించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లకు వీటి నిర్వాహణపై పలు సూచనలు చేశారు. పెంచిన డైట్ ఛార్జీలకు అనుగుణంగా నాణ్యమైన భోజన వసతి కల్పించాలని ఆదేశించారు. హాస్టళ్లలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు కల్పించాలని, వారి నుంచి ఎలాంటి ఫిర్యాదులు రావొద్దని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మంత్రులు శ్రీ పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమారులు జిల్లా కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. హాస్టళ్ల ప్రాంగణాల్లో పచ్చదనం పరిశుభ్రతల్లో భాగంగా శానిటేషన్‌ను చేపట్టాలని, అన్ని జిల్లాల్లో ఎగ్ టెండర్స్ పక్రియను త్వరలో పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో నెలకోసారి పేరెంట్స్ కమిటీ మీటింగ్‌లను ఏర్పాటు- చేయాలని సూచించారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా 200 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేశారని, ఈ సందర్భంగా 97 బస్సు డిపోలు, 321 బస్‌స్టేషన్లలో వేడుకలను నిర్వహించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వ లక్ష్యాల మేరకు అర్హు÷నై ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణంలో ఇసుక కొరత లేకుండా కలెక్టర్లు తగు చర్యలు తీసుకోవాలని, ఇసుక రవాణాలో

లబ్ధిదారుడినికి ఉచితంగా అందజేయాలని, ఇసుక రవాణా విషయంలో లబ్ధిదారునికి ఎలాంటి భారం కలుగకుండా చూడాలని కలెక్టర్లను మంత్రి ఆదేశించారు. ప్రతి వారం దీనిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రగతిని సమీక్షిస్తానని మంత్రి తెలిపారు. భూభారతిలో నమ్మో÷నై దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్లను ఆదేశించారు. నిబంధనలకు అనుగుణంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో విరివిగా మొక్కలు నాటాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ముఖ్యకార్యదర్శులు నదీమ్, ఎన్. శ్రీధర్, దానకిషోర్, నవీన్‌మిట్టల్, యోగితారాణా, క్రిస్టినా చొంగ్తూ, కార్యదర్శులు లోకేశ్‌కుమార్, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్, విపి గౌతమ్, పిసిసిఎఫ్ సువర్ణ, ఇ.శ్రీధర్, సృజన, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై

# వెనకడుగు లేదు

మద్దతు తెలపాలి. ఆర్డినెన్స్ గవర్నర్ ఆమోదం పొందగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ముందుకెళ్తాం అని అన్నారు. రాష్ట్రంలో నిర్వహించిన కులగణన ఆధారంగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. గవర్నర్ ఆర్డినెన్స్ జారీ చేయగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ముందకెళ్తామని స్పష్టం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లుకు అసెంబ్లీలో కొన్ని పార్టీలు మద్దతు ఇచ్చాయని, అసెంబ్లీలో మద్దతు తెలిపిన పార్టీలు పార్లమెంట్లో కూడా పోరాటం చేయాలని కోరారు. ఈ బిల్లు త్వరగా ఆమోదం పొందే ప్రయత్నాలు చేస్తున్నామని వివరించారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కుల గణన చేపడతామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని.. ఆయన చెప్పిన మాట ప్రకారమే రాష్ట్రంలో అధికారంలోకి రాగానే కుల గణన నిర్వహించామని గుర్తు చేశారు. జాతీయ స్థాయిలో కులగణన అంశం తెరపైకి రావడంలో తెలంగాణ రాష్ట్రానిది కీలక పాత్ర అని పేర్కొన్నారు. తెలంగాణలో కులగణన చేసిన తర్వాతే దీనిపై దేశవ్యాప్తంగా చర్చ మొదలైందన్నారు. కులగణన సర్వేను చాలా పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించామని అందుకే తెలంగాణను చూసి కేంద్ర ప్రభుత్వం కూడా కుల గణన చేస్తామని ప్రకటించిందన్నారు. తెలంగాణ జరిగిన విధానమే రేపు దేశవ్యాప్తంగా అమలు కానుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కులగణన, జనగణన చేయడానికి ఇంకా చాలా సమయం ఉందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ఏవైనా న్యాయపరమైన సమస్యలు వస్తే ఎదుర్కొవడానికి కూడా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.తెలంగాణ ప్రభుత్వం చేసిన కులగణన సర్వే దేశానికి మార్గదర్శకంగా నిలుస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు.భారత రాష్ట్ర సమితి ప్రజలను మభ్యపెట్టింది. అందరూ అలాగే చేస్తారని ఆ పార్టీ నేతలు అనుకుంటున్నారేమో. కులగణన సర్వేను చాలా పకడ్బందీగా, పారదర్శకంగా చేపట్టాం. అందుకే తెలంగాణను చూసి కేంద్రం కూడా కులగణనను ప్రకటించిందని భట్టి అన్నారు. రాష్ట్ర భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావుకు బీసీలంటే చిన్నచూపు ఉన్నట్లుంది. ఆయన పంపిన లీగల్ నోటీసులకు ఎలా సమాధానం చెప్పాలో నాకు తెలుసు.

నోటీ-సులకు భయపడేది లేదని కౌంటర్ ఇచ్చారు. నోటీసులు అందిన తరువాత ఏవిధంగా సమాధానం చెప్పాలో తనకు తెలుసన్నారు. రామచందర్ రావుకి దళితులన్నా బడుగు బహీన వర్గాలన్నా చిన్న చూపని విమర్శించారు. రోహిత్ వేముల ఆత్మహత్య చేసుకోవడానికి రామచందర్ రావు కూడా కారణమంటూ ఇటీవల భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. రివార్డుగా బీజేపీ అధిష్టానం ఆయనకు తెలంగాణ చీఫ్ పదవి ఇచ్చిందని ఆరోపించారు. రామచందర్ రావుకు తెలంగాణ చీఫ్ పదవి ఇవ్వడంపై బీజేపీ అధిష్టానం ఒకసారి పునరాలోచించాలని భట్టి అన్నారు. భట్టి వ్యాఖ్యలను తప్పుబట్టిన రామచందర్ రావు తన న్యాయవాదితో లీగల్ నోటీ-సులు పంపించారు. మూడు రోజుల్లో బేషరతుగా క్షమాపణ చెప్పాలని.. లేకపోతే రూ.25 కోట్ల పరువు నష్టం దావా వేస్తానని రామచందర్ రావు నోటీ-సుల్లో

హెచ్చరించారు. దీనిపై క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుందని సూచించారు.

## ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

పూర్తిగా చెప్పుకోలేక పోతున్నామని అన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఐ అండ్ పిఆర్ స్పెషల్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక, ముఖ్యమంత్రి ప్రజాసంబంధాల అధికారి జి. మల్సూర్‌తో కలిసి మంగళవారం జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రి ఆలోచనలకు అనుగుణంగా ఇందిరమ్మ ప్రభుత్వం ఏడాదిన్నరలో ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి ప్రజలకు ఎంతోచేసినప్పటికీ ఆశించిన రీతిలో ప్రజలకు వివరించలేకపోతున్నామని అన్నారు. ఇచ్చిన హామీలనే గాక ఇతర అంశాలలో ప్రజోపయోగపనులు చేపట్టామని , 60 వేల ఉద్యోగాలు భర్తీ చేసి దేశంలోనే ఇంత భారీ నియామకాలు చేపట్టిన రాష్ట్రంగా తెలంగాణను అగ్రపథంలో నిలిపామన్నారు. ఇవేగాక మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, పేదలకు సన్నబియ్యం, మహిళలకు రూ. 500లకే గ్యాస్ సిలిండర్, రైతుభరోసా పెంపు, రుణమాఫీ, ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు, డైట్ ఛార్జీలు 40 శాతం పెంపు,ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల పంపిణీ ఇలా రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమానికి ఎంతో చేశామన్నారు. గత ప్రభుత్వం పది సంవత్సరాలలో చేయలేనిది ఏడాదిన్నరలో చేసి చూపించాం. పది సంవత్సరాలలో పేదలకు రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్లు ఆలోచన కూడా చేయలేదు. ఉన్న రేషన్ కార్డులలో పేర్లు కూడా నమోదు చేయలేదు. గత పది సంవత్సరాలుగా రేషన్ కార్డుల్లో పేరునమోదు కోసం ఎదురు చూస్తున్న 15 లక్షల మంది పేదల పేర్లను రేషన్ కార్డులలో నమోదు చేశాం. కొత్తగా 7 లక్షల రేషన్ కార్డులిచ్చాం. భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చాం. ఆర్థికంగా ఎంతో ఇబ్బంది ఉన్నాకూడా పేదల సంక్షేమం విషయంలో ఈ ప్రభుత్వం రాజీ పడడం లేదన్నారు. ఈ ప్రభుత్వం తీసుకున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విరివిగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత జిల్లాస్థాయిలో పౌరసంబంధాల శాఖ అధికారులదేనని ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జాయింట్ డైరెక్టర్ జగన్ డిప్యూటీ డైరెక్టర్ మధు పాల్గొన్నారు.

# జివో 49పై వెనక్కి తగ్గిన ప్రభుత్వం

జీవో 49ని రద్దు చేయాలని ఆదివాసీ, తుడుందెబ్బ సంఘాల ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ జిల్లాలో సోమవారం నిర్వహించిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఆసిఫాబాద్‌లో ఆదివాసీ, ఇతర సంఘాల నాయకులు ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ధర్నా చేశారు. కాగజ్‌నగర్‌లో ర్యాలీ తీశారు. మిగతా మండలాల్లో ఆదివాసీ, తుడుందెబ్బ నాయకులు నిరసనలు చేపట్టారు. మంచిర్యాల జిల్లా దండేపల్లిలో ఆదివాసీ, గిరిజన సంఘాలు రాస్తారోకో చేపట్టాయి. అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో నెన్నెలలో జీవో ప్రతులను దహనం చేశారు. కాసిపేట మండలంలో బంద్ నడిచింది. ఆదిలాబాద్‌లో ప్రధాన వీధుల గుండా ఆదివాసీ నేతలు ర్యాలీలు

నిర్వహించి దుకాణాలను మూసి వేయించారు. బస్టాండ్, బస్ డిపో ఎదుట ఆందోళన చేపట్టారు. గుడిహత్నూర్, ఉట్నూర్ మండల కేంద్రాల్లో వాణిజ్య సంస్థలు మూతబడ్డాయి. ఈ క్రమంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. చివరకు జివోను రద్దు చేసేలా చేశారు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఏర్పాటు చేయాలనుకున్న టైగర్ కన్జర్వేషన్ జోన్ విషయంలో సర్కారు వెనక్కి తగ్గింది. సుమారు 330 గ్రామాలను ప్రభావితం చేయనున్న ఈ పులుల సంరక్షణ కేంద్రంపై ఆదివాసీల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవడంతో ప్రభుత్వం పునరాలోచనలో పడింది. టైగర్ రిజర్వ్ ఏర్పాటు కోసం తీసుకువచ్చిన జీవో 49ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు సోమవారం ప్రకటించింది. జీవో 49 విషయంలో ఇటీవల జరిగిన పరిణామాల నేపథ్యంలో కలెక్టర్ నుంచి సేకరించిన తాజా నివేదిక మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఆసిఫాబాద్ జిల్లాలోని ఆసిఫాబాద్, కెరమెరి, రెబ్బెన, తిర్యాణి, కాగజ్‌నగర్, సిర్పూర్, కర్జెల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్ రేంజ్‌లో లక్షా 49 వేల హెక్టార్లను - టైగర్ రిజర్వ్‌లోకి మారుస్తూ గత నెల 30న ప్రభుత్వం జీవో 49ని ఇచ్చింది. దీనిని వ్యతిరేకిస్తూ స్థానికులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. దీంతో 330 ప్రభావిత గ్రామాల్లో నెలకొన్న పరిస్థితులపై అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, ఆదిలాబాద్ ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సమగ్ర వివరాలను సేకరించారు. వాస్తవ పరిస్థితులను సీఎం రేవంత్‌రెడ్డికి వివరించారు. దీంతో జీవో 49ని తాత్కాలికంగా నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కాగా, జీవో 49 నిలుపుదలపై హర్షం వ్యక్తం చేస్తూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజాప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డిని సోమవారం కలిసి కృతజ్ఞతలు తెలపడంతో పాటు సన్మానించారు. సహకరించిన మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు, కొండాసురేఖ, అడ్లూరి లక్ష్మణ్‌కు.. ఎమ్మెల్సీ దండె విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మాజీ ఎంపీ సోయం బాపూరావు, మాజీ ఎమ్మెల్యే అత్రం సక్కు కృతజ్ఞతలు తెలిపారు.

## బిజెపిది బిసి వ్యతిరేక వైఖరి

మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. బిజెపి మాట్లాడుతున్న తీరు దాని బిసి వత్యిరేకతను బయటపెట్టిందన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. గతంలో పక్క రాష్ట్రం తమిళనాడులో ఇదే విధమైన రిజర్వేషన్లు అమలు అయ్యాయి. సుప్రీంకోర్టు ఇందిరా సహనీ కేసులో స్పష్టంగా చెప్పింది రాష్ట్ర ప్రభుత్వాల వద్ద ప్రమాణితమైన సమాచారం, ఎంపెరికల్ డేటా ఉంటే వారు రిజర్వేషన్ నిర్ణయం తీసుకోవచ్చని అన్నారు. ఈ క్రమంలోనే తెలంగాణ ప్రభుత్వం సర్వే చేసింది, కేబినెట్ ఆమోదం తీసుకుంది, శాసనసభ ఆమోదం పొందింది. గవర్నర్ ఆమోదంతో అది ఇప్పుడు ఢిల్లీలో ఉంది. కాబట్టి కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చాల్సిన బాధ్యత ఉందని ఆయన అన్నారు. తెలంగాణ బీజేపీ ఎంపీలు రిజర్వేషన్ల కోసం రాజీనామా చేయాలి. నిజంగా బీసీల పక్షాన నిలబడాలని ఉంటే, రిజర్వేషన్లు అమలయ్యేలా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి చూపాలి. లేకపోతే బీసీల పట్ల కుట్ర చేస్తూ ఉంటారని భావించాలని మంత్రి ఘాటుగా వ్యాఖ్యానించారు. అనాడు మండల కమిషన్‌ను వ్యతిరేకించింది బీజేపీయే. ఇప్పుడు మళ్లీ బీసీల రిజర్వేషన్లపై వక్రబుద్ధిని చూపిస్తోంది. తెలంగాణలోని అన్ని బీసీ సంఘాలు ఈ కుట్రను గమనించి రిజర్వేషన్ హక్కులను కాపాడేందుకు ముందుకు రావాలని పొన్నం పిలుపునిచ్చారు. సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుంది. మా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీల పక్షాన నిలుస్తున్నారు. మా పీసీసీ అధ్యక్షుడు కూడా బీసీ వర్గానికే చెందినవారు. మా వర్గాలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోం అని హెచ్చరించారు. అదే సమయంలో, బీజేపీపై విరుచుకుపడుతూ, మీరు ముఖ్యమంత్రి బీసీ అని, సిఎల్పీ నాయకుడు బీసీ అని మభ్యపెడతారు. కానీ పార్టీ అధ్యక్ష పదవిని బీసీ వర్గానికి ఇవ్వని మీరు, మళ్లీ బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్నారు. ఇది మీ అసలు స్వరూపం అని మంత్రి ఆరోపించారు.

## ఉచితబస్సు ప్రయాణంలో రికార్డు

హైదరాబాద్,జులై 22:తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం.. మహాలక్ష్మి పథకంలో భాగంగా మంగళవారం వరకు 199.60 కోట్ల జీరో టికెట్లు- జారీ చేశారు. రేపటితో అంటే.. జులై 23వ తేదీతో 200 కోట్లకు ఈ జీరో టికెట్ల జారీ చేరనుంది. దీంతో ఏడాదిన్నర రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో మహిళల సంక్షేమంతోపాటు- వారి సాధికారతకు పెద్ద పీట వేసినట్లు- అయింది. ఎన్నికల సందర్భంగా మహిళలకు ఇచ్చిన హామీని ఈ ప్రజా ప్రభుత్వం నిలబెట్టుకుంది. తద్వారా ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణ పథకాన్ని విజయవంతంగా అమలు చేసినట్లు- అయింది. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం కొలువు తీరిన జస్ట్ 48 గంటల్లోనే అంటే.. డిసెంబర్ 9వ తేదీన ఈ మహాలక్ష్మీ పథకాన్ని అమలు చేశారు. ఈ పథకం దేశప్రజలందరిని ఆకర్షించిన సంగతి తెలిసిందే.

## ధన్‌ఖర్ రాజీనామాకు రాష్ట్రపతి

# ఆమోదం

తొలిరోజున కార్యక్రమాలను సజావుగా నిర్వహించిన ధన్‌ఖడ్.. రాత్రి కల్లా అనూహ్యంగా రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు పంపారు. అనారోగ్య కారణాల వల్లే తాను పదవి నుంచి వైదొలుగుతున్నట్లు- అందులో పేర్కొన్నారు. వైద్యుల సూచనల మేరకు ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తూ.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 67(ఎ)కు అనుగుణంగా నేను ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నా. బాధ్యతల నిర్వహణలో నాకు అండగా నిలిచిన రాష్ట్రపతికి కృతజ్ఞతలు. పదవీకాలంలో మేం చాలా ప్రశాంతమైన, అద్భుతమైన వర్కింగ్ రిలేషన్‌ను కొనసాగించాం. ప్రధాన మంత్రి, మంత్రి మండలికీ హృదయపూర్వక కృతజ్ఞతలు అని ధన్యవాదాలు చెప్పారు. 2022 ఆగస్టు 11న ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన ధన్‌ఖడ్‌కు 2027 ఆగస్టు వరకూ పదవీకాలం ఉంది. అయితే రెండేళ్ల 344 రోజులకే ఆయన వైదొలగాలని నిర్ణయించుకున్నారు. దేశ 14వ ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వర్తించిన ఆయన సోమవారం సాయంత్రం వరకూ ఆరోగ్యంగా కనిపించినప్పటికీ రాత్రికి అదే కారణంతో రాజీనామా చేయడం అందర్నీ ఆశ్చర్యపరుస్తోంది. ధన్‌ఖడ్ రాజీనామా ఊహించని పరిణామమని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. ఆరోగ్య అంశం కంటికి కనిపిస్తున్నా కనిపించనివి ఏవో దీనివెనక ఉండి ఉంటాయని అనుమానం వ్యక్తంచేసింది.

## ధన్‌ఖడ్ స్థానంలో ఎవరన్న చర్చ

### రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్‌పై దృష్టి

### బీహార్ ఎన్నికల నేపథ్యంలో కలిసివచ్చే ఛాన్స్



న్యూఢిల్లీ,జూలై22: ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తన పదవికి రాజీనామా చేశారు. మరో రెండేండ్ల పదవీ కాలం ఉన్నప్పటికీ ఆయన కుర్చీని ఖాళీచేశారు. ఆరోగ్య కారణాలను పేర్కొంటూ రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపించారు. ఈనేపథ్యంలో తదుపరి ఉపరాష్ట్రపతి ఎవరనే అంశంపై విస్తృతంగా చర్చ జరుగుతున్నది. అధికార పార్టీ పలువురి పేర్లను పరిశీలిస్తున్నట్లు- తెలుస్తున్నది. బీజేపీతోపాటు- ఎన్డీయే పక్షాలకు చెందిన నేతనూ ఈ పదవి దక్కనుందని సమాచారం. ఈ నేపథ్యంలో జనతాదళ్ (యునై-టెడ్) ఎంపీ, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్నది. త్వరలో బీహార్ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో అదే రాష్ట్రానికి చెందిన హరివంశ్‌ను ఇందుకు ఎంపిక చేసే అవకాశం ఉందని అంటున్నారు. రాజకీయంగా అ అవకాశాన్ని మోడీ ఉపయోగించుకునే తీరుతారని అంటున్నారు. బీహార్‌కు చెందిన హరివంశ్‌కు రాజకీయాలలో అనుభవజ్ఞునిగా పేరున్నది. ఉన్నత విద్యావంతుడిగా పేరుపొందారు. ఆయన తొలిసారి 2014లో రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఆర్థికశాస్త్రంలో పీజీ చేసియన ఆయన జర్నలిజ్యంలో డిప్లొమా అందుకున్నారు. రాజకీయాల్లోకి రాకముందు చాలా ఏండ్లు జర్నలిస్టుగా పనిచేశారు. ప్రభుత్వ బ్యాంకులో ఉద్యోగం వచ్చినప్పటికీ జర్నలిజంపై మక్కువతో 'ధర్మయుగ్'లో సబ్ ఎడిటర్‌గా కెరీర్ ప్రారంభించారు. రవివర్, ప్రభాత్ ఖబర్ వంటి ప్రముఖ ప్రింట్ మీడియా సంస్థల్లో పనిచేశారు. ప్రభాత్ ఖబర్‌కు చీఫ్ ఎడిటర్‌గానూ

వ్యవహరించారు. మాజీ ప్రధాని చంద్రశేఖర్‌కు సలహాదారుగా పనిచేసిన ఆయన.. ఆ ప్రభుత్వం కూలిపోవడంతో మళ్లీ జర్నలిజంలోకి వచ్చేశారు. నితీశ్ కుమార్ నేతృత్వంలోని జేడీ(యూ) నుంచి తొలిసారి ఎంపీగా ఎన్నికయ్యారు. 2020 నుంచి రాజ్యసభ డిప్యూటీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. త్వరలో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు కూడా ఉండనుండటంతో హరివంశ్‌నే ఉపరాష్ట్రపతిగా ఎన్డీయే ప్రభుత్వం నియమించే అవకాశాలు అధికంగా ఉన్నాయి.

## ఫోన్ ట్యాపింగ్ కేసు సిబిఐకి అప్పగించాలి

### మంత్రుల ఫోన్లూ ట్యాప్ అవుతున్నాయి

### బిఆర్‌ఎస్ నేత ప్రవీణ్ కుమార్ డిమాండ్



హైదరాబాద్,జులై 22:ఫోన్ ట్యాపింగ్‌పై సిట్ విచారణ పారదర్శకంగా నడుస్తుందన్న నమ్మకం లేదని, ఈ కేసును సీబీఐకి అప్పగించాలని బిఆర్‌ఎస్ తరఫున కోరుతున్నట్లు ఆ పార్టీ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ విషయమై గవర్నర్‌ను కలిసి విజ్ఞప్తి చేస్తామని.. హైకోర్టుకు నివేదిస్తామని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలందరినీ అభద్రతాభావంలోకి నెట్టేశారని, భారత రాష్ట్ర సమితి కీలక నేతలతోపాటు- రాష్ట్ర మంత్రుల ఫోన్లనూ ట్యాప్ చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ప్రవీణ్‌కుమార్ మీడియాతో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఉల్టా చోర్ కొత్వాల్ కో ఢాంటే అన్నట్టుగా సీఎం రేవంత్ రెడ్డి వ్యవహారం ఉందని ప్రవీణ్‌కుమార్ అన్నారు. బీఆర్‌ఎస్ కీలక నేతలతో పాటు-.. తన మంత్రివర్గ సభ్యుల ఫోన్లు కూడా రేవంత్ రెడ్డి ట్యాపింగ్ చేయిస్తున్నారని తెలిపారు. మంత్రుల ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి సౌత్‌ఫస్ట్ పత్రిక నిజాలు బయటపెట్టిందని పేర్కొన్నారు. ఇద్దరు మంత్రులు సరదాగా చేసుకున్న సంభాషణను సీఎం రేవంత్ రెడ్డి ట్యాపింగ్ ద్వారా తెలుసుకున్నారని అన్నారు. ఈ క్రమంలోనే ఆ సంభాషణకు సంబంధించి ఓ మంత్రిని పిలిపించుకుని క్లాస్ తీసుకున్నారని చెప్పారు.ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ చేస్తూనే రేవంత్‌రెడ్డి ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారు. దీనికి భాజపా కూడా మద్దతిస్తోంది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రజలకు ప్రైవసీ లేకుండా పోయింది. సీఎం అక్రమ ఆదేశాలు, మెప్పు కోసం రాజ్యాంగ హక్కులను హరించేలా వ్యవహరిస్తున్న పోలీసు అధికారుల్ని వదలబోం. కేసీఆర్, కేటీఆర్ కాదు.. ప్రజల స్వేచ్ఛను హరిస్తున్న రేవంత్‌రెడ్డి ముందు జైలుకు వెళ్తారు. సిట్‌కు ఇప్పటికే నేను సమాధానం పంపించాను. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఒక్క అధికారినే పదే పదే విచారణకు పిలవడం సరికాదు. ఇతర అధికారులను కూడా పిలిచి విచారించాలని ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు.

## ఇడి విచారణకు సమయం కావాలి

### నేటి విచారణకు హాజరు కాలేనన్న రానా

హైదరాబాద్,జులై 22: ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ కేసులో ఇడి విచారణకు సమయం కావాలని నటుడు దగ్గుబాటి రానా కోరారు. ఈడీ జారీ చేసిన సమన్ల ప్రకారం రానా దగ్గుబాటి జూలై 23న విచారణకు హాజరు కావాల్సి ఉంది. అయితే నేటి విచారణకు రానా దగ్గుబాటి హాజరు కావట్లేదు. ఈ విచారణకు మరింత సమయం కావాలని ఈడీని రానా కోరినట్లు సమాచారం. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ టాలీవుడ్‌తో పాటు పలు ఇండస్ట్రీలో ఉన్న సినీ ప్రముఖులకు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నోటీసులు అందుకున్న వారిలో రానా దగ్గుబాటి, ప్రకాష్ రాజ్, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మి తదితరులు ఉన్నారు. వీరికి ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల ప్రచారానికి సంబంధించి ఈడీ మనీలాండరింగ్ కోణంలో విచారణ జరుపుతోంది. ఈ యాప్‌ల ద్వారా కోట్లాది రూపాయల అక్రమ లావాదేవీలు జరిగాయని ఈడీ అనుమానిస్తోంది. బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసిన సినీ సెలబ్రిటీ-లు, యూట్యూబర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లపై ఈడీ కేసులు నమోదు చేసింది. రానా దగ్గుబాటి గతంలో జంగ్లీ రమ్మీ అనే యాప్‌ను ప్రమోట్ చేశాడని ఆరోపణలు ఉన్నాయి. అయితే, రానా పీఆర్ టీమ్ దీనిపై స్పందిస్తూ.. చట్టబద్ధంగా ప్రభుత్వం ఆమోదించిన గేమింగ్ యాప్‌లకు మాత్రమే రానా బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించాడని ఆ ఒప్పందం 2017లోనే ముగిసిందని అతడి టీమ్ తెలిపింది.

# శేషప్రశ్నగా ధన్‌ఖడ్ రాజీనామా వ్యవహారం!

పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైన తొలిరోజే..అనూహ్యంగా భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ రాజీనామా చేయడం సహజంగానే ఆశ్చర్యాన్ని కలిగించడమే కాకుండా...అనుమానాలను రేకెత్తించింది. బెంగాల్ గవర్నర్‌గా ఆయన పనితీరును ప్రశంసించిన మోడీ అనూహ్యంగా ఆయనను ఉపరాష్ట్రపతి పదవికి ఎంపిక చేశారు. వెంకయ్యనాయుడు పదవీకాలం ముగియగానే పొడిగించమో లేదా..రాష్ట్రపతిగా ప్రమోషన్ ఇవ్వడమో జరుగుతుందని అంతా అనుకున్నారు. అయితే అవేవీ జరగలేదు. మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత అన్నీ అనూహ్యాలే జరుగుతున్నాయి. అద్వానీని రాష్ట్రపతిని చేస్తారని అంతా భావించారు. బిజెపి శ్రేణులు గట్టిగా నమ్మారు. కానీ రామ్‌నాథ్ కోవింద్‌ను తెరపైకి తెచ్చి అద్వానీని అవమానించారు. ఈ దేశానికి ప్రధాని కావాలని గట్టిగా నమ్మి పార్టీ కోసం కృషి చేసిన అద్వానీకి మోడీ అడ్డుపడ్డాడు. ఆతరవాత రాష్ట్రపతిని చేస్తారని అనుకుంటే...అప్పుడు కోవింద్ తెరపైకి వచ్చారు. ఇక అద్వానీ శకం ముగిసింది. మురళీమనోహర్ జోషి శకం ముగిసింది. పాతతరంలో రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీలు మాత్రమే ఇప్పుడు మోడీ ప్రభుత్వంలో ఉన్నారు. వెంకయ్యనాయుడును పార్టీ నుంచి తప్పించే క్రమంలో ఉపరాష్ట్రపతిని చేసి, ఆ తరవాత ఆయనను ఇంటికే పరిమితం చేశారు. ఇప్పుడు ధన్‌ఖడ్ రాజీనామా కూడా అనూహ్యమే అయినా మోడీ వ్యూహం ఉండేవుంటుంది. పార్లమెంటు ప్రారంభంకావడం, తొలిరోజే అనూహ్యంగా విపక్షాలు వివిధ అంశాలపై చర్చకు పట్టుబట్టడం వంటి పరిణామాల నేపథ్యంలో ఎందుకు రాజీనామా చేశారన్న ప్రశ్న ఉదయిస్తోంది. అయితే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజీనామాను ఆమోదించారు. ఈ మేరకు ఫైల్‌పై సంతకం చేశారు. కాగా, గత రాత్రి అనూహ్యంగా జగదీప్ ధన్‌ఖర్ తన పదవికి రాజీనామా చేశారు. అనారోగ్య కారణాలతో పదవి నుంచి వైదొలుగుతున్నట్లు పేర్కొన్నారు. కానీ, ఈ రాజీనామాకు అసలు కారణం అనారోగ్యం కాదని పలువురు రాజకీయ నేతలు అంటున్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల వేళ ఉప రాష్ట్రపతి అనూహ్యంగా తన పదవికి రాజీనామా చేయడంఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. ఉపరాష్ట్రపతి రాజీనామాపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తొలిసారి స్పందించారు. ఉపరాష్ట్రపతి సహా వివిధ హోదాల్లో దేశానికి సేవ చేసేందుకు ధన్‌ఖడ్‌కు అనేక అవకాశాలు లభించాయ న్నారు. ఆయన మంచి ఆరోగ్యంతో ఉండాలని కోరుకుంటున్నట్లు- పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వడం, వైద్యుల సలహాను పాటించడం కోసమే తాను ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నానని ధన్‌ఖడ్ తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. రాజ్యాంగంలోని 67(ఏ) అధికరణ కింద ఇది తక్షణమే అమలులోకి వస్తుందని తెలిపారు. ఈ మేరకు ఉపరాష్ట్రపతి కార్యాలయం ఈ లేఖను విడుదల చేసింది. తన బాధ్యతలను నిర్వర్తించడంలో పూర్తి సహకారాన్ని అందచేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు, ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అయితే మరో రెండేండ్లు పదవీకాలం ఉండగానే ధన్‌ఖడ్ రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది. ఎందుకిలా అన్న చర్చ సాగుతోంది. 2022లో ఎన్డీయే తరపున ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నామినేట్ కావడంతో ఆయన బెంగాల్ గవర్నర్ పదవికి రాజీనామా చేశారు.విపక్ష అభ్యర్థి మార్గరేట్ అల్వాపై విజయం సాధించి ఉపరాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. 710 ఓట్లకుగాను 528 ఓట్లు గెలుచుకుని 1997 తర్వాత అత్యధిక ఓట్లతో ఉపరాష్ట్రపతిగా విజయం సాధించిన వ్యక్తిగా రికార్డు సృష్టించారు. ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన మూడో వ్యక్తి ధన్‌ఖడ్. అంతకుముందు 1969లో రాష్ట్రపతి పదవికి పోటీ చేసేందుకు వీవీ గిరి, 1987లో రాష్ట్రపతిగా ఎన్నిక కావడంతో ఆర్ వెంకటరామన్ ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేశారు. కానీ
అలాంటిదేమీ లేకుండానే ధన్‌ఖడ్ రాజీనామా చేయడం ఢిల్లీ రాజకీయాలలో ఆసక్తికరంగా మారింది.



ఓ న్యాయమూర్తి నివాసంలో భారీగా నగదు లభించడం, కేంద్ర ప్రభుత్వంతో వివాదం, రాజ్యసభలో జరిగిన కొన్ని సంఘటనలు దన్‌కడ్ రాజీనామా వెనక ఉన్నాయని చెబుతున్నారు. ఈ నిర్ణయం ప్రస్తుతం దేశ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. జస్టిస్ యశ్వంత్ వర్మ అనే న్యాయమూర్తి నివాసంలో భారీగా నగదు లభ్యం కావడంతో ఈ వివాదం మొదలైంది. ఈ సంఘటన తర్వాత విపక్ష పార్టీలు రాజ్యసభ లో జస్టిస్ వర్మను తొలగించేందుకు ఒక నోటీసును ప్రవేశపెట్టాయి. రాజ్యసభ అధ్యక్షుడిగా ఉన్న జగదీప్ ధన్‌ఖర్ ఈ నోటీసును ఆమోదించి, రాజ్యసభ కార్యదర్శికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ చర్య కేంద్ర ప్రభుత్వానికి నచ్చలేదని తెలుస్తోంది. విపక్షాలు ప్రవేశపెట్టిన ఈ నోటీసును ఆమోదించడం ద్వారా, న్యాయవ్యవస్థలో అవినీతిపై కేంద్రం నేరుగా చర్యలు తీసుకునే అవకాశాన్ని ధన్‌ఖర్ తప్పించారని కేంద్రం భావించినట్లు సమాచారం. ఈ విషయంపై కేంద్రంతో విభేదాలు వచ్చాయని పుకార్లు కూడా వచ్చాయి. ఈ సంఘటన తర్వాత ధన్‌ఖర్‌పై అవిశ్వాస తీర్మానం తీసుకొచ్చే ప్రయత్నాలు మొదల య్యాయని తెలిసింది. ఆరు నెలల క్రితం కూడా విపక్షాలు ధన్‌ఖర్‌పై అవిశ్వాస తీర్మానం తీసుకొచ్చాయి. అయితే, ఈసారి కేంద్రం నుంచి వచ్చిన ఒత్తిడి కారణంగా, ధన్‌ఖర్ అవమానకరమైన అవిశ్వాస తీర్మానానికి బదులు రాజీనామా చేయడాన్ని ఎంచుకున్నారని తెలుస్తోంది. ఈ క్రమంలో జరుగుతున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకుని సోమవారం రాత్రి 9:25 గంటలకు ఉప రాష్ట్రపతి అధికారిక ఎక్స్ ఖాతాలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాజీనామా లేఖను పోస్ట్ చేశారు. తన ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వడానికి, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 67(ఎ) ప్రకారం రాజీనామా చేస్తున్నట్లు- లేఖలో తెలిపారు. ఇది వెంటనే అమల్లోకి వచ్చేలా భారత ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నానని చెప్పారు. ఈ క్రమంలో తన పదవీ కాలంలో సహకరించిన వారికి ధన్‌ఖడ్ కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే, ప్రధానమంత్రి, రాజ్యసభ సభ్యులకు కూడా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అయితే ఇవన్నీ బయటకు కనిపిస్తున్న కారణాలే అయినా ఇంకా ఇతరత్రా ఏ కారణాలు ఉన్నాయన్నది కాలక్రమంలో తెలుస్తుంది. అయితే ధన్‌ఖడ్ మోడీకి ఇష్టమైన వ్యక్తిగా అనూహ్యంగా దూసుకుని వచ్చి..అంతే అనూహ్యంగా రాజీనామా చేసి వెళ్లిపోవడమనే చర్య మాత్రం అనుమానాలను రేకెత్తిస్తూనే ఉంటుంది.

## మద్యనిషేధం పేరుతో అధికారంలోకి వచ్చి దోపిడీ

**వైసిపి హయాంలో ఏరులై పారిన అక్రమ మద్యం**

**నిధులు దోచుకుని...ప్రజల ప్రాణాలు మింగేశారు**

**రప్పారప్పా అని బెదిరిస్తే..బెదిరే వారు లేరు**

**బదిరింపు రాజకీయాలను జగన్ మానాలి**

**మీడియా సమావేశంలో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్**

అమరావతి,జులై 22: మద్యం నిషేధిస్తామని చెప్పిన జగన్.. అధికారంలోకి వచ్చి ఏం చేశారని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రశ్నల వర్షం కురిపించారు. ఏపీలో గత వైసీపీ ప్రభుత్వం మద్యం ఏరులై పారించిందని ఆరోపించారు. మద్య నిషేధం నినాదంతో అధికారంలోకి వైసీపీ వచ్చిందని.. కానీ ఆ హామీని జగన్ మర్చిపోయారని మండిపడ్డారు. అనేక మందికి నాసిరకం మద్యంతో లివర్ దెబ్బ తిని ప్రాణాలు కోల్పోయారని చెప్పుకొచ్చారు.మంగళవారం పవన్ మీడియతో మాట్లాడుతూ.. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ సచివాలయంలో పవన్ కల్యాణ్ మీడియాతో మాట్లాడారు. జనసేన పార్టీ కార్యాలయానికి అనేక మంది బాధితులు వచ్చారని.. ఇప్పుడు మద్యం కుంభకోణంలో అనేక మంది అరెస్టు అవుతున్నారని తెలిపారు. ఒకవైపు నిధులు తినేశారు.. మరోవైపు జనం ప్రాణాలు తీశారని పవన్ కల్యాణ్ ధ్వజమెత్తారు. అయినా ఇంకా బెదిరింపుల ధోరణితో జగన్, వైసీపీ నేతలు మాట్లాడుతున్నారని పవన్ కల్యాణ్ ఫైర్ అయ్యారు. ఇటువంటి కాగితపు బెదిరింపులకి ఎవరూ భయపడరని.. ఇలాంటి తాటాకు చప్పుళ్లు చాలా చూశామని హెచ్చరించారు. ఎన్నో పోరాటాలు చేసి ఇక్కడ నిలబడ్డామని... ఇంతటి ప్రజాతీర్పుతో అధికారంలోకి వచ్చామని ఉద్ఘాటించారు. అవినీతి, అడ్డగోలుగా వ్యవహరించి కూడా ఇంకా ఎందుకు అరుస్తున్నారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వారి అరుపులను పట్టించుకోదని చెప్పుకొచ్చారు. వాళ్లు రప్పా రప్పా అంటే తాము మెడలు కోయించు కోవడానికి సిద్ధంగా లేమని హెచ్చరించారు. వాళ్లు కోస్తామంటే తాము మరోవైపు నుంచి మెడ చూపిస్తామా..అని ప్రశ్నించారు. ఇక్కడ ఎవరూ అంత తేలికగా లేరని పవన్ కల్యాణ్ వార్నింగ్ ఇచ్చారు. రాజధాని అమరావతి భూ సమీకరణపై తన నిర్ణయాన్నిఇప్పటికే సీఎం చంద్రబాబుకి చెప్పానని.. సీఎం కూడా తన అభిప్రాయంతో ఏకీభవించారని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. అందరిని ఒప్పించి వాళ్లను కూడా భాగస్వాములుగా చేసి ముందుకు వెలుదామని చెప్పానని.. అందుకు సీఎం కూడా ఒప్పుకున్నారని తెలిపారు. మనం అమరావతి ఏకైక రాజధాని అని చెప్పి అధికారంలోకి వచ్చామని గుర్తుచేశారు. అందుకనే వివాదాలు చేయకూడదని చెప్పానని అన్నారు. తమ ప్రభుత్వానికి ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమని ఉద్ఘాటించారు. మంచి సినిమా కథలు వస్తే నిర్మాతగా వ్యవహరిస్తానని.. ఈ అంశాలన్నీ కూడా సీఎం చంద్రబాబుకు కూడా చెప్పానని గుర్తుచేశారు. సీఎంకు చెప్పిన అనంతరేమే సినిమాల గురించి నిర్ణయాలు తీసుకున్నానని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## కేరళ కాంగ్రెస్‌లో థరూర్ వివాదం

**ఆయనను దూరం పెట్టామన్న మురళీధరన్**

**ఏ అధికారంతో ఈ ప్రకటన చేశారంటూ థశిథరూర్ ఎదురుదాడి**



తిరువనంతపురం,జులై 22: కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ కు సొంత పార్టీ నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఓ రకంగా ఆయనను దూరం పెట్టే ప్రయత్నాలు సాగుతున్నాయి. కాంగ్రెస్ వైఖరికి భిన్నంగా వెళ్తున్న తిరువనంతపురం ఎంపీ శశథరూర్‌కు, కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ- మాజీ అధ్యక్షుడు కె.మురళీధరన్ కు మధ్య మాటలు తూటాలు పేలుతున్నాయి. జాతీయభద్రత విషయంలో పార్టీలకు అతీతంగా స్పందించాలంటూ శశిథరూర్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై మురళీధరన్ గత ఆదివారంనాడు ఘాటుగా స్పందించారు. అతన్ని పార్టీ కార్యకలాపాలకు దూరం పెడుతున్నామంటూ కాంగ్రెస్ కు చెందిన మరోనేత మురళీధరన్ తీవ్ర వ్యాఖ్యలు చేసిన క్రమంలో తాజాగా థరూర్ స్పందిస్తూ.. అలా చెప్పడానికి ఆయనకు పార్టీలో ఏ అధికారం ఉందని ప్రశ్నించారు. మురళీధరన్ వ్యాఖ్యలపై విలేకరులు ప్రశ్నించగా.. థరూర్ స్పందిస్తూ.. ఇలాంటి వాదనలు చేయడానికి వారి వద్ద ఎలాంటి ఆధారం ఉందని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలు చేస్తున్నవారికి పార్టీలో ఏ అధికారం లేదంటూ మురళీధరన్‌ను ఉద్దేశించి పేర్కొన్నారు. పలువురు ఎలాంటి ఆధారాలు లేకుండా మాట్లాడుతున్నారని, వాటిన్నింటికీ స్పందించాల్సిన అవసరం తనకు లేదన్నారు. వేరేవాళ్ల ప్రవర్తన గురించి తనను అడగొద్దని. తన గురించి మాత్రమే మాట్లాడతానని వ్యాఖ్యానించారు. పార్టీ ప్రయోజనాల కంటే దేశానికే ప్రాధాన్యం ఇవ్వాలని థరూర్ పలుమార్లు ఉద్ఘాటించారు. దీనిపై మురళీధరన్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. శశిథరూర్ తన తీరు మార్చుకునే వరకు తిరువనంతపురంలో నిర్వహించే పార్టీ కార్యక్రమాలకు ఆహ్వానించబోమన్నారు. మాతో
కలిసి లేరు కాబట్టి.. ఆయన్ను బహిష్కరించే ప్రశ్నే ఉత్పన్నం కాదన్నారు. ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోవాలో పార్టీ అధిష్ఠానం నిర్ణయిస్తుందని తెలిపారు. కేరళలోని యూడీఎఫ్ నేతల్లో సీఎం అభ్యర్థిగా శశిథరూర్ వైపే మొగ్గు ఉందంటూ ఓ సర్వేకు సంబంధించిన పోస్టుపైన మురళీధరన్ గతంలోనూ విరుచుకుపడ్డారు. కొచ్చిలో ఓ హైస్కూలు విద్యార్థి అడిగిన ఒక ప్రశ్నకు శశిథరూర్ సమాధానమిస్తూ, మన సాయుధ దళాలకు, మన ప్రభుత్వానికి మద్దతు ఇవ్వడం సరైనదేనని తాను నమ్మడం వల్ల అనేక మంది తనను విమర్శించారని, అయితే తన వైఖరి సరైనదేనని నమ్మి దానిపై నిలబడ్డానని చెప్పారు. రాజకీయాలు అంటేనే పోటీ- అని, తనలాంటి వాళ్లు పార్టీని గౌరవిస్తారని, అయితే జాతీయ భద్రత విషయానికి వచ్చేసరికి మనం ఇతర పార్టీలతో కలిసి పనిచేయాల్సిన అవసరం వస్తుందని అన్నారు. అలాంటి సందర్భాల్లో ఒక్కోసారి పార్టీలు దానిని అవిధేయతగా భావిస్తుంటాయని, అదే పెద్ద సమస్య అని అన్నారు. జాతీయ భద్రతకు తాను ఎప్పుడూ తొలి ప్రాధాన్యతనిస్తానని, ఏ రాజకీయ పార్టీ అయినా దేశాన్ని మెరుగుపరచాలనే కోరుకుంటు-ందని చెప్పారు. సిద్ధాంతాల పరంగా పార్టీల మధ్య వైరుధ్యాలు ఉన్నా సురక్షితైన భారత్‌కు అవన్నీ కట్టుబడి ఉండాలన్నారు. జాతీయ ఐక్యతకు రాజకీయాలు అడ్డుకారాదని అన్నారు.

# తిరుమలలో వైకుంటం క్యూ కాంప్లెక్స్-3 నిర్మాణం

**తిరుమల కార్యాలయాలన్నింటికి ఒకే పరిపాలనా భవనం**

**అలిపిరి వద్ద సదుపాయాల కోసం కమిటీ నియామకం**

**ఒంటిమిట్ట రామాలయంలో నిరంతరాయంగా అన్నప్రసాద వితరణ**

**టిటిడి పలుకీలక నిర్ణయాలు...వెల్లడించిన ఇవో,ఛైర్మన్**

తిరుమల,జులై 22: తిరుమలలో రోజురోజుకూ పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా వైకుంఠం క్యూ కాంప్లెక్స్-3 నిర్మించేందుకు.. దీనిపై సాధ్యసాధ్యాలను పరిశీలించేందుకు నిపుణుల కమిటీ వేయాలని
నిర్ణయించినట్లు టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, ఇవో శ్యామలారావు తెలిపారు. తిరుమలలో అన్ని కార్యాలయాలు ఒకచోట ఉండేలా పరిపాలనా భవనం నిర్మించాలని నిర్ణయించామన్నారు. తిరుమల తిరుపతి దేవస్థాన పాలకమండలి మంగళవారం సమావేశం అయింది. ఈ సమావేశంలో టీటీడీ పాలకమండలి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. పాలక మండలిలో తీసుకున్న నిర్ణయాలను మీడియాకు ఛైర్మన్ బార్ నాయుడు, టీటీడీ ఈవో శ్యామలరావు వెల్లడించారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ -3 నిర్మాణంపై చర్చించామని... కమిటీ- నివేదిక మేరకు ఈ నిర్మాణంపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. సామాన్య భక్తులకు అదనంగా వసతి సదుపాయలు కల్పించాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు. అలిపిరి వద్ద మౌలిక సదుపాయాల కల్పనకు ఓ కమిటీని నియమించనున్నట్లు ప్రకటించారు. శిలాతోరణం, చక్రతీర్థం అభివృద్ధి చేయాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఆలయాల నిర్మాణ అధ్యాయనానికి ఓ కమిటీ వేయనున్నట్లు- వివరించారు. శ్రీవారి సేవను విశ్వవ్యాప్తం చేసే విధంగా కో ఆర్డినేటర్ల నియామకానికి ఆమోదం తెలిపారు. సైబర్ సెక్యూరిటీ ల్యాబ్ ఏర్పాటుకు ఆమోదించారు. కల్యాణకట్టల వద్ద పారిశుద్ధం పెంపునకు, తిరుమలలో పరిపాలన భవనాన్ని నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారు. పాత భవనాలని తొలగించి వాటి స్థానంలో నూతన భవన నిర్మాణాలు చేపట్టాలని ఆమోదించారు. ఒంటిమిట్ట ఆలయంలో త్వరలోనే అన్నదానం ప్రారంభించనున్నారు. రూ. 4.7 కోట్లతో అన్నదానం కోసం నూతన భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. 320 ఆలయాలకు మైక్ సెట్లు- ఇవ్వడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. 700 మంది వేద పారాయణదారుల నియామకానికి ఆమోదం తెలిపారు. ఇందుకోసం రూ.18కోట్ల నిధులు కేటాయించ నున్నారు. 600 మంది వేద పారాయణదారులకు నిరుద్యోగ భృతి ఇవ్వడానికి ఆమోదించారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా ఏపీలోని పలు దేవాలయాల వద్ద భజన మండలాల నిర్మాణానికి ఆమోదం తెలిపినట్లు టీటీడీ ఈవో శ్యామలరావు పేర్కొన్నారు. ఒంటిమిట్ట రామాలయంలో ఆగస్టు నుంచి అక్కడ మూడు పూటలా భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తామన్నారు. ఏఐ టెక్నాలజీ అమలుకు విధానపరంగా కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయని బీఆర్



నాయుడు చెప్పారు. దీన్ని అధిగమించేందుకు రెండు ప్రముఖ సంస్థలు కసరత్తు చేస్తున్నాయన్నారు. త్వరలోనే ఏఐ సాంకేతికత అమలు చేసి భక్తులకు త్వరితగతిన దర్శనం కల్పిస్తామని తెలిపారు. హిందూయేతర ఉద్యోగులపై విజిలెన్స్ విచారణ కొనసాగుతోందని ఆయన చెప్పారు. అన్యమత ఉద్యోగులపై నిఘా పెట్టామని.. ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. తితిదే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. శ్రీవారి దర్శనానికి వచ్చే సాధారణ భక్తులకు ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఈవో శ్యామలరావు తెలిపారు. ఎక్కువ సమయం వేచి ఉండకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అలిపిరి, శ్రీవారి మెట్టు- నడకమార్గంలో వచ్చేవారికి
మెరుగైన వసతులు కల్పిస్తాం. శిలాతోరణం, చక్రతీర్థం సమగ్రాభివృద్ధికి ఆర్కిటెక్చరల్ కన్సల్టెన్సీ నియామకంపై చర్చించాం. వసతి గదుల కోసం వేచి ఉండేవారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్ల కోసం చర్యలు చేపడతాం. తితిదే తరఫున ఆలయాల విస్తరణపై ఆలోచనలు చేస్తున్నాం. శ్రీవారి సేవకు సంబంధించి చాలా సంస్కరణలు తీసుకొస్తున్నాం. డిజిటల్, సోషల్ మీడియా ద్వారా భక్తులకు జరిగే మోసాలను నివారించే అంశంపై చర్చించాం. తితిదేలో 142 మంది కాంట్రాక్ట్ డ్రైవర్లను క్రమబద్ధీకరించి ప్రభుత్వ ఆమోదానికి పంపాలని నిర్ణయించామని తెలిపారు. తిరుమలలో భక్తుల వేచి ఉండేందుకు అనువైన నిర్మాణాలు ఎలా చేయాలనే దానిపై కన్సల్టెన్సీని నియామకం చేపడతాం అన్నారు. ఎస్సీ, ఎస్టీ వెనుకబడిన ప్రాంతాల్లో మూడు కేటగిరీల్లో భజన మందిరాలు నిర్మించేందుకు శ్రీవాణి ట్రస్ట్ నిధులు విడుదల చేస్తాం. కడపలో వేల సంవత్సరాల చరిత్ర గల శివాలయం అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామని ఈవో తెలిపారు.

# విడాకుల కేసులో ఆసక్తికర పరిణామం

**భర్త ఆదాయానికి మించి భరణం కోరడంపై సిజె అభ్యంతరం**

న్యూఢిల్లీ,జులై 22(ఆర్‌ఎన్):సుప్రీంకోర్టులో ఓ విడాకుల కేసులో భరణం చెల్లించే విషయంలో మంగళవారం ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. విడాకుల నేపథ్యంలో భర్త నుంచి భరణాన్ని మహిళ కోరడంతో.. భారత ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భర్త నుంచి విడాకులు తీసుకునే క్రమంలో తనకు ముంబైలో ఇల్లు, రూ. 12 కోట్ల నగదుతోపాటు బీఎండబ్ల్యూ కారు భరణంగా ఇప్పించాలంటూ తన పిటిషన్‌లో ఆమె కోరింది. ఈ పిటిషన్ సీజేఐ బీఆర్ గవాయి ముందుకు వచ్చింది. దీనిని ఆయన పరిశీలించి.. కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆమెతో సీజేఐ బీఆర్ గవాయి మాట్లాడుతూ.. మీరు బాగా చదువుకున్నారు. ఎంబీఏ కూడా చేశారు. ఐటీ- ఉద్యోగం సైతం చేస్తున్నారని.. మీరు బెంగళూరు, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో మీకు మంచి డిమాండ్ ఉందన్నారు. మీరు అక్కడ ఎందుకు ఉద్యోగం చేయకూడదంటూ ఆమెను సూటిగా ప్రశ్నించారు. మీరు కోరుతున్న ఇల్లు కల్పతరువులో ఉందన్నారు. అది కూడా బిల్డర్ చేతిలో ఉందని గుర్తు చేశారు. అదీకాక మీ వివాహమై కేవలం 18 నెలలు మాత్రమే అయిందన్నారు. ఆ క్రమంలో మీరు నెలకు కోటి రూపాయిల నగదు అడుగుతున్నట్లుగా ఉందని పేర్కొన్నారు. సీజేఐ వ్యాఖ్యలపై ఆ మహిళ స్పందిస్తూ.. విడాకులు కోరుతున్న తన భర్త బాగా ధనవంతుడని చెప్పింది. తనకు స్కిజోఫ్రెనియా ఉందని.. అందుకే విడాకులు ఇస్తున్నట్లు అతడు స్పష్టం చేశారన్నారు. అయితే తనకు స్కిజోఫ్రెనియా ఉన్నట్లు- కనిపిస్తుందా? అంటూ సీజేఐను ఈ సందర్భంగా ఆమె ప్రశ్నించింది. ఇంతలో భర్త తరఫు న్యాయవాది మాధవి దివాన్ జోక్యం చేసుకున్నారు. ఆమె ఉద్యోగం చేస్తుందన్నారు. ఇలా ప్రతి దానిని డిమాండ్ చేయడం సరికాదని వ్యాఖ్యానించారు. ఆ క్రమంలో సీజేఐ బీఆర్ గవాయి స్పందిస్తూ.. విడాకుల కోసం పిటిషన్ దాఖలు చేసిన నీ భర్త ఆస్తి.. అతడి తండ్రిదని స్పష్టం చేశారు. ఇక ఆ యువతి అందుకు సమాధానమిస్తూ.. తన భర్త బ్యాంక్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తూనే
మరోవైపు రెండు వ్యాపారాలు చేస్తున్నారని చెప్పారు. తనకు కుమారుడు ఉన్నాడని.. అతడిని తనకు ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. కానీ తనకు స్కిజోఫ్రెనియా ఉందన్నాడని తెలిపారు. అందుకే తన నుంచి విడాకులకు అతడు దరఖాస్తు చేశాడని వివరించారు. ఆ క్రమంలో తన కుమారుడిని తనకు



ఇవ్వలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తాను ఉద్యోగం సైతం చేశానని తెలిపారు. అయితే ఆ ఉద్యోగానికి తన భర్త బలవంతంగా రాజీనామా చేయించారని సీజేఐకి ఈ సందర్భంగా వివరించింది. మరోవైపు ఆమె భర్త పన్ను రిటర్న్‌లను కోర్టు పరిశీలించి.. అతడి ఆదాయం తక్కువగా ఉందని గుర్తించింది. ఆ క్రమంలో ఫ్లాట్ తీసుకుని మంచి ఉద్యోగాన్ని వెతుక్కోండంటూ ఆమెకు సూచించారు. అలా కాకుంటే.. రూ. 4 కోట్లు- భరణం తీసుకుని.. పుణె, హైదరాబాద్, బెంగళూరులో మంచి ఐటీ- ఉద్యోగాన్ని సంపాదించాలన్నారు. మీరు బాగా చదువుకుని కూడా.. బతుకు తెరువు కోసం ఇలా అడగడం భావ్యం కాదని భారత ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయి అభిప్రాయపడ్డారు. అనంతరం ఈ కేసులో తీర్పును ఆయన రిజర్వు చేశారు.

## రికార్డు స్థాయిలో మహిళల ఉచిత ప్రయాణం

**ఆడబిడ్డలకు సిఎం శుభాకాంక్షలు**



హైదరాబాద్,జులై 22: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహాలక్ష్మి స్కీమ్ ప్రారంభించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పథకాన్ని అమలు చేసింది. 18 నెలలుగా ఎలాంటి ఆటంకం లేకుండా విజయవంతంగా సాగుతోన్న మహాలక్ష్మి స్కీమ్ అరుదైన మైలురాయిని అందుకుంది. ఈ స్కీములో భాగంగా ఇప్పటి వరకు 200 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారు. మహాలక్ష్మి స్కీమ్ ఈ అరుదైన ఘనత అందుకోవడంపై సీఎం రేవంత్ రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. 18 నెలల ప్రజా పాలనలో 200 కోట్ల జీరో టికెట్ల మైలురాయిని దాటి ఆడబిడ్డల ఉచిత బస్సు ప్రయాణ పథకం విజయవంతంగా కొనసాగుతుండటం ఆనందంగా ఉందన్నారు. ఈ పథకంలో లబ్ధిదారులైన ప్రతి ఆడబిడ్డకు అభినందనలు తెలుపుతున్నానని అన్నారు. ఈ పథకాన్ని దిగ్విజయంగా అమలు చేయడంలో భాగస్వాములైన ఆర్టీసీ కార్మికులు, సిబ్బంది, యాజమాన్యానికి సీఎం రేవంత్ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# పరిసరాల పరిశుభ్రతతో సీజనల్ వ్యాధుల వ్యాప్తి నియంత్రణ

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**
**నీరు నిల్వ ఉండకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలి**
**డ్రైనేజీలు, నీటి కాలువల మీద చెత్త వేయకుండా అవగాహన**
**లిమీకృత జిల్లా కలెక్టరేట్ లో సీజనల్ వ్యాధుల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యల పై సమీక్షించిన జిల్లా కలెక్టర్**

**పెద్దపల్లి, ప్రతినిధి జూలై 22 అక్షరం న్యూస్**

మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల సీజనల్ వ్యాధుల వ్యాప్తి నియంత్రించవచ్చని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలి అన్నారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ లో లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంగళవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే. అరుణ్ శ్రీలి తో కలిసి సీజనల్ వ్యాధుల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యల పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,లి సీజనల్ వ్యాధుల వ్యాప్తి అరికట్టేందుకు పారిశుధ్య నిర్వహణ చాలా కీలకమని అన్నారు . గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో పారిశుధ్య నిర్వహణకు స్థానిక సంస్థల అధికారులు అత్యంత ప్రాధాన్యత కల్పించాలని, ప్రతి రోజూ పారిశుధ్య పనులను పర్యవేక్షించాలని అన్నారు. రోడ్ల పై చెత్త రెగ్యులర్ గా క్లీన్ చేయాలని, ప్లాస్టిక్ వాడకుండా అవగాహన కల్పించాలని అన్నారు. ప్రతి ఫ్రై డే డ్రై డే కార్యక్రమం పక్కాగా అమలు చేయాలని, నీరు నిల్వ ఉంటే వచ్చే దోమలు, వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని అన్నారు. రోడ్ల పై ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, అధికంగా నీరు నిల్వ ఉండే డ్రైనేజీలు, ఇతర గుంతలలో పెద్ద ఎత్తున ఆయిల్ బాల్స్ వేయాలని అన్నారు. డ్రైనేజీ లలో చెత్త వేయడం వల్ల నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతుందని, ప్రజలు డ్రైనేజీలలో చెత్త వేయకుండా అవగాహన కల్పించాలని అన్నారు. నీటి కాలువల కట్టమీద పేరుకుపోయే చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని, అక్కడ చెత్త వేయరాదు అనే బోర్డు లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. గ్రామీణ ,పట్టణ ప్రాంతాల్లో ఉండే విద్యా సంస్థల్లో పారిశుధ్య నిర్వహణకు స్థానిక సంస్థల అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. సీజనల్ వ్యాధులు అరికట్టడంలో ఎక్కడైనా నిర్లక్ష్యం వహిస్తే కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు.సీజనల్



వ్యాధులకు సరైన చికిత్స అందించేందుకు ప్రభుత్వ ఆసుపత్రులను సన్నద్ధం చేసుకోవాలని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయిలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన కిట్లను అందుబాటులో పెట్టాలని కలెక్టర్ సూచించారు. లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని అన్నారు.జిల్లాలో డెంగ్యూ పాజిటివ్ కేసు ప్రైవేట్ ఆస్పత్రిలో నమోదైన మనకు సమాచారం అందేలా వ్యవస్థ ఏర్పాటు చేయాలని అన్నారు. డెంగ్యూ కేసు నమోదైన ప్రాంతంలో ఫీవర్ సర్వే నిర్వహణ పై చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. డెంగ్యూ, మల్లేరియా చికెన్ గున్యా వంటి సీజనల్ వ్యాధులతో బాధపడే వారికి అవసరమైన చికిత్స సకాలంలో అందేలా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అన్న ప్రసన్న కుమారి, డివిజనల్ పంచాయతీ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పేలుడు పదార్థాలపై జిల్లా టాస్క్ ఫోర్స్, ముస్తాబాద్ పోలీసుల ఆకస్మిక దాడులు

### పలు పేలుడు పదార్థాలు, సంబంధిత సామాగ్రి స్వాధీనం... ముగ్గురు పై కేసు నమోదు..

**రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /జులై -22(అక్షరం న్యూస్ )**

ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా విక్రయిస్తున్న పేలుడు పదార్థాలైన జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్స్ బాక్సులను టాస్క్ ఫోర్స్, ముస్తాబాద్ పోలీసులు పట్టుకున్న సంఘటన ముస్తాబాద్ మండలం నామపూర్ గ్రామం లో చోటుచేసుకుంది ముస్తాబాద్ మండలం నామపూర్ గ్రామం లో నిజామాబాద్ జిల్లా నందిపేట్ గ్రామానికి చెందిన గడిపర్తి శ్రీనివాస్ రావు అతని యజమాని ఓర్పు సాయి మల్లు ఆదేశాల మేరకు టాటా వాహనము లో ఎలాంటి అనుమతులు లేకుండా పేలుడు తీసుకువచ్చి నామ పూర్ గ్రామంలోని శివరాత్రి రాజు అనే వ్యక్తి కి బండ పనుల నిమిత్తం అమ్ముతుండగా నమ్మధగిన సమాచారం మేరకు జిల్లా టాస్క్ ఫోర్స్ సీ ఐ నటేష్, ముస్తాబాద్ ఎస్ ఐ గణేష్ ఆధ్వర్యంలో దాడులు చేశారు వారి వద్ద నుండి 2600 జిలెటిన్ స్టిక్స్, 405ఐడియాల్ బూస్టర్ జిలిటెన్ స్టిక్స్,6000వేల మీటర్ల ఐడియాల్ కార్డ్స్ వైరు, 175డెటోనేటర్స్, తో పాటు టాటా యోదా వాహనము స్వాధీనం చేసుకొని శ్రీనివాస్ రావు, శివరాత్రి రాజు, ఓర్పు సాయి మల్లు అనే ముగ్గురు వ్యక్తుల పై కేసు నమోదు చేసి ధర్యాప్తు చెప్పట్టి నట్లు ఎస్ ఐ గణేష్ తెలిపారు. సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ..ఎవరు కూడా ప్రజా నివాస ప్రాంతాల్లో ఎలాంటి లైసెన్స్ లేకుండా జెలాటిన్ స్టిక్స్ కానీ పేలుడు పదార్థాలు నిల్వ ఉంచుతే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.జెలాటిన్



స్టిక్స్ కానీ పేలుడు పదార్థాలు ఎవరైనా వినియెగించాలనుకుంటే దానికి స%శీ%బంధిచిన అనుమతి లైసెన్స్ తప్పని సరిగా తీసుకోవాలన్నారు. ప్రజలు ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన పోలీసులకు సమాచారం అందించాలని కోరారు

# కుటుంబంలో విషాదం నింపిన రోడ్డు ప్రమాదం

- రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి
- నేత్రదానం చేసిన కుటుంబం
- అభినందించిన సదాశయ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు

**జ్యోతి నగర్ ఎన్టిపిసి జూలై 22 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్**

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు, తాను మరణిస్తూ... ఇద్దరికి వెలుగులు ప్రసాదించాడు. పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీ మెటీరియల్ గేట్ సమీపంలో సుభాష్ నగర్ కు చెందిన బోయిని యశ్వంత్(19) అనే యువకుడు, ఎన్టీపీసీలోని సోలార్ ప్లాంటులో పని చేస్తున్నాడు. సోమవారం అర్ధరాత్రి ఎన్టీపీసీ ఆటో నగర్ ప్రాంతంలో రాజీవ్ రహదారి రోడ్డు దాటుతుండగా, లారీ ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. హుటాహుటిన చికిత్స కోసం గోదావరిఖని జీజీహెచ్ ఆస్పత్రికి తరలించారు. యశ్వంత్ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. యశ్వంత్ నేత్రాలను దానం చేస్తే, ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించవచ్చని కుటుంబ సభ్యులకు ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ ప్రదీప్ నాయక్ అవగాహన కల్పించారు. బిడ్డను



కోల్పోయిన దుఃఖంలో ఉన్న తల్లి లక్ష్మీ, సోదరి వర్ణిక, సోదరుడు వేణు స్పందించారు. జశ్వంత్ నేత్రాలను దానం చేయడానికి అంగీకారం తెలిపారు. దీంతో యశ్వంత్ నేత్రాలను ఐ బ్యాంక్ టెక్నీషియన్ ప్రదీప్ నాయక్ సేకరించి హైదరాబాదుకు తరలించారు. ఇద్దరు అంధులకు వెలుగులు ప్రసాదించడానికి అంగీకారం తెలిపిన కుటుంబ సభ్యులను సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు శ్రవణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, గౌరవ అధ్యక్షులు సానా రామకృష్ణారెడ్డి, ముఖ్య సలహాదారులు నూక రమేష్, కార్యదర్శి భీష్మాచారి, ప్రచార కార్యదర్శి కే ఎస్ వాసు, రామగుండం లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు పి. మల్లికార్జున్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎల్లప్ప, కార్యదర్శి సారయ్య, కోశాధికారి రాజేందర్ తదితరులు అభినందించారు. యశ్వంత్ అకాల మరణం పట్ల ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు.

# 28న జరిగే బహిరంగ సభను విజయవంతం చేద్దాం

### రాష్ట్ర కార్యదర్శి రాసమల్ల కొమురయ్య పిలుపు

**జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్) జూన్ 22:**

ఈ నెల 28వ తేదీన సిద్ధిపేటలో జరిగే భారీ బహిరంగ సభను అన్నిరంగాల కార్మికులు హాజరై విజయవంతం చేద్దాం అని టీబీఎస్ఆర్ కేవిస్ రాష్ట్ర కార్యదర్శి రాసమల్ల కొమురయ్య పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దరిపల్లి చంద్రన్న పిలుపు మేరకు ఈ నెల 28వ తేదీన సిద్దిపేటలో జరిగే భారీ బహిరంగ సభ వాల్ పోస్టర్ ను మంగళవారం రఘునాథపల్లి మండల కేంద్రంలో వాల్ పోస్టర్ట్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆసంఘం రాష్ట్ర 'కార్యదర్శి రాసమల్ల కొమురయ్య హాజరై మాట్లాడుతూ ఈసభకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి హాజరువుతున్నారని 14 రంగాల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని ప్రతి కార్మికుడు ఒక ' కంకణబద్ధంగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కడారి శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు మడి కంటి సోమన్న, స మైక్య పెయింటర్ అసోసియేషన్ మండల అధ్యక్షులు ఎడ్ల యాకస్వామి. మండల ప్రధాన కార్యదర్శి కొయ్యడ యాదగిరి, మాజీ మండల అధ్యక్షులు కందుల గణేష్, మండల ప్రచార కార్యదర్శి సింగపురం బిక్షపతి, మండల ప్రచార కార్యదర్శ దామెర అబ్బయ్య, మండల కార్యదర్శి మేకల యాదగిరి. మేకల గట్టు గ్రామ అధ్యక్షులు మన్యం చంద్రయ్య, తూడి రామచందర్. కార్పెంటర్ అసోసియేషన్ మండల కార్యదర్శి బతోజ్ నరసింహ చారి. గుడిపాటి ఐలయ్య తదితర కార్మికులు పాల్గొన్నారు



# కొయ్యడ మల్లేష్ కు "ముచర్ల సత్తన్న" పురస్కారం

### హర్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయ, మంత్రి సీతక్క చేతుల మీదుగా ప్రధానం


**జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్ ) జూలై 22:**

హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో సోమవారం రాత్రి హర్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయ, తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కల చేతుల మీదుగా ముచ్చర్ల సత్తన్న అవార్డును రఘునాథపల్లి మండలం వెల్ది గ్రామ తాజా మాజీ సర్పంచ్ కొయ్యడ మల్లేష్ కు అందించారు. ముచర్ల సత్తన్న పంచాయతీ పాట ఆవిష్కరణతోపాటు రాష్ట్రంలో 6గ్రామాల పంచాయతీ సర్పంచ్ లకు పురస్కరాలు అందించారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఆర్థికంగా నష్టపోకుండా.. నిస్వార్థంగా పోటీ చేసి గెలవాలని వక్తలు తెలిపారు. ఈసందర్భంగా
కొయ్యడ మల్లేష్ మాట్లాడుతూ స్వచ్ఛందంగా ఊరికి ప్రజా సేవ చేయడానికి సహకరించిన గ్రామస్తులకు, యువకులకు, అలాగే 5సంవత్సరాలు సర్పంచ్ గా తన బాధ్యతలు విజయవంతంగా పూర్తి కావడానికి సహకరించిన జిల్లా, మండల అధికారులకు, ప్రజాప్రతినిధులకు, పాత్రికేయులకు తన సేవలను గుర్తించి మాజీ మంత్రి ముచ్చర్ల సత్తన్న పురస్కారం అందించిన
పృద్వి రాజ్ లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నిబద్ధతతో, ఎలాంటి స్వార్థం లేకుండా ప్రజాసేవ లక్ష్యంగా తనదైన శైలిలో సామాజిక సేవ చేసినందుకు గ్రామ పేరును రాష్ట్ర స్థాయికి తీసుకు వెళ్లిన కొయ్యడ మల్లేష్ ని గ్రామస్థులు పెద్ద ఎత్తున అభినందనలు తెలిపారు



# నేడు ఆశ్వరావుపల్లి రిజర్వాయర్ నుంచిసాగునీరు విడుదల చేయనున్న ఎమ్మెల్యే కడియం

**జనగామ జిల్లా/ రఘునాథపల్లి/( అక్షరం న్యూస్) జూలై 22:**



మండలంలోని ఆశ్వరావుపల్లి రిజర్వాయర్ కుడి ప్రధాన కాలువ నుంచి వెళ్లే కాల వలతో పాటు చీటకోడూరు రిజర్వాయర్ కు వెళ్లే కాలువకు స్టేషన్ ఘనాపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి బుధవారం ఉదయం 11గంటలకు సాగునీరు విడుదల చేయనున్నారని మండల కాంగ్రెస్ అధ్యకుడు కోళ్ల రవిగౌడ్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా కోళ్ల రవి మాట్లాడుతూ కాలువల ద్వారా వచ్చే సాగునీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొనే కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు అధిక సంఖ్యలో హాజరై విజయవ%శీ%తం చేయాలని కోరారు.

# ఎంపీ నిధులతో కొండాపూర్ గ్రామంలో బోరు బావి




**రాజన్న సిరిసిల్ల/ముస్తాబాద్/జులై-22(అక్షరం న్యూస్)**

ముస్తాబాద్ మండలం కొండాపూర్ గ్రామంలో ముదిరాజ్ సంఘము వద్ద నీటి వసతి లేక ఇబ్బంది పడుతుండటంతో ఇట్టి విషయాన్నీ కొండాపూర్ బిజెపి గ్రామశాఖ ముదిరాజ్ సంఘం సభ్యులతో కలిసి కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వినతిపత్రం అందచేసిన వెంటనే స్పందించి మంగళవారం ముదిరాజ్ సంఘము వద్ద బోర్ వేయించారు. అడిగిన వెంటనే స్పందించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఇందుకు సహకరించిన జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి మండల అధ్యక్షులు సౌళ్ళ క్రాంతికుమార్ లకు కొండాపూర్ బిజెపి గ్రామ శాఖ తరపున ప్రత్యేక ధన్యవాదములు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు..

### చికిత్స పొందుతూ యువకుడి మృతి

**జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్) జూలై 22:**



ప్రమాదవశాత్తు ఇంటిపై నుంచి పడిన ఇంజనీరింగ్ డిగ్రీ పూర్తి చేసిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలోని ఖిలాషాపూర్ లో సోమవారం రాత్రి చోటుచేసుకుంది..
ఖిలాషాపూర్ కు చెందిన పానుగంటి లక్ష్మణమూర్తి కవిత దంపతుల కుమారుడు పానుగంటి కృష్ణకాంత్(25) ఈ నెల 19న ఇంటి అంతస్తు నుండి కిందికి దిగుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు ఇంటి పైనుంచి కింద పడగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన కృష్ణకాంత్ ను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ లో ని యశోద ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుడు బి.టెక్ డిగ్రీ పూర్తి చేయగా ఉద్యోగం కూడా లభించింది ఆగస్టు ఒకటవ తేదిన ఉద్యోగంలో చేరాల్సి ఉండగా, విధి వక్రించడంతో అర్ధాంతరంగానే మృత్యువు కబలించింది. ఖిలాషాపూర్ లో మ%శీ%గళవారం కృష్ణకాంత్ అంత్యక్రియలు జరిగాయి. కృష్ణకాంత్ పార్థీవ దేహానికి విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం జిల్లా అధ్యక్షుడు నారోజు రామేశ్వరాచార్యులు, మండల స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, కోటగిరి బిక్షపతి తదితరులు ఆ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు

# సోషల్ మీడియాలో ఫేక్ అకౌంట్స్ తో తప్పుడు పోస్టులు పెట్టిన వ్యక్తి అరెస్ట్..

**సోషల్ మీడియాను దుర్వినియోగపరిస్తే చర్యలు తప్పవు**
**సామాజిక మాధ్యమాలపై ప్రత్యేక నిఘా గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి**

**జ్యోతి నగర్ ఎన్టిపిసి జూలై 22 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్**

గోదావరిఖని పోలీస్ స్టేషన్ పరిధిలో 29-6-25 రోజున ఒక వ్యక్తి రామగుండం జనహిత, పాలకుర్తి మండలం, నిజం నిప్పులాంటిది "లి అను మూడు ఫేస్బుక్ అకౌంట్లను క్రియేట్ చేసి దానిలో మహంకాళి స్వామి మాజీ కార్పొరేటర్ ను కించపరిచే విధంగా వీడియోలను పెట్టినాడని తన దరఖాస్తు మేరకు గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి అట్టి పోస్టులకు సంబంధించి విచారణ చేసి టెక్నాలజీ సహాయంతో ఆ సోషల్ మీడియా గ్రూపులను క్రియేట్ చేసిన వ్యక్తిని పట్టుకోవడం జరిగింది అట్టి సోషల్ మీడియా గ్రూప్ క్రియేట్ చేసిన అతని యొక్క ఫోను సీజ్ చేయడం జరిగింది అతనిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారని వన్ టౌన్ సిఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

లిసోషల్ మీడియా గ్రూపులో పోస్టు పెట్టిన నిందితుని పేరు జరుపుల శ్రీనివాస్ %ం/శీ% నరసింహ, 36 సంవత్సరాలు, వృత్తి: కూలి పని నివాసము : ఎస్టి కాలనీ, రామగుండంలి

ఇతడు గతంలో ఆఫ్ టిప్ ఆప్టికల్ ఫైబర్ కేబుల్ నెట్వర్క్ ప్రైవేటు కంపెనీలు జాబ్ చేసేవాడు తర్వాత కొద్ది రోజులు పొలిటికల్ పార్టీలో యాక్టివ్ గా పని చేసినాడు అతని ఆరోగ్యం సరిగా లేనందున 2023 నుంచి పొలిటికల్ గా స్తబ్దతగా ఉంటూ ఇంట్లోనే సోషల్ మీడియా గ్రూపులను ఆపరేట్ చేసుకుంటూ అప్పుడప్పుడు కూలి పని చేస్తూ జీవిస్తున్నాడు. తన వ్యక్తిగత కారణాలవల్ల అనవసరమైన పోస్టులు పెడుతూ రెండు పొలిటికల్ పార్టీల మధ్య గొడవ సృష్టించి, వ్యక్తిగతన దూషణలకు ఘర్షణలకు వాగ్వాదాలకు దారితిస్తూ, ప్రశాంతమైన వాతావరణంలో జీవిస్తున్న ప్రజల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నందున అతనిపైన చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతున్నది.

పోలీస్ శాఖ తరపున ప్రజలందరికీ విజ్ఞప్తి.. సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తూ విద్వేషపూరిత ప్రసంగాలు ఏదైనా ఒక వర్గం వారిని రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలతో పోస్టులు పెట్టటం, ఒక వ్యక్తి వర్గం రాజకీయ పార్టీ గురించి అసభ్య పదజాలం ఫోటోలు పెట్టిన, ఎవరైనా పొలిటికల్ పార్టీ వాళ్లు కులాలకు సంబంధించి, మతాలకు సంబంధించి ఏదైనా అసభ్యకరమైన ఫోటోలు వీడియోలు మార్ఫింగ్ చేసి పెట్టిన, కించపరిచే విధంగా మాట్లాడిన, మెసేజ్లు ఫార్వర్డ్ చేసిన పెట్టిన చట్ట ప్రకారం వారి పైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. రాబోయే రోజుల్లో మరింత కఠినంగా వ్యవహరిస్తామని తెలియజేస్తూ ఇలాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడద్దని సోషల్ మీడియా గ్రూపులను మంచికి మాత్రమే సమాచారం చేరవేయడం కోసం మాత్రమే ఉపయోగించాలి తప్ప ఇతరులను ఇబ్బంది పెట్టే విధంగా సోషల్ మీడియా గ్రూపులను ఉపయోగించరాదని, అదేవిధంగా అసత్య సమాచారాన్ని పోస్ట్ చేసిన వ్యక్తితో పాటు ఫార్వర్డ్ చేసే వ్యక్తులపై కూడా చట్టబరమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామన్నారు. ఇట్టి విషయం ను ప్రజలు గమనించగలరు అని విజ్ఞప్తి చేస్తున్నాం.



## శ్రీసీతారామ సేవా సమితి ఆపన్న హస్తం.. నిరుపేద పేషెంట్‌కు రూ.5వేలు ఆర్థిక సహాయం




**జ్యోతి నగర్ ఎన్టిపిసి జూలై 22 పెద్దపల్లి జిల్లా అక్షర న్యూస్**
గోదావరిఖని విఠల్ నగర్ కు చెందిన కాంపెల్లి రాహుల్ అనే నిరుపేద యువకునికి పక్షవాతం తోపాటు బ్రెయిన్ ఆపరేషన్ అయింది. కాళ్ళు పడిపోవడం తోపాటు మాట కూడా రావడం లేదు. తండ్రి లేడు. తల్లి మిషన్ కుట్టి కుటుంబాన్ని సాకుతూ.. కొడుకు ఆరోగ్యం కుదుటపడేందుకు అప్పులు చేసి చికిత్స అందిస్తోంది. ఇళ్లు గడవడం కష్టంగా ఉండడంతో, స్పందించిన ఎన్టీపీసీ అన్నపూర్ణ కాలనీలోని శ్రీ సీతారామ సేవా సమితి ప్రతినిధులు అండగా నిలిచారు. మంగళవారం సేవా సమితి అధ్యక్షురాలు గొలివాడ చంద్రకళ ఆధ్వర్యంలో బాధితున్ని నేరుగా కలుసుకొని పరామర్శించారు. బాధితుని సేవా సమితి నుంచి రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందించారు. మానవతావాదులు స్పందించి బాధితున్ని ఆదుకోవడానికి ముందుకు రావాలని చంద్రకళ కోరారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి మహిళా ప్రతినిధిరాళ్ళు కంది సుజాత, కొండు రమాదేవి, కొప్పుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపెల్లి ఏసీపీ గజ్జి కృష్ణను పరామర్శించిన ఎమ్మెల్యే



**పెద్దపల్లి టౌన్ జూలై 22 అక్షరం న్యూస్**
పెద్దపల్లి గజ్జి కృష్ణ తండ్రి గజ్జి ఐలయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందగా జైపూర్ మండలం రసూల్ పల్లి గ్రామం లోని వారి ఇంటికి వెళ్లి వారి తండ్రి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ప్రగాఢ సానుభూతి తెలిపారు ఈకార్యక్రమంలో సయ్యద్ మస్రత్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ కాన్సిలర్ భూతగడ్డ సంపత్ బొడ్డుపల్లి శ్రీనివాస్ దేవరకొండ రాజు సంతోష్ తాళ్ల కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు

## జూలై 24న సికింద్రాబాద్ లో మెగా జాబ్ మేళా ......జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతిరావు.

**పెద్దపల్లి , ప్రతినిధి జూలై-22 అక్షరం న్యూస్**
జల్లాలోని నిరుద్యోగ యువకులకు ఉద్యోగాలు కల్పించుటకు జూలై 24న గురువారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మెగా జాబ్ మేళా కార్యక్రమం సికింద్రాబాద్ లో నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వై. తిరుపతి రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.సీతారామ స్పిన్నర్స్ ప్రైవేట్ లిమిటెడ్ గత 17 సంవత్సరాలుగా కోర్ స్పన్ యార్న్ (సి.ఎస్.వై) తయారి లో అగ్రగామిగా ఉందని, మేడ్చల్ సమీపంలోని తునికి కల్లా సిద్దిపేట జిల్లాలో ఆధ్యాత్మిక సౌకర్యాలతో కూడిన కర్మాగారాన్ని కలిగి ఉందని, విస్తరణలో భాగంగా 300 మిషన్ ఆపరేటర్ోస్టులను ఆ సంస్థ భర్తీ చేస్తుందని తెలిపారు. మిషన్ ఆపరేటర్ పోస్టులకు 10వ తరగతి, ఇంటర్ పాస్ లేదా విద్యార్హత లేని వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని, అనుభవం అవసరం లేదని, వీరి వయస్సు 18-40 లోపు, ఉండాలని, నెలకు వేతనం 10000 నుంచి 17 వేల వరకు ఉంటాయని, వీరికి ఉచిత శిక్షణ ఉచిత వసతి మహిళల కోసం ఉచిత హాస్టల్ త్రాగునీరు చికిత్స సౌకర్యాలు ఉంటాయని అన్నారు. ఆసక్తి ఉన్నవారు జూలై 24న ఉదయం 10.30 గంటల సర్టిఫికేట్స్ జిరాక్స్ లతో సికింద్రాబాద్ లోని నిర్మాణ సంస్థ ఆరవ అంతస్తు ఆఫీస్ నెంబర్ 608, మినర్వా కాంప్లెక్స్ వచ్చి తమ పేరు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 90631739359063173934, 7337459857 ఫోన్ నెంబర్ ల నందు సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతిరావు ఆ ప్రకటనలో తెలిపారు.

## అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం..

**గూడూరు గ్రామం లో నూతన రేషన్ కార్డుల పంపిణీ..**
**కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఏళ్ళ బాల్ రెడ్డి**



**రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /జులై -22(అక్షరం న్యూస్ )**
అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏళ్ళ బాల్ రెడ్డి అన్నారు.మంగళవారంముస్తాబాద్ మండ లం గూడూరు గ్రామం కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు సాకలి బాబు ఆధ్వర్యంలో నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం కు ముఖ్య అతిధిగా విచ్చేసి. స్థానిక కాంగ్రెస్ శ్రేణుల తో కలసి అందచేసారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చాక కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని అన్నారు.రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియనూతన రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని, గడచిన పది సంవత్సరాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని ఏద్దేవా చేశారు.గతంలో ఏ ప్రభుత్వం చేయు విధంగా తమ ప్రభుత్వం రేషన్ కార్డులతో పాటు సన్నబియ్యం పంపిణీ చేపట్టారని అన్నారు. గత పది సంవత్సరాలుగా రేషన్ కార్డులు పేరు నమోదు, కుటుంబ సభ్యుల పేర్లు చేర్పులు, మార్పుల కోసం గత పది సంవత్సరాలు కళ్ళు కాయలు కాసేలా ఎదురుచూసిన ఫలితం కనిపించలేదని తెలిపారు.పేద ప్రజలకు రేషన్ కార్డు ఒక గుర్తింపు కార్డుగా మారిందన్నారు. ఈ కార్యక్రమం లో మార్కెట్ కమిటీ వైస్ చేర్మెన్ రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు కొమురయ్య, గూడూరు గ్రామ శాఖ అధ్యక్షుడు సాకలి బాబు, ఉపాధ్యక్షుడు మధు. లబ్ధిదారులు పాల్గొన్నారు

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిపిఎం పార్టీ కార్యకర్తలు సిద్ధం కండి

## ౹సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి, సాదుల శ్రీనివాస్ పిలుపు




**మహబూబాబాద్ /కేసముద్రం /జూలై 22/అక్షరం న్యూస్ :-**
కేసముద్రం మున్సిపాలిటీ కేంద్రంలోని సిపిఎం పార్టీ కార్యాలయంలో కేరళ మాజీ ముఖ్యమంత్రి కమ్యూనిస్టు విప్లవ జ్యోతి అకాల మరణానికి చింతిస్తూ కామ్రేడ్ వి ఎస్ అచ్యుత నందన్ చిత్రపటానికి సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించినారు. అనంతరం సిపిఎం పార్టీ మండల కమిటీ విస్తృతస్థాయి సమావేశం మొడెం వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించడమైనది.ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికుల పక్షాన ప్రజల పక్షాన రైతుల పక్షాన దేశ ప్రజల పక్షాన నిరంతరం వారి సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తూ వారి హక్కుల కోసం పోరాడుతున్న ఏకైక జెండా ఎర్ర జెండా సిపిఎం పార్టీ అని అన్నారు.కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వం మిత్రపక్షాల ఆధ్వర్యంలో మూడవసారి అధికారంలోకి వచ్చి కార్పొరేట్లకు పెట్టుబడిదారులకు లక్షల కోట్ల రూపాయలు రుణాలు మాఫీ చేస్తూ సామాన్య ప్రజానీకంపై ధరల భారం మోపి జిఎస్టి రూపంలో ప్రజాధనాన్ని దోచుకుంటుందని అన్నారు. మరి నరేంద్ర మోడీ రైతు రుణాలు గాని ప్రజలు తీసుకున్న రుణాలు మాఫీ చేశారా అని అన్నారు. ప్రభుత్వాలు అధికారం రాకముందు ఒక మాట అధికారం వచ్చాక మరో మాట ప్రభుత్వాలు అనుసరిస్తున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేసినారు.అదేవిధంగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకునే వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి ఇల్లు నిర్మించుకున్న వారందరికీ తక్షణమే బిల్లులు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయాలని అన్నారు.రాబోయే కాలంలో స్థానిక సంస్థలు ఎన్నికల్లో సిపిఎం పార్టీ అభ్యర్థులను బలపరిచి వారి గెలుపు కోసం పార్టీ కార్యకర్తలు,నాయకులు కృషి చేయాలని కోరారు. మంగళవారం ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల ప్రచార కార్యదర్శి చెట్టే బోయిన యాకయ్య ,సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ సమక్షంలో సిపిఎం పార్టీలో చేరిన సందర్భంగా సిపిఎం పార్టీ కండువా కప్పి ఆహ్వానించినారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, కేసముద్రం మండల సిపిఎం పార్టీ నిర్మాణ బాధ్యులు ఆకుల రాజు జిల్లా కమిటీ సభ్యులు మార్తినేని పాపారావు,సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గొడిశాల వెంకన్న, మండల కమిటీ సభ్యులు జల్లే జయరాజ్ ,కావటి నరసయ్య, వేల్పుగొండ సావిత్ర,జాటోత్ వెంకన్న ,తాడబోయిన శ్రీశైలం, బొబ్బల యాకూబ్ రెడ్డి, వివిధ గ్రామాల శాఖ కార్యదర్శులు, ముద్రకోల సారయ్య,జాన్పాటి జ్యోతి,బండి దర్గయ్య, గుగులోతు కేశ్య,గుండెల శారద,కళావతి తదితరులు పాల్గొన్నారు.

## 24న దేవునిపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయ భూములకు కౌలు వేలం

### ... ఆలయ కార్యనిర్వాహన అధికారి ముద్దసాని శంకర్

**పెద్దపల్లి రూరల్ జులై 22 అక్షరం న్యూస్**
మండలంలోని దేవునిపల్లి గ్రామంలో గల శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి సంబంధించిన వ్యవసాయ భూమి కౌలు కోసం ఈ నెల 24వ తేదీన దేవునిపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఉదయం 11 గంటలకు వేలంపాట నిర్వహిస్తున్నట్ల ఆలయ ఈవో మద్దతు శంకర్ తెలిపారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి సంబంధించి 283 సర్వే నంబర్లో 8 ఎకరాల 20 గుంటల వ్యవసాయ భూమి ఉందని ఒక సంవత్సరం కవులు కోసం గురువారం ఉదయం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఆసక్తి కలిగిన రైతులు 20వేల రూపాయల ధారావత్తు చెల్లించి బహిరంగ వేళలో పాల్గొనాలని ఆయన కోరారు.




## రామగుండం కార్పొరేషన్‌లో కొనసాగుతున్న 100 రోజుల ప్రణాళిక కార్యక్రమాలు





**జ్యోతి నగర్ ఎన్టిపిసి జూలై 22 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్**
వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక లో భాగంగా మంగళవారం రామగుండం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఫైవ్ ఇంక్ లైన్ చౌరస్తాలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులచే కళాజాతాల ప్రదర్శన నిర్వహించి పరిసరాల పరిశుభ్రత, చెత్త రీ సైకిలింగ్ చేయడం, కుక్క కాటు బారిన పడకుండా కాపాడుకోవడం అంశాలపై అవగాహన కల్పించారు. అంతకుముందు మల్కాపూర్ రోడ్డులో ముళ్ళ చెట్లు , పొదలు తొలగించారు.విట్టల్ నగర్ లో మరుగుదొడ్డి పరిశీలించి ఆవరణ పరిశుభ్రం చేయించారు. రామగుండం నగర పాలక సంస్థ డిప్యూటీ కమీషనర్ నాయిని వెంకట స్వామి కార్యక్రమాన్ని పర్యవేక్షించగా నగర పాలక సంస్థ సానిటరీ ఇన్స్పెక్టర్లు, వార్డు అధికారులు, మెప్మా సిబ్బంది , ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారి సరోజన జన్మదినం పురస్కరించుకొని వివిధ సేవా కార్యక్రమాలు

### అధ్యక్షులు కొమురవెల్లి సుధాకర్ అరుణ







**జ్యోతి నగర్ ఎన్టిపిసి జూలై 22 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్**
మనుమరాలు కుమారి చిన్నారి సరోజన జన్మదినం పురస్కరించుకొని వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా 320 జి ఫస్ట్ వైస్ డిస్టిక్ గవర్నర్ లయన్ మోర బద్రిశం హాజరయ్యారు. కొమరవెల్లి సుధాకర్ చేసే సేవా కార్యక్రమాలను , అభినందిస్తూ చిన్నారిని ఆశీర్వదించారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో వివిధ ప్రాంతాలలో పలు సేవ కార్యక్రమాలు సుధాకర్ నిర్వహించారు. డిస్టిక్ వైస్ గవర్నర్ బద్రిశం చేతుల మీదుగా ఉదయం 8:30 గంటలకు లక్ష్మీ నగర్ లేబర్ అడ్డా దగ్గర 150 మందికి ఇడ్లీ అల్పాహారాన్ని అందించారు. పదిమంది నిరుపేదలకు నెలకు సరిపడా ఇంటి సరుకులను అలాగే గౌతమి నగర్ లోని ప్రజా పాఠశాలలో 120 మంది విద్యార్థులకు సరిపడా నోట్ బుక్స్ డైరీస్ టై బెల్ట్స్ పెన్స్ తదితర సామాగ్రి అందించినారు అలాగే వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో మొక్కలు నాటడం, ఆటోనగర్లో నిరుపేదలకు స్కూల్ విద్యార్థులకు నోట్ బుక్స్ తో పాటు నిరుపేదలకు నిత్యవసర సరుకులు పెద్దపెల్లిలోని మిషన్ హై స్కూల్లో స్కూలు విద్యార్థులకు నోట్ బుక్స్ తో పాటు స్కూల్ కి సంబంధించిన సామాగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు కొమరవెల్లి సుధాకర్ తో పాటు వారి కుమారులు రోహిత్ రాహుల్, క్లబ్ కోశాధికారి శ్రవణ్, రీజన్ చైర్మన్ కజాంపురం రాజేందర్ జోన్ చైర్మన్ నార్ల ప్రసాద్ బ్యాట్ కోఆర్డినేటర్స్ బంక రామస్వామి శేగంటి నరేష్, లైన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని స్ఫూర్తి అధ్యక్షులు మామిడిపల్లి శ్రీధర్ సెక్రటరీ కొల్లూరు విజేందర్ ట్రెజరర్ కొలిపాక సతీష్, కోదాటి ప్రవీణ్ జయప్రకాష్ చౌడా సంధినేని గోపాల్ రావు సురేష్ పటేల్, జ్యోతిరాం పాటిల్, శేగంటి విక్రమ్, బొల్లం అరుణ్ కుమార్, రావికంటి శశిధర్ తో పాటు లైన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని అధ్యక్షులు శ్రీ చందర్ గుప్తా తో పాటు వారి క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## రేషన్ కార్డు పంపిణీ విషయంలో దళారులను నమ్మకండి... మీ డివిజన్ నాయకులను సంప్రదించండి

**జ్యోతి నగర్ ఎన్టిపిసి జూలై 22 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్**
ఎన్టీపీసీ పట్టణ ప్రజలందరికీ పేరు పేరున నమస్కారం తెలియజేస్తూ, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా, ప్రతి అర్హుడికీ కార్డు అందించే లక్ష్యంతో మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించామని ఎన్టీపీసీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.డి. ఆసిఫ్ పాషా తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ %-% రామగుండం శాసనసభ్యులు గౌరవనీయులైన మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు, తమ డివిజన్లకు చెందిన అర్హులైన వారు మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్నప్పటికీ రేషన్ కార్డు అందని వారు తక్షణమే తమ డివిజన్ కాంగ్రెస్ నాయకులను సంప్రదించగలరని విజ్ఞప్తి చేశారు.దళారుల ను నమ్మి మోసపోవద్దని, ఎలాంటి ఆర్థిక లావాదేవీలు లేకుండా ప్రభుత్వ పథకాన్ని పొందవచ్చని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులను సంప్రదించాలని కోరారు.

డివిజన్ వారీగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల వివరాలు ఇలా ఉన్నాయి:
- 2వ డివిజన్ ఠ- మడిపెల్లి మల్లేష్ (ఫోన్: 9989772222)
- 3వ డివిజన్ – ఈదునూరి మల్లేష్ (9949029306), లంబు కిషన్ రెడ్డి (986627897)
- 4వ డివిజన్ – బొడిగే భారత్ గౌడ్ (9908100025), అబ్బాస్ బేగ్ (9704741919)
- 5వ డివిజన్– ఈదునూరి రవి (9618291033), లక్ష్మయ్య (9014948533)
- 23వ డివిజన్– సదానందం (9063922077), ఎం. రమేష్ (9703287871)
- 24వ డివిజన్ – కవిత వెంకట్ రెడ్డి (9032735461)

# ఘనంగా దాశరథి కృష్ణమాచార్య శతజయంతి వేడుకలు



**మహబూబాబాద్ /కేసముద్రం /జూలై 22/అక్షరం న్యూస్ :-**
మహాకవి దాశరథి కృష్ణమాచార్య శతజయంతి వేడుకను వారి చిత్రపటానికి కల్వల హై స్కూల్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బండారు నరేందర్ మంగళవారం పూలమాలలు సమర్పించి ఘనమైన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజాం నిరంకుశత్వం పైన నిప్పులు చెరిగిన ధీశాలి నా తెలంగాణ కోటి రత్నాల వీణ అంటూ చాటి చెప్పిన దార్శనికుడు నిర్బంధాలకు వెరవకుండా నిలబడి పోరాడిన దాశరథి కృష్ణమాచార్య కలంతో సమాజాన్ని జాగృతం చేసిన ఉద్యమశీలి అని ఈ సందర్భంగా కొనియాడారు. మానుకోట ఒడిలో చిన్న గూడూరు బడిలో ఎదిగిన పోరు బిడ్డ ఆ మహానీ యుడు తెలంగాణ ఉద్యమానికి మార్గదర్శిగా నిలిచారని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో రాచకొండ ఏకాంబరం,బేతి సత్యనారాయణ,తండ సదానందం,వి నాగేందర్,రాగి బిక్షపతి,ఎం యాకాంబరం, వి రాజేంద్ర చారి,బాల షోరెడ్డి, మార్గం శ్రీనివాస్,జుబేర్ అలీ, కె పార్వతి,వి రాము,ఫిజికల్ డైరెక్టర్ కొప్పుల శంకర్, జి.నాగరాజు,ఏ లింగయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# వివేకవర్ధిని హైస్కూల్లో దాశరథి జయంతి వేడుకలు



**మహబూబాబాద్ /కేసముద్రం /జూలై 22/అక్షరం న్యూస్ :**
–కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ వివేకవర్ధిని హైస్కూల్ లో మంగళవారం దాశరథి కృష్ణమాచార్యుల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ దాశరథి చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు.అనంతరం యాకాంతం గౌడ్ మాట్లాడుతూ దాశరథి రగిలించిన చైతన్య స్ఫూర్తి, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఉద్యమించేందుకు కావలసిన సంకల్ప బలాన్ని ఇచ్చిందన్నారు.నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా నా తెలంగాణ కోటి రతనాల వీణా అని అగ్ని ధారలు కురిపించి రుద్రవీణలు పలికించి 19వ ఏటనే జైలుకు వెళ్లిన గొప్ప యోధుడు దాశరథి అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ చిర్ర నరేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇంటి యజమాని ఇంకుడు గుంత నిర్మించుకోవాలి

## – మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్



**పెద్దపల్లి టౌన్ జూలై 22 అక్షరం న్యూస్**
మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణములో నూతనంగా నిర్మిస్తున్నటువంటి ప్రతి ఇంటికి గృహ యజమానులు ఇంకుడు గుంత కలిగి ఉండాలని భూగర్భ జలాలు అడుగుగంటి పోకుండా వర్షపునీరు వృధా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు ఈకార్యక్రమంలో టీపీవో నరేష్ టీపీఎస్ వినయ్ పాల్గొన్నారు

# భూ సమస్యల పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా చర్యలు

**..... రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి**
**రెసిడెన్షియల్ విద్యా సంస్థల్లో నాణ్యమైన భోజనం అందేలా చర్యలు**
**విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల కల్పన**
**భూ భారతి చట్టం అమలు, రెసిడెన్షియల్ విద్యా సంస్థల నిర్వహణ పై రివ్యూ చేసిన మంత్రి పొంగులేటి**



**పెద్దపల్లి ప్రతినిధి, జూలై 22 అక్షరం న్యూస్**
రాష్ట్రంలో నిర్వహించిన రెవెన్యూ సంస్థలు ప్రజల నుంచి భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలని లిరాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డిలి అన్నారు.లిమంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం సచివాలయం నుంచి భూ భారతి చట్టం అమలు, రెసిడెన్షియల్ విద్యా సంస్థల నిర్వహణ పై రాష్ట్ర బీసీ రవాణా శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి వర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సీఎస్ కే. రామకృష్ణా రావులతో కలిసిలి రివ్యూ నిర్వహించారు. లిఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీ తో కలిసిలి పాల్గొన్నారు.ఈ సందర్భంగా లిమంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూలి భూ భారతి చట్టం నిబంధనల ప్రకారం వీలైనంత వరకు భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో ప్రజల నుంచి భూ సమస్యల పై 8 లక్షల దరఖాస్తులు వచ్చాయని, వీటిని 4 క్యాటగరిలలో విభజించి వాటిని నిబంధనల ప్రకారం త్వరగా పరిష్కరించాలని అన్నారు. లిలిమంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూలి లక్షల మంది పిల్లల తల్లిదండ్రులు ప్రభుత్వంపై నమ్మకంతో పిల్లలను రెసిడెన్షియల్ పాఠశాలలకు పంపుతారని , అక్కడ జరిగే చిన్న చిన్న సంఘటనల కారణంగా ప్రభుత్వంపై విశ్వాసం తగ్గే ప్రమాదం ఉన్నదని అప్రమత్తంగా ఉండాలని అన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో పిల్లలకు భోజనం అందించే అంశంలో ప్రభుత్వం జారీ చేసిన కామన్ డైట్ మెన్యూ మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాలని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ విద్యా సంస్థల పరిసర ప్రాంతాలలో పిచ్చి మొక్కలను పూర్తి స్థాయిలో ఉపాధి హామీ ద్వారా తొలగించాలని మంత్రి ఆదేశించారు.
పాఠశాలల్లో ఎక్కడ పాములు వచ్చే అవకాశం లేకుండా చూడాలని అన్నారు . పాఠశాలలో త్రాగునీటి సరఫరా సరిగా ఉండేలా చూడాలని, నీటి నాణ్యతను ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలని అన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. లిలిమంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ,జిల్లా అధికారులు రెగ్యులర్ గా రెసిడెన్షియల్ పాఠశాలను తనిఖీ చేస్తూ విద్యార్థులకు అందించే ఆహార నాణ్యతను తనిఖీ చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రతిరోజు విద్యార్థులకు అందించే డైట్ వివరాలు క్షుణ్ణంగా పరిశీలించాలని అన్నారు. లిలిసీ.ఎస్. కే.రామ కృష్ణా రావు మాట్లాడుతూ,లి రాష్ట్రంలోని రెసిడెన్షియల్ విద్యా సంస్థల్లో విద్యార్థులకు అందించే ఆహార నాణ్యత పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడా కూడా ఫుడ్ పాయిజన్ సంఘటనలు జరగకుండా జాగ్రత్త పడాలని, హాస్టల్స్ లో ఉన్న ఆహార పదార్థాల నాణ్యత, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు.ఈ సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అన్న ప్రసన్న కుమారి, జిల్లా అటవీ అధికారి శివయ్య, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రైవేట్‌కు దీటుగా పెద్దపల్లి ప్రభుత్వ దవాఖాన..

**..ఉచితంగా పలు శస్త్ర చికిత్సలు......పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు**
**...జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో కంటి శస్త్ర చికిత్స ....అనంతరం ఉచిత కళ్లద్దాల పంపిణీ..**
**...గతంలో అభివృద్ధికి నోచుకొని పెద్దపల్లి ప్రధాన ఆసుపత్రి.....ప్రజా ప్రభుత్వంలో 50 పడకల నుండి 100 పడకలకు ఆధునీకరణ..**
**...త్వరలో ప్రభుత్వ దవాఖానలో ఏం.ఆర్.ఐ సేవలు కూడా ప్రారంభిస్తాం..పెద్దపల్లి శాసనసభ్యులు శ్రీ. చింతకుంట విజయరమణ రావు**



**పెద్దపల్లి ప్రతినిధి జులై 22 అక్షరం న్యూస్**
పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కంటి శస్త్ర చికిత్స చేయించుకున్న వారికి మొదటిసారిగా ప్రభుత్వం తరుపున ఉచితంగా కళ్ళద్దాలను ఆసుపత్రి సూపరిండెంట్ మరియు సిబ్బందితో కలిసి పెద్దపల్లి శాసనసభ్యులు శ్రీ. చింతకుంట విజయరమణ రావు పంపిణీ చేశారు.అనంతరం ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందిస్తునందుకు గాను సూపరిండెంట్ గారిని మరియు వైద్యులను ఎమ్మెల్యే విజయరమణ రావు అభినందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చాక పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో గణనీయమైన మార్పులు చేశామని అన్నారు. పెద్దపల్లి జిల్లా ప్రజలు మరియు నియోజవర్గ ప్రజలందరూ ప్రభుత్వ వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటి శస్త్ర చికిత్స గాని, డయాలసిస్, చర్మ వైద్యం, ముక్కు, నోరు, గొంతు మరియు చిన్న పిల్లల వైద్యం అలాగే నవజాతి శిశువుల కోసం మెరుగైన వైద్య సేవలు, మాత శిశు ఆసుపత్రిలో గర్భిణీ స్త్రీలకు మెరుగైన వైద్యం మరియు గర్భిణీ స్త్రీలకు అధిక ఖర్చుతో కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రైవేటు ఆసుపత్రులకు ధీటుగా పనిచేస్తుందని అన్నారు. మన పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అధునాతనమైన వైద్య పరీక్షలు మరియు శస్త్ర చికిత్సలు అందిస్తూ పేద కుటుంబాలకు సహాయస హకారాలు అందిస్తున్నామని తెలిపారు. ప్రైవేటు ఆసుపత్రులకు తగ్గకుండా ప్రభుత్వ ఆసుపత్రి అన్ని విధాలుగా సేవలను అందిస్తూ పేదవారికి వైద్య ఖర్చులు లేకుండా చేస్తున్నామని గుర్తుచేశారు. మన ప్రజా ప్రభుత్వం కూడిన టిఫ్ఫా స్కానింగ్ ను సైతం ఉచితంగా చేయడం లాంటి మరెన్నో వైద్య సేవలు ప్రభుత్వం తరుపున ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ శ్రీధర్, ఆర్.ఏం.ఓ, ఆసుపత్రి సిబ్బంది, వైద్యులు, వ్యవసాయ మార్కెట్ చైర్మన్, మాజీ కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# బిఆర్ఎస్ పాలనలో రేషన్ కార్డులు ఇచ్చిన పాపాన పోలేదు..

**కాంగ్రెస్ ప్రజాపాలనలో మహిళా సంఘాలకు పావలా వడ్డీ రుణాలు, బీమా సౌకర్యం కల్పిస్తున్నాం..**
**దేశంలో సన్నం బియ్యం ఇచ్చే రాష్ట్రం తెలంగాణ.. ప్రజా ప్రభుత్వంలో ఘనంగా సంక్షేమ పథకాలు అమలు..**
**పెద్దపల్లి శాసనసభ్యులు శ్రీ. చింతకుంట విజయరమణ రావు**



**పెద్దపల్లి ప్రతినిధి జులై 22 అక్షరం న్యూస్**
పెద్దపల్లి పట్టణంలోని నందన గార్డెన్స్ లో పెద్దపల్లి నియోజకవర్గం వ్యాప్తంగా 4847 మంది నూతన రేషన్ కార్డులు పెద్దపల్లి శాసనసభ్యులు శ్రీ. చింతకుంట విజయరమణ రావు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు మాట్లాడుతూతెలంగాణ రాష్ట్రంలో చాలా కాలం తర్వాత ప్రజా ప్రభుత్వం రేషన్ కార్డులు పంపిణీ చేస్తుందని తెలిపారు. గత ప్రభుత్వంలో ప్రజలు రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకొని, ఆఫీసుల చుట్టూ తిరిగి కాళ్ల చెప్పులు అరిగి అలిసిపోయారే తప్ప వారికి ఒక్క రేషన్ కార్డు కూడా మంజూరు చేయలేదని అన్నారు. ప్రజా ప్రభుత్వం దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో 4,847 కొత్త రేషన్ కార్డులు ఇవ్వడం జరుగుతుందని అందులో అనుసంధానం చేస్తూ 24 వేల 770 మందికి లబ్ధి చేకూరుతుందని అన్నారు. అలాగే గతంలో ఉన్న రేషన్ కార్డులలో 10 వేల 715 మంది సభ్యులను జత చేయడం జరిగిందని, దీనితో నియోజకవర్గంలో మొత్తం 35 వేల 485 మంది లబ్ధి పొందుతున్నారని తెలిపారు. అలాగే 3 వేల 289 రేషన్ కార్డు దరఖాస్తులు మంజూరు చేయడానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని అన్నారు. కారు, ట్రాక్టర్ ఉందని రేషన్ కార్డు కోత పెట్టవద్దని, వారి ఆర్థిక పరిస్థితిని పరిగణలోకి తీసుకొని రేషన్ కార్డులు ఇవ్వాలని అధికారులకు సూచించారు. గత టిఆర్ఎస్, బీఆర్ఎస్ ప్రభుత్వం ఎక్కడ ఎన్నికలు ఉంటే అక్కడ సంక్షేమ పథకాలు అమలు చేసిందని విమర్శించారు కాని ఎన్నికలతో సంబంధం లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిందని తెలిపారు. ప్రజలు ఘటక తినే కాలంలో స్వర్గీయ ఎన్టీ రామారావు గారు రెండు రూపాయలకే కిలో బియ్యం పథకాన్ని ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ప్రస్తుతం దేశంలోని 29 రాష్ట్రాలలో, సన్నబియ్యం ఇచ్చిన ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం అని ఏకైక సీఎం రేవంత్ రెడ్డి అని అన్నారు. గత యూపీఏ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన ఆహార భద్రత, అంత్యోదయ, అన్నపూర్ణ కార్డులను, ప్రస్తుతం కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వం తొలగిస్తూ వస్తుందని అన్నారు. బడుగు బలహీన వర్గాలకు లబ్ధి చేకూరాలంటే మళ్ళీ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని, రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలని అన్నారు. అలాగే పెద్దపల్లి కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మరియు జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్, మార్కెట్ చైర్మన్లు మరియు డిఎస్ఓ, నియోజకవర్గంలోని పలువురు తహశీల్దార్లు మరియు పలు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మరియు మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు యూత్ కాంగ్రెస్ నాయకులు మరియు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# 5 రూపాయల 50 పైసలకు ఇటుక సరఫరా

## .....జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

### ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇటుక సరఫరా ధర నిర్ణయం పై ప్రకటన విడుదల చేసిన జిల్లా కలెక్టర్‌లి



**పెద్దపల్లి, ప్రతినిధి జూలై 22 అక్షరం న్యూస్**
పెద్దపల్లి జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఇటుకలను ఒక్కో ఇటుక 5 రూపాయల 50 పైసలకు సరఫరా చేసేందుకు ఇటుక బట్టీల యాజమానులు నిర్ణయించారని లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటుక బట్టీల యాజమాను లతో కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకానికి పెద్దపల్లి జిల్లాలో ఉన్న 102 ఇటుక బట్టీల నుంచి తక్కువ ధరకు ఇటుక సరఫరా చేయాలని వారిని ఒప్పించడం జరిగింది. మొదటి విడత కింద పెద్దపల్లి జిల్లాకు ప్రభుత్వం 9 వేల 421 ఇందిరమ్మ ఇండ్లు కేటాయింపు చేయగా ఇప్పటివరకు 6 వేల 18 ఇండ్లను లబ్ధిదారులకు మంజూరు చేసామని, 3 వేల 847 గృహాలకు మార్కింగ్ చేసి బేస్మెంట్ పనులు జరుగుతున్నాయని అన్నారు.ప్రతి ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి 12,000 ఇటుకల అవసరం అవుతాయని, ఒక్కో ఇటుక 5 రూపాయల 50 పైసలకు సరఫరా చేసేందుకు జిల్లాలో ఉన్న 102 ఇటుక బట్టీల యాజమాన్యుల సమావేశంలో నిర్ణయించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. పెద్దపల్లి, శ్రీరాంపూర్, పాలకుర్తి, కమాన్ పూర్ మండలాల్లోని లబ్ధిదారులకు పెద్దపల్లి మండలంలో తయారుచేసిన ఇటుక బట్టీల నుంచి, సుల్తానాబాద్ ఓదెల, ఎలిగేడు, జూలపల్లి మండలాల్లోని లబ్ధిదారులకు సుల్తానాబాద్ మండలంలో తయారుచేసిన ఇటుక బట్టీల నుంచి సరఫరా అవుతుందని అన్నారు.ధర్మారం మండలంలోని ఇటుక బట్టీలు ధర్మారం మండలానికి, రామగిరి , రామగుండం మండలాల్లో తయారు అయ్యే ఇటుక బట్టీల నుంచి రామగిరి మంథని ముత్తారం మంథని మండలాలకు ఇటుకల సరఫరా అవుతాయని కలెక్టర్ తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం అవసరమైన ఇటుకలను ప్రతి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుడు ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి ద్వారా ఒకేసారి లిఫ్ట్ చేయుటకు వాహన సంఖ్య తో పర్మిట్ లెటర్ ఎంపీడీవో ద్వారా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలను పూర్తి స్థాయిలో త్వరగా నిర్మించుకోవాలని, ఈ ప్రక్రియను పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి, పిడి హౌసింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# తలకు మించిన అప్పుల భారం ఉన్నా అనేక ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

## పేదల ప్రజల ఆకలి తీర్చిన కాంగ్రెస్ ప్రభుత్వం

## రేషన్ కార్డ్ అప్లికేషన్స్ చేసుకోవడం నిరంతర ప్రక్రియు

## మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ -

**మహబూబాబాద్ /కేసముద్రం/జూలై 22/అక్షరం న్యూస్ :-**
గత 11ఏళ్లుగా రేషన్ కార్డుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగిన పేద ప్రజల కళ్ళల్లో ఆనందం నింపిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని ఎమ్మెల్యే డా మురళీ నాయక్ అన్నారు. కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలో రైతు వేదిక నందు నూతన రేషన్ కార్డుల పంపిణి కార్యక్రమానికి డా భూక్యా మురళీ నాయక్ హాజరయ్యారు.ఈ సందర్భంగా లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను పంపిణి చేసి నూతన రేషన్ కార్డు లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.ప్రజా ప్రభుత్వంలోనే రేషన్ కార్డుల కల సాకారం అయిందని అన్నారు. కేసముద్రం మండలంలో 4వేల839 మంది కొత్త రేషన్ కార్డులు మంజూరు అయ్యాయని 51వేల 893 మంది కొత్త సభ్యుల చేర్పులు జరిగాయాని తెలిపారు.ఇంకా రేషన్ కార్డు రాని వారు మీ సేవా ద్వారా కానీ తహసీల్దార్ కార్యాలయంలో కానీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలు ప్రతిపక్షాల కళ్ళకు కనిపించడం లేదని ఆరోపించారు.విమర్శలు చేసే ముందు ఆలోచించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే పేదల ప్రభుత్వమని,తలకు మించిన అప్పుల భారం ఉన్నా అనేక ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ప్రభుత్వాన్ని మనమే కాపాడుకోవాలని కోరారు.గతంలో ఎన్నడూ లేని,%అ%ఏ ప్రభుత్వాలు చేపట్టని సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేద ప్రజలకు మెరుగైన పాలన అందిస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు.దేశంలోనే వినూత్నసంగా ఉచిత సన్న బియ్యం పంపిణి కార్యక్రమానికి శ్రీకారం చుట్టి పేద ప్రజల ఆకలి తీర్చిన ఏకైక ప్రభుత్వం కూడా కాంగ్రెస్ మాత్రమేనని కొనియాడారు. వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేస్తూ 21కోట్ల పంట రుణ మాఫీ, రైతు భరోసా,సన్నాలకు బోనస్ అందిస్తుందని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూ కూడా సంక్షేమ పథకాల అమలుకు కొత్త బాష్యం చెబుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళ్తుందని పేర్కొన్నారు.అనేక ప్రజా సంక్షేమ పథకాలు అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు నిండు మనసుతో ఆశీర్వదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి,కేసముద్రం ఎమ్మార్వో వివేక్,ఎంపీడీవో క్రాంతి,ఏపిఎం రాజీవ్, ట్రాన్స్పోర్ట్ డైరెక్టర్ రావుల మురళి డిసిసి ఉపాధ్యక్షులు అంబటి మహేందర్ రెడ్డి, మండల అధ్యక్షులు అల్లం నాగేశ్వరరావు,మాజీ జడ్పిటిసి బండారి వెంకన్న,జిల్లా నాయకులు,మండల నాయకులు, యూత్ నాయకులు,మాజీ ప్రజా ప్రతినిధులు,డైరెక్టర్లు, మహిళలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.









# స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి

## బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డ బోయిన గోపి



**రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /జులై -22(అక్షరం న్యూస్ )**
వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లోబీజేపీ అభ్యర్థులు సత్తా చాటా లని రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం ముస్తాబాద్ మండల కేంద్రం లో స్థానిక ఏ ఎం ఆర్ గార్డెన్ లో ముస్తాబాద్ మండల పార్టీ అధ్యక్షులు సౌళ్ళ క్రాంతి ఆధ్వర్యంలో ఏర్పటు చేసిన స్థానిక సంస్థల ఎన్నికల కోసం సన్నాహక కార్యశాల సమావేశం కు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ .వారు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయం కోసం ఎలాంటి వ్యూహాలను అమలు చేయాలో చర్చించడమే ప్రధాన ఎజెండాగా కార్యశాల నిర్వహించామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ ఎంపీటీసీ, జడ్పీటీసీ సీట్లను కైవసం చేసుకునే విధంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలన్నారు.క్షేత్ర స్థాయిలో గ్రామం లో ఉన్న బీజేపీ శ్రేణులు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల అమలులో వైఫల్యాలు, హామీలు అమలు చేయక పోవడంపై ఇంటింటి ప్రచారం చేయాలని పార్టీ నేతలకు సూచించారు. గ్రామ గ్రామాన కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ద్వారా తెలంగాణ గ్రామాభివృద్ధి సాకారమైందని ప్రజలకు తెలియజేయాలన్నారుకేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలతోపాటు అభివృద్ధి పనులపై ప్రజలకు అవగహన కల్పించాలన్నారు.. గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం స్థానిక సంస్థ లను నిర్వీర్యం చేయడానికి ప్రయత్నం చేసాయి అన్నారు రాబోయే ఎన్నికలలో గ్రామ స్థాయి నుండి జిల్లా పరిషత్ వరకు బీజేపీ అభ్యర్థులు గెలవాలని, ఆకాంక్షించారు. అనంతరం బిజెపి నాయకులు రెడ్డబోయిన గోపిని శాలవ తో సత్కరించారు ఈ కార్యక్రమం లో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మట్ట వెంకటేశ్వర రెడ్డి, జిల్లా కార్యదర్శి మీసా సంజీవ్, జిల్లా కౌన్సిల్ మెంబర్ అంజా గౌడ్ ముస్తాబాద్ మండల శాఖ బిజెపి సీనియర్ నాయకులు తాజా మాజీ సర్పంచులు ఎంపీటీసీలు వివిధ మోర్చా నాయకులు శక్తి కేంద్ర ఇన్చార్జిలు భూత్ అధ్యక్షులు కార్యకర్తలు పాల్గొన్నారు

# ఉపరాష్ట్రపతి రాజీనామా వేళ..



**న్యూఢిల్లీ- అక్షరం న్యూస్:**
రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ మంగళవారం రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిశారు. సోమవారం సాయంత్రం జగదీప్ ధన్‌ఖర్ ఉప రాష్ట్రపతిగా రాజీనామా చేసిన నేపథ్యంలో ఆయన రాష్ట్రపతిని కలువడం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రపతి భవన్ 'ఎక్స్' పోస్ట్‌లో భేటీకి సంబంధించిన చిత్రాన్ని షేర్ చేసింది. రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపింది. జగదీప్ ధన్‌ఖర్ పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలిరోజే పదవికి రాజీనామా చేసి అందరికీ షాక్ ఇచ్చారు.మంగళవారం రాజ్యసభలో ఉదయం హరివంశ్ సభకు అధ్యక్షత వహించారు. అయితే, విపక్షాల ఆందోళనలతో ప్రారంభమైన కొద్దిసేపటికే రాజ్యసభ కార్యకలాపాలు బుధవారానికి వాయిదాపడ్డాయి. ఉపరాష్ట్రపతి రాజీనామా కారణంగా రాజ్యసభ చైర్మన్ పదవి సైతం ఆటోమేటిక్‌గా ఖాళీ అయ్యింది. ఉపరాష్ట్రపతి ఎగువ సభకు ఎక్స్-అఫిషియో చైర్మన్. ఈ పరిస్థితుల్లో ఆయన రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం తెలుపడంతో వర్షాకాల సమావేశాల్లో రాజ్యసభ కార్యకలాపాలు మొత్తం డిప్యూటీ చైర్మన్ హరివంశ్ చూసుకోనున్నారు .పార్లమెంట్ సమావేశాల తొలిరోజున జగదీప్ ధన్‌ఖర్ చురుగ్గానే కనిపించారు. ఉదయం సభలో సానుకూలంగా చర్చలు జరపాలని ఆయన సభ్యులకు సూచించారు. జస్టిస్ యశ్వంత్ వర్మపై అభిశంసన తీర్మాన నోటీసును అంగీకరించిన ఆయన.. ప్రక్రియను వివరించారు. జస్టిస్ శేఖర్ యాదవ్‌పై సమర్పించిన అభిశంసన నోటీసులో ఒక ఎంపీ డబుల్ సంతకంపై విచారణను చేయనున్నట్లు తెలిపారు. అయితే, ఆరోగ్య కారణాలు పేర్కొంటు ఆయన తక్షణం అమలులోకి వచ్చేలా ఆయన పదవికి రాజీనామా చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపిన రాజీనామా లేఖలో వైద్యుల సూచన మేరకు ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యం ఇచ్చేందుకు రాజీనామా చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

ఆయన మార్చిలో ఎయిమ్స్‌లో చేరారు. ఆ తర్వాత వైద్యులు ఆయనను ఢిల్లీ వెలుపలకు వెళ్లకుండా ఉండాలని సూచించారు. జూన్‌లో ఉత్తరాఖండ్‌లోని కుమావున్ విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన వేదికపైనే స్పృహ కోల్పోయారు. ఆ రోజు వేడి పరిస్థితులు ఉన్నట్లుగా అధికారులు తెలిపారు. ఈ నెల ప్రారంభంలో ఆయన కేరళలో పర్యటించారు. ఈ సమయంలో ఆరోగ్యం క్షీణించగా.. భార్య ఆయనకు అండగా ఉన్నారు.

**హైదరాబాద్ అక్షరం న్యూస్:**
మరికాసేపట్లో నగర వ్యాప్తంగా కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. ఈ మేరకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఒక ప్రకటన విడుదల చేసింది. జీహెచ్ఎంసీ సహా నగర పరిసర ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షం కురవనుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావొద్దని హెచ్చరికలు జారీ చేశారు.ముఖ్యంగా హైదరాబాద్ పరిధిలోని నార్సింగి, గండిపేట్, మణికొండ, ఖాజాగూడ, షేక్‌పేట్, టోలీచౌకి, ఆరంఘర్, మైలారదేవిపల్లి, గోల్కొండ, అత్తాపూర్, రాజేంద్రనగర్, బార్కాస్, శివరాంపల్లె, కాటేదాన్, చంద్రాయన పల్లె, కాటేదాన్, శంకరగుట్ట తదితర ప్రాంతాల్లో రెండు గంటల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ అధికారులు తెలిపారు. ఇక ఇతర ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉందని చెప్పారు.రాత్రి సమయంలోనూ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. మరోవైపు సైబరాబాద్ పోలీసుల సైతం కీలక అడ్వైజరీ జారీ చేశారు. వాతావరణ సూచన దృష్ట్యా.. ట్రాఫిక్ అంతరాయాలు ఏర్పడకుండా, భద్రతా కారణాల దృష్ట్యా ఐటీ ఉద్యోగులు సాధ్యమైనంత వరకు ఇంటి నుంచే పని చేయాలని పోలీసులు సూచించారు.మరోవైపు.. హైదరాబాద్‌కు ఎల్లో అలర్ట్ జారీ చేసింది వాతావరణ శాఖ. ఇవాళ, రేపు భారీ వర్షాలు కురుస్తాయని చెప్పారు. ఆకాశం మేఘావృతమై తేలికపాటి నుంచి మోస్తరు వర్షం లేదా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతుందని చెప్పారు. అంతేకాదు.. నగరంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన తీవ్రమైన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.ప్రభుత్వం అలర్ట్..భారీ వర్ష సూచన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం, జీహెచ్ఎంసీ, పోలీసులు, ఎస్‌డీఆర్ఎఫ్, హైడ్రా అధికారులు అలర్ట్ అయ్యారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. అదే సమయంలో రోడ్లపై నీళ్లు నిలవకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకునేలా ప్లాన్ చేస్తున్నారు. ప్రజలు ఇబ్బందులకు గురవకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఏవైనా సమస్యలుంటే.. జీహెచ్ఎంసీ హెల్ప్‌లైన్ నెంబర్లకు ఫోన్ చేయాలని ప్రజలకు అధికారులు సూచిస్తున్నారు.





# ప్లాట్‌ఫామ్ టికెట్ ఎందుకు తీసుకోవాలి

ఇండియాలో రైళ్లలో వెళ్లే సంఖ్య ఎక్కువే. సుదూర ప్రాంతాలకు వెళ్లాలనుకునే వారు రైళ్లను ఎంచుకుంటారు. ప్రతీ రోజు కోట్లాది మంది ప్రజలు రైళ్లలో ప్రయాణం చేస్తుంటారు. సాధారణంగా ప్రజలు తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు రైల్వేస్టేషన్‌కు వెళ్తుండగా.. మరికొందరు వారిని సాగనంపేందుకు స్టేషన్లకు వెళ్తుంటారు. అయితే రైల్లో ప్రయాణం చేయని వ్యక్తులు తప్పనిసరిగా ఫ్లాట్ ఫామ్ టికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. ఇది దశాబ్దాల నుంచి ఉంటున్న నిబంధన. ప్రస్తుతం రైల్వే స్టేషన్లలో ఫ్లాట్ ఫాం టికెట్ ధర రూ.10. ఈ టికెట్‌ను తీసుకుంటే దాదాపు రెండు గంటల పాటు రైల్వే స్టేషన్‌లలో ఉండొచ్చు. ఇంతకీ ఫ్లాట్ ఫాం టికెట్ కచ్చితం ఎందుకు.. ఒకవేళ ఈ టికెట్‌ను తీసుకోకపోతే ఏం జరుగుతుంది. ఫ్లాట్ ఫామ్ టికెట్ వెనక అసలు ఉద్దేశం ఏంటో ఇప్పుడు చూద్దాం.

ఫ్లాట్ ఫామ్ టికెట్ ప్రధాన ఉద్దేశం.. ఫ్లాట్ ఫామ్ టికెట్ ప్రధాన ఉద్దేశం రైల్వే స్టేషన్‌లో రద్దీని తగ్గించడమే. రైళ్లల్లో ప్రయాణం చేయని వ్యక్తులు వారి బంధువులను సాగనంపేందుకు స్టేషన్లకు వస్తుంటారు. ఈ క్రమంలో రైల్వే స్టేషన్లలో రద్దీ అధికంగా ఉంటుంది. రద్దీని నివారించడానికే ఫ్లాట్‌ఫామ్ టికెట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. 1950 నుంచి ఈ విధానం అమలులో ఉంది. రద్దీని నియంత్రించడానికి, భద్రతను పెంపొందించడానికే ఈ విధానాన్ని రూపొందించారు. న్యూఢిల్లీ, హౌరా, చెన్నై సెంట్రల్ వంటి పెద్ద స్టేషన్‌లలో రోజుకు లక్షలాది మంది ప్రయాణిస్తుంటారు. వీరిని సాగనంపేందుకు చాలా మంది వస్తుంటారు. ఈ క్రమంలో ఫ్లామ్‌ఫామ్‌ను టికెట్‌ను కచ్చితం చేశారు. ఈ టికెట్ లేకుండా ప్రవేశిస్తే రద్దీ అధికమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ టికెట్ తీసుకున్న వారి వివరాలు రికార్డు అవుతాయని.. అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించడంలో సహాయపడుతుందని రైల్వే అధికారులు చెబుతున్నారు.

టికెట్ తీసుకోకపోతే జరిగే పరిణామాలు..ఫ్లాట్‌ఫామ్ టికెట్ లేకుండా రైల్వే స్టేషన్‌లోకి ప్రవేశిస్తే జరిమానా తప్పదు. భారత రైల్వే చట్టం 1989, సెక్షన్ 55 ప్రకారం ఫ్లాట్ ఫామ్ టికెట్ లేకుండా ప్రవేశం నిషేధం. ఫ్లాట్‌ఫామ్ టికెట్ లేని వారు టికెట్ చెకింగ్ సిబ్బందికి చిక్కితే..రూ.250 నుంచి రూ.500 వరకు జరిమానా విధించే అవకాశం ఉంటుంది. జరిమానాను చెల్లించని పక్షంలో చట్టమైన చర్యలు తీసుకునే ఛాన్స్ ఉంది. లేదా స్టేషన్ నుంచి బయటకు పంపించేస్తారు. అంతే కాకుండా టికెట్ లేని వ్యక్తులను అనుమానాస్పదంగా భావించి వారిని విచారించే అవకాశమూ ఉంటుంది. అయితే కొన్ని రైల్వేస్టేషన్‌లలో టికెట్ కౌంటర్లు లేక, ఆన్‌లైన్ టికెట్ సౌలభ్యం సరిగా అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారనే ఫిర్యాదులు కూడా ఉన్నాయి.

ఈ టికెట్ నుంచి మినాహాయింపు ఎవరికంటే..ఫ్లాట్‌ఫామ్ టికెట్ విషయంలో పలువురికి మినహాయింపులు కూడా ఉన్నాయి. వికలాంగులు, వృద్ధులు, అత్యవసర పరిస్థితుల్లో వచ్చిన వారు ఆర్‌పీఎఫ్ అనుమతితో ఫ్లాట్‌ఫామ్ పైకి వెళ్లే వెసులుబాటు ఉంటుంది. కరోనా సమయంలో (2020-2022) రద్దీని తగ్గించేందుకు ఫ్లాట్‌ఫామ్ టికెట్ విక్రయాలను తాత్కాలికంగా నిలిపివేశారు. కరోనా అనంతరం ఫ్లాట్ ఫామ్ టికెట్ యధావిధిగా ప్రారంభమయ్యాయి. యూటీఎస్ యాప్ ద్వారా కూడా ఫ్లాట్‌ఫామ్ టికెట్‌ను కొనుక్కునే వెసులుబాటును కల్పించింది రైల్వే శాఖ.

ప్రజలు ఏమంటున్నారు.ాగా.. ఫ్లాట్‌ఫామ్ టికెట్‌కు సంబంధించి ప్రజల నుంచి మిశ్రమ స్పందనలు వచ్చాయి. రద్దీని తగ్గించేందుకు ఫ్లాట్‌ఫామ్ టికెట్‌లు ఉపయోగపడతాయని.. కానీ చిన్న స్టేషన్‌లలో ఈ టికెట్ అవసరం లేదని కొందరు చెబుతుండగా... టికెట్ కౌంటర్ల వద్ద క్యూలు, ఆన్‌లైన్ సమస్యల వల్ల ఇబ్బందులు పడుతున్నట్లు మరికొందరు చెబుతున్నారు.ఫ్లాట్‌ఫామ్ టికెట్ అనేది రైల్వేస్టేషన్‌లో రద్దీని, భద్రతా పరమైన సమస్యలను నియంత్రించేందుకు రూపొందిన విధానం. ఈ టికెట్‌ను తీసుకోకపోతే జరిమానా తప్పదు. అలాగే ఈ విధానాన్ని మరింత సులభతరం చేసేందుకు ఆన్‌లైన్ సౌకర్యాన్ని మెరుపరిస్తే ప్రజలకు ఇబ్బందులు అవకాశం ఉంటుంది. ఈ టికెట్ విధానం ద్వారా రైల్వే వ్యవస్థ సామర్థ్యాన్ని, భద్రతను కాపాడుతూనే ప్రయాణికుల సౌలభ్యాన్ని కూడా పరిగణలోకి తీసుకోవాల్సి అవసరం ఉంది.

# బిజినెస్





## బ్యాడ్ న్యూస్

బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపేణా డబ్బు పొదుపు చేసిన వారికి బ్యాడ్ న్యూస్ చెబుతున్నాయి దేశ వాణిజ్య బ్యాంకులు. ఇప్పటికే సవరించిన వడ్డీ రేట్లు అమల్లోకి వచ్చేశాయి.

ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ఇచ్చే వడ్డీని ఇప్పుడు బ్యాంకులు తగ్గిస్తున్నాయి. ఇప్పటికే ప్రముఖ బ్యాంకులు సదరు వడ్డీ రేట్లను సవరించాయి. సవరించిన రేట్లు అమల్లోకి వచ్చేశాయి కూడా. ప్రైవేటు రంగ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ తగ్గించిన వడ్డీ రేట్లను ఏప్రిల్ 1 నుంచే అమల్లోకి తీసుకురాగా, ప్రభుత్వరంగ అతిపెద్ద బ్యాంక్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అమృత్ కలశ్ పేరిట అందిస్తున్న స్పెషల్ డిపాజిట్ స్కీమ్‌ను మార్చి 31తో నిలిపివేసి చేతులు దులుపుకుంది. 2023 ఏప్రిల్ నుంచి 400 రోజుల కాలపరిమితితో ఈ డిపాజిట్ స్కీమ్‌ను ఎస్బీఐ అందించేది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (%=దీ×%) ద్రవ్య విధాన కమిటీ సమావేశం 2025 ఏప్రిల్ 7-9 తేదీల్లో జరగనున్న సంగతి తెలిసిందే. ఈ సమావేశంలో రెపో రేటు మరికొంత తగ్గింపుపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అంచనాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో, మూడు ప్రముఖ బ్యాంకులు హెచ్‌డీఎఫ్‌సీ, యెస్ బ్యాంకు, పంజాబ్ అండ్ సింద్ బ్యాంకు తమ ఫిక్స్‌డ్ డిపాజిట్ వడ్డీ రేట్లను తగ్గించాయి. ఏప్రిల్ 3, 2025 నాటికి, ఈ బ్యాంకులు కొన్ని నిర్దిష్ట గడువులపై వడ్డీ రేట్లను 25 నుంచి 50 బేసిస్ పాయింట్ల వరకు (1 బేసిస్ పాయింట్ = 0.01 శాతం) తగ్గించినట్లు ప్రకటించాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రెండు ఎంపిక చేసిన కాలవ్యవధుల డపాజిట్లపై ఎఫ్‌డీ రేట్లను తగ్గించింది. 35 నెలల కాలవ్యవధి కలిగిన ఎఫ్‌డీపై 35 బేసిస్ పాయింట్లు, 55 నెలల ఎఫ్‌డీపై 40 బేసిస్ పాయింట్లు మేర కోత పెట్టింది. ఇకపై ఈ రెండు కాల వ్యవధులపై రూ.3 కోట్ల లోపు రిటైల్ డిపాజిట్లపై గరిష్ఠంగా 7 శాతం మాత్రమే వడ్డీ లభించనుంది. సీనియర్ సిటిజన్లకు 50 బేసిస్ పాయింట్లు అదనం. 21 నెలల కాలవ్యవధిపై మాత్రం అత్యధికంగా 7.25 శాతం వడ్డీని అందిస్తోంది.

# ఆరోగ్యం- మహాభాగ్యం

## పీఎం మోదీ ఏడాదిలో 300 రోజులు తినే మఖానా స్పెషల్



ఎండాకాలంలో ఆరోగ్యంగా ఉండేందుకు ఆహారం, పానీయాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. అలాగే ఈ పదార్థాన్ని కూడా రోజువారీ ఆహారంలో భాగం చేసుకుంటే మంచిదని కొద్ది మందికే తెలుసు. అదే సూపర్ ఫుడ్ అని పిలిచే మఖానా. వీటినే తామరగింజలు అని కూడా అంటారు. సాధారణంగా అందరూ మఖానాను అల్పాహారంగానే తీసుకుంటారు. ఇలా చిరుతిండిగా తినే బదులు వేసవి కాలంలో మఖానా రైతా తిని చూడండి. ఎండలకు నీరసించిపోకుండా ఎంత ఉత్సాహంగా ఉంటారో మీకే తెలుస్తుంది. ప్రధాని మోదీ కూడా ఈ రెసిపీని ఏడాదిలో 300 రోజులు తినడం వల్లే ఆరోగ్యంగా ఉండగలుగుతున్నానని అంటున్నారు. మరి, ఆలస్యమెందుకు. పెరుగుతో తయారు చేసే మఖానా రైతా తయారీ విధానం, ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలుసుకుందామా..

కావాలసిన పదార్థాలు:

పెరుగు- 2 కప్పులు

మఖానా- ఒక కప్పు

జీలకర్ర పొడి- తగినంత

ఉప్పు- తగినంత

కారం- 2 టేబుల్ స్పూన్లు

తయారీ విధానం:మఖానా రైతా చేయడానికి ముందుగా ఒక గిన్నెలో పెరుగు తీసుకోండి. అందులో మఖానా వేసి, జీలకర్ర పొడి, రుచికి తగిన ఉప్పు, కారం వేసి బాగా కలపండి. ఇప్పుడు పైన సన్నగా తరిగిన కొత్తిమీర వేయండి. అంతే.. ఎంతో రుచికరమైన, పోషకాలున్న మఖానా రైతా తయారైపోతుంది. దీనిని వేసవిలో తరచూ తింటే శరీరం హైడ్రేటెడ్‌గా ఉంటుంది. శరీరంలో వేడి తగ్గించి చల్లబరుస్తుంది.

మఖానా ఆరోగ్య ప్రయోజనాలు:కడుపు ఆరోగ్యంపెరుగులో కడుపు ఆరోగ్యానికి మేలు చేసే ప్రోబయోటిక్స్ పుష్కలంగా ఉంటాయి. దీన్ని రోజూ క్రమం తప్పకుండా వినియోగిస్తే జీర్ణక్రియ ప్రక్రియ సులభతరం చేస్తుంది. ఇక మఖానాలోని ఫైబర్ కూడా కడుపు సమస్యలను తగ్గిస్తుంది. వేసవి కాలంలో ఈ రెండు పదార్థాలు కలిపిన రైతాను తీసుకోవడం వల్ల అజీర్ణం, మలబద్ధకం వంటి సమస్యలు తొలగిపోతాయి.

శక్తి- వేసవిలో ఎండలు శరీరంలోని శక్తిని చాలా వేగంగా హరించివేస్తాయి. చెమట రూపంలో శరీరంలోని నీరంతా బయటికి వచ్చేస్తుంది. త్వరగా డీహైడ్రేట్ అయిపోతారు. అందుకే పెరుగు, మఖానా కలిపిన రైతా తింటే తక్షణమే ఎనర్జీ వస్తుంది. మఖానాలో కార్బోహైడ్రేట్లు కూడా ఉంటాయి. పెరుగులోని కాల్షియం, ప్రోటీన్ వంటి పోషకాలు మఖానాతో కలిపి తిన్నప్పుడు మరింత ప్రభావవంతంగా పనిచేస్తాయి. శరీరానికి వెంటనే శక్తినివ్వడంతో పాటు ఎముకలను బలంగా చేస్తాయి.

హైడ్రేషన్- వేసవిలో శరీరంలో నీరు ఎక్కువగా తీసుకోవాల్సి వస్తుంది. దాహం వేసిన ప్రతిసారీ నీళ్లు లేదా కూల్ డ్రింక్స్ బదులుగా పెరుగు తీసుకుంటే కడుపు చల్లగా ఉంటుంది. శరీరం డీహైడ్రేట్ కాదు.

కొలెస్ట్రాల్- ఈ రోజుల్లో చాలా మంది కొలెస్ట్రాల్ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. అది తగ్గించుకోలేక నానా తంటాలు పడుతుంటారు. కొలెస్ట్రాల్ తగ్గించుకోకపోతే ఇతర వ్యాధులు చుట్టుముట్టే అవకాశం ఉంది. అందుకే ఈ సమస్యకు పరిష్కారంగా మఖానా తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్‌ను సులభంగా తగ్గించుకోవచ్చు. గుండె కూడా ఆరోగ్యంగా ఉంటుంది.

మఖానాలో యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇందులోని తక్కువ ప్రొటీన్, సోడియం బీపీ నియంత్రించేందుకు సహాయపడుతుంది. తద్వారా గుండెపోటు సమస్యలు రాకుండా నివారించవచ్చు. ఇందులో గ్లైసెమిక్ స్థాయి కూడా తక్కువే కాబట్టి డయాబెటిస్ పేషెంట్లకు మరీ మంచిది. ఇందులోని సహజ ఆస్ట్రిజెంట్ లక్షణాలు కిడ్నీల పనితీరును మెరుగుపరుస్తాయి. అలాగే ఎముకలను దృఢంగా చేస్తాయి. కాబట్టి, ఈ అల్పాహారాన్ని మీరు కూడా ఇప్పటినుంచి రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం మర్చిపోవద్దు.

## వంకాయ కూర అంటే ఇష్టమా.. ముందుగా ఇది తెలుసుకోండి..



వంకాయ కూర.. పేరు వింటేనే చాలా మందికి నోరూరుతుంది. వంకాయతో చేసే వివిధ రకాల కూరలను భోజనప్రియులు ఎంతో ఇష్టంగా భుజిస్తారు. వంకాయ కూర మీద ఎన్నో సామెతలు కూడా ఉన్నాయి. అంత ఫేమస్ మరి వంకాయ. అంతేకాదండోయ్.. వంకాయ టేస్ట్ పరంగానే కాదు.. ఆరోగ్యపరంగానూ భేష్ అని ఆరోగ్య నిపుణులు చెబుతుంటారు. అయితే, ఇక్కడో చిన్న కండీషన్ అప్లై కూడా చేస్తున్నారు. వంకాయ ఇష్టంగా తినేవారు ఇది తప్పకుండా తెలుసుకోవాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. అవును, వంకాయతో ఆరోగ్య ప్రయోజనాలతో పాటు.. అనారోగ్య సమస్యలు కూడా ఉన్నాయి. వాటి విషయంలోనే కాస్త జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా వంకాయ కూరతో అన్నం తిన్న తరువాత కొన్ని పదార్థాలు తీసుకోవద్దని వైద్య నిపుణులు చెబుతున్నారు. పొరపాటున వాటిని తీసుకుంటే.. దీర్ఘకాలంలో అనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. మరి వంకాయ తిన్న తరువాత వేటిని తీసుకోవద్దో ఈ కథనంలో తెలుసుకుందాం..

వంకాయతో పాటు వీటిని అస్సలు తీసుకోవద్దు..వంకాయ కూరతో ఆహారం తిన్న తరువాత పొరపాటు కూడా పాలు తీసుకోకూడదని చాలా అధ్యయనాలు చెబుతున్నాయి. వంకాయను పాలను వెంటవెంటనే తీసుకోవడంతో వలన జీర్ణ సంబంధిత సమస్యలు ఏర్పడుతాయట. వాస్తవానికి పాలు జీర్ణం కావడానికి కాస్త ఎక్కువ సమయం పడుతుంది. అప్పటికే మనం తిన్న వంకాయలో ఫైబర్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. ఇటు ఫైబర్ కంటెట్.. అటు పాలను ఒకేసారి తీసుకోవడం వలన ఈ రెండూ జీర్ణమవడానికి ఇబ్బందిగా ఉంటుంది. ఫలితంగా మలబద్ధకం, కడుపు నొప్పి వచ్చే ప్రమాదాలు ఉన్నాయి. వీటితో పాటు ఇతర జీర్ణ సమస్యలు కూడా వచ్చే అవకాశం ఉంది.బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు పాలు తీసుకోవచ్చు. అప్పుడు పెద్దగా సమస్య ఉండదు. కానీ, అన్నం, వంకాయ కూర, పచ్చడి, పప్పుతో కూడిన భారీ భోజనం చేసిన తరువాత పాలు తీసుకోకూడదు. ఈ సమయంలో పాలు తాగితే జీర్ణ సమస్యలు వస్తాయి. పాలలో కొవ్వు శాతం ఎక్కువగా ఉంటుంది. అది జీర్ణం కావడానికి సమయం పడుతుంది. ఇక చాలా మంది వంకాయ కూరతో అన్నం తిన్న తర్వాత పెరుగు తింటుంటారు. ఇలా చేయడం కూడా సరైనది కాదని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇవి రెండు కూడా వ్యతిరేక స్వభావాలను కలిగి ఉంటాయి. పెరుగు చల్లటి స్వభావం కలిగి ఉంటుంది. వంకాయ వేడి స్వభావాన్ని కలిగి ఉంటుంది. ఫలితంగా జీర్ణ సమస్యలు అధికమవుతాయి.

టీ, కాఫీ కూడా..చాలా మంది టిఫిన్ లేదా భోజనం చేసిన తర్వాత కాఫీ లేదా టీ తాగుతారు. ఇది కూడా ఆరోగ్యానికి హానీ తలపెడుతుంది. ఇక వంకాయతో చేసిన ఆహారం తిన్న తరువాత కాఫీ గానీ, టీ గానీ తాగితే తీవ్ర అనారోగ్య సమస్యలు ఏర్పడే అవకాశం ఉంది. టీ టానిన్ రిచ్ డ్రింక్. వంకాయతో అన్నం తిన్న తరువాత టీ తాగడం వల్ల శరీరం పోషకాలను గ్రహించలేని పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో శరీరానికి కావాల్సిన పోషకాలు అందకుండా పోతాయి. అందుకే.. వంకాయ తిన్న తరువాత టీ, కాఫీ అస్సలు తాగకండి.

మాంసం, వంకాయ..చాలా మంది వంకాయతో మాంసం కలిపి వండుతారు. కానీ, అలా చేయొద్దని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ రెండు ఆహారాలు కలిపి తినడం వల్ల జీర్ణ సమస్యలు ఎక్కువ అవుతాయి. కడుపు ఉబ్బరం, మలబద్ధకం వంటి సమస్యలు అధికమవుతాయి. అందు్టు ఈ ఫుడ్ కాంబినేషన్‌కు ఎంత దూరంగా ఉంటే అంత ఉత్తమం అని చెబుతున్నారు. ఇక ముఖ్యంగా రక్తహీనత సమస్యతో బాధపడేవారు వంకాయలు తినకూడదని చెబుతున్నారు. వంకాయ తింటే శరీరంలో రక్తం ఏర్పడే ప్రక్రియను ప్రభావితం చేస్తుందట. అందుకే.. రక్తహీనత సమస్యతో బాధపడేవారు వంకాయను తినొద్దని సూచిస్తున్నారు.

# 5 రూపాయల 50 పైసలకు ఇటుక సరఫరా..

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇటుక సరఫరా ధర నిర్ణయం పై ప్రకటన విడుదల చేసిన జిల్లా కలెక్టర్



పెద్దపల్లి// జూలై 22 అక్షరం న్యూస్

పెద్దపల్లి జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఇటుకలను ఒక్కో ఇటుక 5 రూపాయల 50 పైసలకు సరఫరా చేసేందుకు ఇటుక బట్టీల యాజమానులు నిర్ణయించారని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటుక బట్టీల యాజమాను లతో కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకానికి పెద్దపల్లి జిల్లాలో ఉన్న 102 ఇటుక బట్టీల నుంచి తక్కువ ధరకు ఇటుక సరఫరా చేయాలని వారిని ఒప్పించడం జరిగింది. మొదటి విడత కింద పెద్దపల్లి జిల్లాకు ప్రభుత్వం 9 వేల 421 ఇందిరమ్మ ఇండ్లు కేటాయింపు చేయగా ఇప్పటివరకు 6 వేల 18 ఇండ్లను లబ్ధిదారులకు మంజూరు చేసామని, 3 వేల 847 గృహాలకు మార్కింగ్ చేసి బేస్మెంట్ పనులు జరుగుతున్నాయని అన్నారు.

ప్రతి ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి 12,000 ఇటుకల అవసరం అవుతాయని, ఒక్కో ఇటుక 5 రూపాయల 50 పైసలకు సరఫరా చేసేందుకు జిల్లాలో ఉన్న 102 ఇటుక బట్టీల యాజమాన్యుల సమావేశంలో నిర్ణయించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. పెద్దపల్లి, శ్రీరాంపూర్, పాలకుర్తి, కమాన్ పూర్ మండలాల్లోని లబ్ధిదారులకు పెద్దపల్లి మండలంలో తయారుచేసిన ఇటుక బట్టీల నుంచి, సుల్తానాబాద్ ఓదెల, ఎలిగేడు, జూలపల్లి మండలాల్లోని లబ్ధిదారులకు సుల్తానాబాద్ మండలంలో తయారుచేసిన ఇటుక బట్టీల నుంచి సరఫరా అవుతుందని అన్నారు.ధర్మారం మండలంలోని ఇటుక బట్టీలు ధర్మారం మండలానికి, రామగిరి , రామగుండం మండలాల్లో తయారు అయ్యే ఇటుక బట్టీల నుంచి రామగిరి మంథని ముత్తారం మంథని మండలాలకు ఇటుకల సరఫరా అవుతాయని కలెక్టర్ తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం అవసరమైన ఇటుకలను ప్రతి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుడు ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి ద్వారా ఒకేసారి లిఫ్ట్ చేయుటకు వాహన సంఖ్య తో పర్మిట్ లెటర్ ఎంపీడీవో ద్వారా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలను పూర్తి స్థాయిలో త్వరగా నిర్మించుకోవాలని, ఈ ప్రక్రియను పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి, పిడి హౌసింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల పట్ల వివక్షత తగదు

- జీతాల పెంపుదల లో సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వం సమాధానం చెప్పాలి.
- సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్ డిమాండ్
- త్వరలోనే సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ఆందోళనకు సిద్ధమవుతున్న జేపీసీ నాయకత్వం.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ 22 జూలై/ అక్షరం న్యూస్: సింగరేణి కాంట్రాక్టు కార్మికుల జీతాలు పెంచాలని, అనేక సంవత్సరాల నుండి సింగరేణి లాభాల బాటలలో, అభివృద్ధి లో భాగస్వామ్యం వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల న్యాయం చేయాలని వారికి జీతాలను వెంటనే పెంచి చిరకాల ఆకాంక్షను తీర్చాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం సిఐటియు కొత్తగూడెం బ్రాంచ్ ఉపాధ్యక్షులు భూక్య రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం రోజున కాంట్రాక్టు కార్మికుల పని ప్రాంతాల వద్ద కార్మికులతో సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా భూక్య రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎప్పటికప్పుడు కాంట్రాక్టు కార్మికుల జీవితాలతో ఆటలాడుకుంటూ, వారి ఆశలతో ,అస్తిత్వంతో ఆటలాడుకోవడం సరైనది కాదన్నారు. కాంట్రాక్టు కార్మికుల జీతాలు పెంచుతామని మాట తప్పిన రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సింగరేణి యాజమాన్యం వెంటనే చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు.నిరంతరం సింగరేణి లాభాల లోనే ఉంటుందని అటువంటి లాభాల దిశగా నడుస్తున్న సింగరేణి అభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తున్న కాంట్రాక్టు వర్కర్ల జీతాలు వెంటనే పెంచాలని ఆయన డిమాండ్ చేశారు . ఎప్పటికప్పుడు ప్రభుత్వం పెంచుతామని పత్రికా ప్రకటనలకు, మీడియా ముందు చెబుతున్నారే తప్ప ఆచరణలో మాత్రం మొండి చేయి చూపిస్తున్నారని వారు విమర్శించారు .ఇటువంటి పద్ధతులు మానుకోవాలని భవిష్యత్తులో కాంట్రాక్టు కార్మిక సంఘాల జేపీసీగా జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడి కార్యాచరణను రూపొందిస్తున్నామని ఆయన కార్మికులకు తెలిపారు .ఈ పోరాటంలో కార్మికులు ఐక్యంగా నిలబడాలని పిలుపునిచ్చారు .ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు పప్పుల ప్రమోద్ గుగులోత్ సక్రం, మాతంగి రాజేష్ ,భాస్కర్ , సురేష్, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు..

# ప్రభుత్వాలు మత్తు పానీయాల్లో యువతను ప్రేరేపిస్తున్నాయి..

- నిరుద్యోగ భృతి ఇవ్వాలి
- కాంగ్రెస్ ప్రభుత్వం యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి
- రాష్ట్ర కార్యదర్శి వి అజయ్




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ 22 జూలై/ అక్షరం న్యూస్: యువజలను ప్రాధమ్యంతో ఈ దేశ జాతీయోత్పత్తిని పెంచి,సగౌరవంగా నిలబెట్టాల్సిన స్థితిలో గంజాయి,డ్రగ్స్, మత్తు పానీయాలల్లో యువతను ప్రభుత్వాలు ప్రేరేపిస్తున్నాయి అని ప్రగతిశీల యువజన సంఘం పి వై ఎల్ రాష్ట్ర కార్యదర్శి వాంకుడోత్ అజయ్ మంగళవారం పాల్వంచ మండల కేంద్రంలో జరిగిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రగతిశీల యువజన సంఘం జనరల్ కౌన్సిలింగ్ సభ లో ఆయన అన్నారు. ఈ జనరల్ కౌన్సిలింగ్ సభకు అధ్యక్షులుగా ధారావత్ దేవా, పూనెం మంగయ్య అధ్యక్షత వహించారు సంఘం జెండా ఆవిష్కరణ ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ధారావతి దేవ ఎగరవేయడం జరిగింది. అనంతరం సభ ప్రారంభంలో అమరవీరుల సంతాప సభ తీర్మానం జిల్లా కార్యదర్శి కోర్సా రామకృష్ణ ప్రవేశపెట్టారు.ఈ సందర్భంగా ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి వి అజయ్ మాట్లాడుతూ.సమాజ మార్పులో,అభివృద్ధిలో అగ్రభాగాన నిలబడే యువతను ఈ దేశ పాలక వర్గలు విస్మరిస్తున్నాయి అని యువతను పావన,నవ జీవన,బృందావన నిర్మాతలుగా మాలచాల్సిన ప్రభుత్వాలు నిరుద్యోగ యువకులుగా నిలబెడుతున్నాయని.దేశ జనాభాలో 40 శాతానికి పైగా యువతి,యువకులు ప్రాబల్యం కలిగి ఉండి కూడా ఆకలి సూచీ పట్టికలో అగ్ర భాగాన ఉన్నాం.నిద్రలేస్తూనే దేశభక్తి రసాల్ని పిండే పాలకులు,యువత ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారు.ప్రతి ఎన్నిక సందర్భాలలో ఉచిత వాగ్దానాలు,ప్రగల్భాలూ పలుకుతూ పబ్బం గడుపుతున్నారు.కానీ నిజమైన ఆచరణ,ఉద్యోగ,ఉపాధి అవకాశాల కోసం కనీస స్పృహ లేదు అని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు.యువకుల జీవితాలను నాశనం చేస్తున్న మత్తు పదార్థాలను నిషేధించాలని,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామాలలో ప్రభుత్వ వైద్యులు హెల్త్ క్యాంపులు నిర్వహించాలని, జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రతి ఏరియా ప్రభుత్వ హాస్పిటల్స్ లలో డాక్టర్స్,మందులు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్య తీసుకోవాలని.ప్రైవేట్,కార్పొరేట్ హాస్పటల్లో అధిక ఫీజులను అరికట్టాలని ప్రభుత్వ హాస్పిటల్స్ ను బలుపేతం చేసి ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించాలని నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించాలని యువకులకు గ్రంధాలయాలను నెలకొల్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అనంతరం సంఘ రాష్ట్ర కోశాధికారి వాసం బుచ్చిరాజు, కోర్సా రామకృష్ణ, మాట్లాడుతూ.యువత డ్రగ్స్ గంజాయి మత్తు పదార్థాల నుండి విముక్తి కావాలి అని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ప్రజలకు యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదు వారి వైఫల్యాలను ప్రశ్నించకుండా యువతకు డ్రగ్స్ గంజాయి ఇతర మత్తు పదార్థాలకు యువతను బానిసలు చేస్తున్నారని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను విమర్శించారు.దేశంలో కోట్లాదిమంది యువకులు,ఉపాధి లేక రోడ్లపై నిరాశలై తిరుగుతున్నారని యువతకు ఉపాధి అవకాశాల కోసం యువత ఉద్యమించాలని వారు అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు నిరుద్యోగులకు రూ.4వేలు భృతి చెల్లిస్తామని చెప్పి చెల్లించకుండా కాలయాపన చేస్తుందని ప్రభుత్వాన్ని విమర్శించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇవ్వలేదని,ఉద్యోగ భర్తీలో నిర్లక్ష్యం వహిస్తుందని అన్నారు.ఉద్యోగ క్యాలెండరు ప్రకటించినా,ఉద్యోగాలు మాత్రం భర్తీ చేయడం లేదన్నారు.కనీసం నిరుద్యోగ భృతి నాయనా అమలు చేయడం లేదని కాంగ్రెస్ పాలన రెండేళ్లు పూర్తి కావస్తున్న ఇకనైనా ప్రభుత్వం మేల్కొని,నాటికి నిరుద్యోగ భృతి పై క్లారిటీ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. సిపిఐ (ఎం ఎల్) మాస్ లైన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ముద్దా బిక్షం యువకులను ఉద్దేశించి మాట్లాడుతూ.మత విద్వేషాలతో ప్రజల మధ్య వైరుధ్యాలు పెంచడం జరుగుతుందని దేశంలో రాష్ట్రంలో ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పడానికి ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తున్నాయని వారిని అడ్డుకోవడంలో యువత ముందుండాలని పిలుపునివ్వడం జరిగింది.యువత ఉద్యోగాలు లేక బెట్టింగ్లకు డ్రగ్సులకు బానిసలై తిరుగుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేయడం జరిగింది.రాష్ట్రంలో లక్షలాది ప్రభుత్వ కొలువలు ఖాళీగా ఉన్నప్పటికీ వాటిని భర్తీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని,కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని నిత్యవసరకులధరలు విపరీతంగా పెరుగుతున్నాయని మహిళలపై అత్యాచారలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని వాటిని అరికట్టడంలో పాలకులు వైఫల్యం చెందారని,పాలకులు అనుసరిస్తున్న విధానాలపై యువత ఉద్యమించాలని పిలుపునిచ్చారు. జనరల్ కౌన్సిలింగ్లో నూతన జిల్లా కమిటీ ఎన్నుకోవడం జరిగింది అధ్యక్ష కార్యదర్శులుగా పూనమ్ మంగయ్య, కొరసా రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా సనప కుమార్, సహాయ కార్యదర్శిగా ఏనుగుల సతీష్, కోశాధికారిగా కుంజా అర్జున్, కమిటీ సభ్యులు బాడిషా లక్ష్మణరావు, మూషిక లక్ష్మణ్ ఏనుగుల శాంతారావు వల్లోజీ చంద్రశేఖర్, బానోత్ జగదీష్ లను ఎన్నుకోవడం జరిగింది.ఈ సభలో సిపిఐ (ఎం ఎల్) మాస్ లైన్ పాల్వంచ డివిజన కార్యదర్శి గోకినపల్లి ప్రభాకర్,పార్టీ అనుబంధ సంఘం అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా కార్యదర్శి అమర్లపూడి రాము,జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నుపా భాస్కర్,జాటోత్ కృష్ణ ,మరియు కల్లూరి కిషోర్ యువతను ఉద్దేశించి మాట్లాడారు.ఈ సభకు జిల్లా యువత పాల్గొనడం జరిగింది.

# మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుంది





## కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా /22 జూలై /అక్షరం న్యూస్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం కొత్తగూడెం క్లబ్ నందు ఇందిరా మహిళా శక్తి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావుకు మహిళలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల ద్వారా ఏర్పాటుచేసిన వివిధ స్టాల్సును వారు తయారు చేసిన ఆహార పదార్థాలను ఆయన పరిశీలించి మహిళలను అభినందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన ముందుగా జ్యోతి ప్రజ్వలం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన కొత్తగూడెం నియోజకవర్గం పరిధిలోని మహిళా సంఘాల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు, ప్రభుత్వం మహిళల అభివృద్ధికి అందిస్తున్న ప్రోత్సాహకాల గురించిన ప్రగతి నివేదికలను సభకు వివరించారు. అనంతరం కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థిక అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. దీనిలో భాగంగా మహిళలకు వడ్డీ లేని రుణాలు, మహిళల సంఘాల ద్వారా ఆర్టీసీ బస్సుల నిర్వహణ, మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం వంటి పలు మహిళా అభ్యున్నతి కార్యక్రమాలు



చేపడుతుందని తెలిపారు. గత పది సంవత్సరాల్లో ఎన్నడూ లేని విధంగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కార్యక్రమం ప్రభుత్వం చేపట్టిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డులు పంపిణీ జరగలేదని, ప్రస్తుతం కొత్త రేషన్ కార్డులతో పాటు రేషన్ కార్డుల సవరణలు మరియు చేరికలు కూడా చేపట్టారన్నారు. ఈనెల 25 నుంచి 10 వ తారీకు వరకు ప్రతి మండల కేంద్రంలో రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమాల్లో పెద్ద ఎత్తుగా నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం మహిళల ఆర్థిక అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను సద్వినియోగపరచుకోవాలని, తమ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకోవడంతో పాటు కుటుంబాలు అభివృద్ధి, సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. మహిళల శక్తిని గుర్తించి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం ఇంకా ఎన్నో కార్యక్రమాలు చేపట్టాలని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని చుంచుపల్లి, లక్ష్మీదేవి పల్లి, సుజాతనగర్ మరియు పాల్వంచ మండలాల్లో మొత్తం 2984 మహిళా సంఘాల లో 29,801 సంఘ సభ్యులు ఉండగా,బ్యాంకు లింకేజ్, ద్వారా 157 స్వయం సహాయక సంఘాలకు 18 కోట్ల 27 లక్షలు.వడ్డీ లేని రుణాలు :2100 స్వయం సహాయ సంఘాలకు రెండు కోట్ల 36 లక్షలు.

లోన్ బీమా ఈ పథకం ద్వారా 7 కి 5,90, 448 రూపాయలు.ప్రమాద భీమ ఈ పథకం క్రింద -01 కి 10,00,000 రూపాయలు.మహాలక్ష్మి పథకం ద్వారా పాల్వంచ మండలంలో ఒక బస్సుకు 69,468 రూపాయల చెక్కులను శాసనసభ్యుని చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఆర్ డి ఓ మధు, డీఎస్ఓ రుక్మిణి, జడ్పీ సీఈఓ నాగలక్ష్మి, తాసిల్దార్ లు కొత్తగూడెం పాల్వంచ సుజాతనగర్ చుంచుపల్లి లక్ష్మీదేవిపల్లి, మహిళా సంఘాలు సభ్యులు మరియు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్








భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ 22 జూలై/ అక్షరం న్యూస్: టేకులపల్లి మండలంలోని సులనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, మౌలిక సదుపాయాలు, ఔషధాల లభ్యత, పరిశు భ్రత, సిబ్బంది హాజరు, రోగుల రిజిస్టర్లు, డాక్టర్ల హాజరు పత్రాలు, ల్యాబ్ మరియు ఔషధ నిల్వల రికార్డులను పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాల్సిన అవసరం ఉందని, ప్రభుత్వ వైద్య కేంద్రాలపై ప్రజల్లో నమ్మకం పెరగాలంటే సేవల నాణ్యతతో పాటు సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించడం ఎంతో అవసరమని కలెక్టర్ అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానిక కావలసిన పరికరాలు, చేపట్టవలసిన అభివృద్ధి పనులపై నివేదికల సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం కలెక్టర్ ముత్యాలంపాడు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు, శుభ్రత, ఉపాధ్యాయుల హాజరు తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించిన కలెక్టర్ గారు వారి పాఠ్య పుస్తకాలు, నోట్‌బుకులు పరిశీలించి, వారికి తెలుగు భాషలో రాయడం, చదవడం ఎంతవరకు వచ్చునో ప్రత్యక్షంగా పరీక్షించారు. విద్యార్థుల చేతిరాతను పరిశీలిస్తూ వారితో ఉపాధ్యాయులు పాఠాలు ఎలా చెబుతున్నారు, భవిష్యత్తులో ఏం అవ్వాలనుకుంటున్నారు అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేస్తూ, విద్యార్థుల్లో అభ్యాసంపై ఆసక్తి పెంచేలా బోధన సాగాలని కలెక్టర్ గారు తెలిపారు. ప్రతి ఒక్కరికీ చదవడం, రాయడం, అర్థం చేసుకోవడం వంటి ప్రాథమిక నైపుణ్యాలు కలిగేలా వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. తరగతుల్లో విద్యార్థుల ప్రతిభను మెరుగుపరిచే విధంగా తరచూ అధ్యయనం కొనసాగించాలని అన్నారు. అదే విధంగా పాఠశాల ప్రాంగణం పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, తాగునీటి సదుపాయం, విద్యుత్, మరుగుదొడ్ల వంటి మౌలిక వసతులను ఎప్పటికప్పుడు నిర్వహించాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. పాఠశాలలో విద్యార్థులు అధికంగా ఉండటం పాఠశాల తరగతులు సరిపోవడంలేదని పరిశీలించిన కలెక్టర్ అదనపు తరగతి గదుల నిర్మాణానికి తగిన ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు మరియు సిబ్బంది మరియు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవు

- మణుగూరు డిఎస్పీ రవీందర్ రెడ్డి
- మణుగూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని భగత్ సింగ్ నగర్ లో మణుగూరు సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాం





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా /22 జూలై/ అక్షరం న్యూస్ :జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ ఆదేశాల మేరకు మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో మణుగూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని భగత్ సింగ్ నగర్ లో కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాం ను నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా కాలనీలలోని ఇండ్లలో సోదాలు నిర్వహించడం జరిగింది. ఇట్టి సోదాలలో సరిగ్గా పత్రాలు లేని 04 ఆటోలు,44 బైకులను సీజ్ చేసి జరిమానాను విధించడం జరిగిందన్నారు. అదేవిధంగా గంజాయి వంటి ప్రభుత్వ నిషేధిత పదార్థాలను కనుగొనడానికి నార్కోటిక్ డాగ్స్ ద్వారా సోదాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. అనంతరం అక్కడి స్థానికులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టవ్యతిరేక మరియు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని కోరారు. అట్టి వ్యక్తులపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని అన్నారు. రాబోయే ఎన్నికల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ గారి సూచనలు మేరకు ఇలాంటి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. తమ ప్రాంతంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. మట్కా,జూదం,బెట్టింగ్,గంజాయి రవాణా వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేయడమైనదని తెలిపారు. ఇట్టి అసాంఘిక

## ధన్‌ఖడ్ రాజీనామాపై రాజకీయ చర్చ

- అనూహ్య రాజీనామాకు కారణాలపై ఆరా
- లోతైన కారణాలు ఉంటాయని జైరామ్ రమేశ్ అనుమానం

న్యూఢిల్లీ,జూలై22(అక్షరం న్యూస్

ఉప రాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాపై రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఎవరికి తోచిన విధంగా వారు విశ్లేషణలు చేస్తున్నారు. ఇంత సడన్‌గా ఎందుకు రాజీనామా నిర్ణయం తీసుకున్నారని ఆరా తీస్తున్నారు. ధన్‌ఖడ్ అనూహ్య రాజీనామాపై ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ అనుమానాలు వ్యక్తం చేసింది. అనారోగ్య కారణాలతో వైదొలుగుతున్నట్లు ఆయన చెప్పినప్పటికీ.. అది కారణం కాకపోవచ్చని ఆ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. 'ధన్‌ఖడ్ సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు బిజినెస్ అడ్వైజరీ కమిటీకి అధ్యక్షత వహించారు. భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్రమంత్రి కిరణ్ రిజిజుతో సహా పలువురు దీనికి హాజరయ్యారు. చర్చ అనంతరం సాయంత్రం 4.30కు మళ్లీ సమావేశం కావాలని నిర్ణయించుకున్నారు. అయితే, మరోసారి భేటీకి రిజిజు, నడ్డా రాలేదు. దీంతో ఆగ్రహం వ్యక్తంచేసిన ధన్‌ఖడ్ మంగళవారం మధ్యాహ్నానికి వాయిదా వేశారు. దీన్ని బట్టి సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 4.30 మధ్య ఏదో పెద్ద విషయమే జరిగిందని జైరామ్ రమేశ్ అనుమానం వ్యక్తం చేశారు.

రిజిజు, నడ్డా ఉద్దేశపూర్వకంగానే సమావేశానికి గైర్హాజరయ్యారు. ఈక్రమంలోనే ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నట్లు ధన్‌ఖఢ్ ప్రకటించారు. ఆరోగ్య కారణాల దృష్ట్యా ఇలా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. దాన్ని మనం గౌరవించాలి. కానీ, అందుకు చాలా లోతైన కారణాలు ఉన్నట్లు తెలుస్తోందని రమేశ్ రాసుకొచ్చారు. తన పదవీకాలంలో రైతుల సంక్షేమంపై ధన్‌ఖఢ్ నిర్భయంగా మాట్లాడేవారని రమేశ్ పేర్కొన్నారు. ప్రజాజీవితంలో న్యాయపరమైన జవాబుదారీతనం, సంయమనం గురించి గట్టిగా మాట్లాడారన్నారు. ఆయన నిబంధనలు, ప్రొటోకాల్‌కు కట్టుబడి ఉన్నారన్నారు. సోమవారం పార్లమెంటు వర్షాకాల సమావేశాలు మొదలైన సంగతి తెలిసిందే. తొలి రోజు కార్యక్రమాలను సజావుగా నిర్వహించిన ధన్‌ఖఢ్ రాత్రి అనూహ్యంగా రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు పంపారు. అనారోగ్య కారణాల వల్లే తాను పదవి నుంచి వైదొలుగుతున్నట్లు అందులో పేర్కొన్నారు. 2022 ఆగస్టు 11న ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన ధన్‌ఖడ్‌కు 2027 ఆగస్టు వరకూ పదవీకాలం ఉంది.

## పీవీకే 5మైన్ లో ఐ ఎన్ టీ యు సి ఆధ్వర్యంలో గేట్ మీటింగ్.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ రుద్రంపూర్/ 22 జూలై /అక్షరం న్యూస్: పీవీకే 5 మైన్ నందు ఐ ఎన్ టీ యు సి పిట్ కమిటీ ఆధ్వర్యంలో పిట్ సెక్రటరీ చిలక రాజయ్య అధ్యక్షతన గేట్ మీటింగ్ జరిగినది. ఈ గేట్ మీటింగ్ కు ముఖ్య అతిథిగా కేజీఎం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎండీ రజాక్ హాజరైనారు. రజాక్ కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా కార్మికులు ఎదురుకుంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని మేనేజ్మెంట్ ను డిమాండ్ చేయడం జరిగినది. గత నాలుగు నెలలుగా నిలిచిపోయిన మెడికల్ బోర్డు వెంటనే నిర్వహించాలి..మారు పేర్ల సమస్యను వెంటనే పరిష్కరించాలి. పెర్క్స్ పై కార్మికుని జీతంలో కట్ చేస్తున్న ఇన్కమ్ టాక్స్ ను రద్దు చేయాలి. కేజీఎం ఏరియా లో ఏర్పడ్డఅన్నిసర్ ఫేస్ డిజిగినేషన్ ఖాళీలను అదే ఏరియా ఉద్యోగులచే భర్తీ చేయాలి. కేజీఎం ఏరియా లో పని చేస్తున్న ఉద్యోగుల పర్సనల్ రికార్డ్ లో కుటుంబ సభ్యుల డీటేయిల్స్ లో ఏవైనా పొరపాట్లు ఉంటే వాటిని సరిచేయుటకు స్ట్రక్చర్ కమిటీ సమావేశంలో జీఎం దృష్టికి తీసుకురావడం జరిగినది జీఎం వెంటనే స్పందించి ఉద్యోగుల పర్సనల్ రికార్డు లో లోపాలను సరిచేయుటకు పర్సనల్ డిపార్ట్మెంట్ వారికీ ఆదేశాలు జరిచేయడం జరిగినది. అదేవిదంగా రక్షణ పరికరాల కొనుగోలు విషయంలో ఎల్ మైనస్ వన్ పద్ధతిని తీసివేయాలని మానేజ్మెంట్ ను డిమాండ్ చేయడం జరిగినది. పీవీకే 5మైన్ లో బెల్ట్ మెటీరియల్స్, పంచింగ్ మెషిన్ లు, మ్యాన్ రైడింగ్ మెటీరియల్స్ ను అన్యూవల్ ప్లాన్ లో పెట్టి ముందుగానే తెప్పించాలి. పీవీకే మైన్ లో కార్మికులు పనిచేసే పని ప్రదేశాలలో వెంటిలేషన్ మరియు నీటి సమస్యను మైన్ మానేజ్మెంట్ వెంటనే పరిష్కరించాలి. తదితర కార్మిక సమస్యలను ఐ ఎన్ టీ యు సి సెక్రటరీ జనరల్ జానక్ ప్రసాద్ దృష్టికి తీసుకు వెళ్లి వారి ద్వారా మానేజ్మెంట్ తో మాట్లాడించి కార్మిక సమస్యల పరిష్కారం కొరకు కృషి చేస్తామని కార్మికులకు హామీ ఇవ్వడం జరిగినది. ఈ సమావేశంలో పాల్గొన్నవారు. డిప్యూటీ జనరల్ సెక్రటరీ బూటుక రాజేశ్వర్ రావు, సెంట్రల్ కమిటీ మెంబెర్ మల్లారపు కొమరయ్య,జీఎం స్ట్రక్చర్ కమిటీ మెంబెర్ టీ. నాగార్జున, మైన్స్ కమిటీ నుండి సీతారాములు, వై శంకర్, వల్లలా సాంబమూర్తి, వీరన్న, సేఫ్టీ కమిటీ నుండి కొమ్ము సాంబయ్య,శివ క్రిష్ణ, పిట్ కమిటీ నాయకులు రామ్మోహన్ రావు,ఎం. బాలు,హుస్సేన్, శివ, అఖిల్, రామస్వామి, తారాచంద్, ఎన్ శంకర్, వెంకటేశ్వర్లు, రోహిత్, అరుణ్, బాబురావు,గణేష్, రాజేష్, రాంబాబు, కిరణ్ రాజ్, వినయ్, ఎస్.రవి, మధుసూదన్, రమాకాంత్, జె. రవి. నామాల శ్రీనివాస్, లక్ష్మణ్, శివ, నాగేశ్వరావు,రంజిత్, రాజేష్ చారి, క్రిష్ణ మూర్తి,తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎం నేత అచ్యుతానందన్ కు ఘననివాళులు



జనగామ జిల్లా/ రఘునాదపల్లి/( అక్షరం న్యూస్ )జూలై 22: మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో సిపిఎం నేత, కేరళ మాజీ ముఖ్యమంత్రి విఎస్.అచ్యుతానందన్ చిత్రపటానికి సిపిఎం నాయకులు మంగళవారం పూలమాలలు వేసి మనంగా నివాళులర్పించారు, ఈ సందర్భంగా ఆయన పార్టీకి చేసిన సేవలను కొనియాడారు కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గంగాపురం మహేందర్, కడారి ఐలయ్య, మైలారం వెంకటేశ్వర్లు, పొదల లవక మార్, యాదగిరి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలలో పేరుకపోయిన సమస్యలను పరిష్కరించాలని సీపీఎం ధర్నా



జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్ )జూలై 22: మండలంలోని గ్రామాలలో పేరుకపోయిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల పరిషత్ కార్యాలయం ముందు సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. అనం తరం పలు సమస్యలతో కూడిన మెమొరాండంను ఎంపిడివో గార్లపాటి శ్రీనివాసులుకు అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గంగాపురం మహేందర్ శాగ యాదగిరి, మైలారం వెంకటేశ్వర్లు, వంగాల ఎల్లేష్, కడారి ఐలయ్య, నర్సయ మదుసూదన్ రెడ్డి, శాగ నాగరాజు, రవి, నామాల యాదగిరి. తూడి ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్






ఓదెల/పెద్దపల్లి జూలై 22(అక్షరం న్యూస్) మంగళవారం. పోత్కపల్లి పోలీస్ స్టేషన్ను ఆకస్మిక తనిఖీ చేసిన రామగుండం కమిషనర్ అంబర్ కిషోర్ ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్కు వచ్చిన పోలీస్ కమిషనర్ కు సుల్తానాబాద్ సిఐ సుబ్బారెడ్డి స్థానిక ఎస్సై దీకొండ రమేష్ పూల బొకే అందించారు అనంతరం పోలీస్ స్టేషన్లో వివిధ కేసులపై పట్టుబడ్డ వాహనాలను పరిశీలించారు అనంతరం రిసెప్షన్ రికార్డులను పరిశీలించారు అనంతరం స్టేషన్లో పనిచేస్తున్న పోలీసు అధికారుల పనితీరును పరిశీలించారు ఈ సందర్భంగా కమిషనర్ అంబర్ కిషోర్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో భౌగోళిక పరిస్థితులు ముఖ్యమైన ప్రదేశాలు ఈ ప్రాంతంలో మావోయిస్టుల కుటుంబాల వివరాలను ఎప్పటికప్పుడు గమనించాలని అదేవిధంగా గ్రామాలలో ఎలాంటి నేరాలు అధికంగా జరుగుతున్నాయో వాటిని ఏ విధంగా నియంత్రించాలని విషయంపై పలు సూచనలు చేశారు అదేవిధంగా కేసుల స్థితిగతులు కోర్టు క్యాలెండర్ సాంకేతిక మొదలగు వాటిని త్వరగా పరిశీలించాలని అక్రమ రవాణా అసాంఘిక కార్యకలాపాలను నిరోధించాలని సిబ్బందిని ఆదేశించారు సైబర్ నేరాలు జరగకుండా సైబర్ మోసాలకు గురికాకుండా ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించాలని అదేవిధంగా బాగా పనిచేసే సిబ్బందికి గుర్తించి రివార్డు ప్రోత్సాహాలు ఉంటాయని అన్నారు సమస్యతో వచ్చిన వ్యక్తులపై తక్షణ స్పందనతో పాటు మర్యాదపూర్వకంగా వారి ఫిర్యాదులకు స్పందించవలసిన బాధ్యత అందరిపై ఉండాలని సూచించారు పోలీస్ స్టేషన్ పరిధిలో విజిబుల్ పోలీసింగ్ బిట్లు పెట్రోలింగ్ పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు ఈ అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణంలో మొక్కలు నాటారు .ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఇన్చార్జి ఏసిపి శ్రీనివాస్ సుల్తానాబాద్ సిఐ సుబ్బారెడ్డి పుత్కపల్లి ఎస్ఐ డి రమేష్ కాల్వ శ్రీరాంపూర్ ఎస్సై ఎస్ వెంకటేష్ సీసీ హరీష్ తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





# రైతులను ఇబ్బందిపెడితే కఠిన చర్యలు తప్పవు

- దరఖాస్తుల తిరస్కారానికి సరైన కారణాలు చూపాలి
- ఆగస్టు 15 నాటికి వీలైనన్ని భూ సమస్యలు పరిష్కరించాలి
- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో పేదవాడికి ఏసమస్యా రాకూడదు
- లబ్దిదారులకు దగ్గరలోని ఉచిత ఇసుక ఇవ్వాలి
- జిల్లా కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో
- రాష్ట్ర రెవెన్యూ , హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా /22 జూలై /అక్షరం న్యూస్: తెలంగాణ ప్రజల ఆలోచనలు, ఆకాంక్షలకు అనుగుణంగా గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి నేతృత్వంలో రూపుదిద్దుకున్న భూభారతి చట్టం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పకడ్బందీగా అమలు చేయాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లదేనని రాష్ట్ర రెవెన్యూ , హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం నాడు డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ సచివాలయంలో చీఫ్ సెక్రటరీ కార్యాలయం నుంచి మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ చీఫ్ సెక్రటరీ కె. రామకృష్ణారావుతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన అద్భుతమైన భూ భారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసినప్పుడే దాని ఫలితాలు సామాన్యులకు అందుతాయని అన్నారు. మూడు దఫాలుగా నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించడానికి సామాన్యులను ముఖ్యంగా రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవని సస్పెండ్ చేయడానికైనా వెనుకాడబోమని హెచ్చరించారు.క్షేత్రస్థాయిలో కొంతమంది అధికారులు రైతులను ఇబ్బంది పెడుతున్నారనే సమాచారం ఉందని ఇది పునరావృతం కాకుండా చూడాలని కలెక్టర్లకు సూచించారు. రెవెన్యూ సదస్సుల్లో 8.65లక్షల దరఖాస్తులు వచ్చాయని ఇందులో ప్రధానంగా సాదాబైనామా, సర్వేనెంబర్ మిస్సింగ్, అసైన్డ్ ల్యాండ్ , అసైన్డ్ ల్యాండ్ రెగ్యులరైజేషన్, సక్సెషన్ కు సంబంధించి సుమారు 6 లక్షల దరఖాస్తులు వచ్చాయని వీటిని ఐదు విభాగాలుగా విభజించి ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలన జరిపి ఆగస్టు 15వ తేదీలోగా వీలైనన్ని సమస్యలను పరిష్కరించాలన్నారు. సాదాబైనామాల అంశం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉందని కోర్టు తీర్పుకోసం వేచిచూడకుండా దరఖాస్తులను పరిశీలించి పరిష్కారం కోసం సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లాల్లోని అసైన్డ్‌ల్యాండ్, లబ్దిదారుల వివరాలను ఈ నెల 30వ తేదీ లోగా ప్రభుత్వానికి పంపించాలని కలెక్టర్లకు సూచించారు. దరఖాస్తుల సంఖ్యను తగ్గించుకోవడానికి ఇష్టం వచ్చిన రీతిలో తిరస్కరించకూడదని, తిరస్కారానికి గల కారణాలను లిఖిత పూర్వకంగా దరఖాస్తుదారునికి తెలియజేయాలని సూచించారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.

ఈనెల 27వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా జీపీవోలకు , జె ఎన్ టి యు ఆధ్వర్యంలో లైసెన్స్ డ్ సర్వేయర్లకు పరీక్ష నిర్వహిస్తున్నామని ఇందుకు అవసరమైన ఏర్పాట్లను చేసుకొని పకడ్బందీగాపరీక్ష నిర్వహించాలన్నారు.

### ఇంటి నిర్మాణంలో పేదవాడికి ఏ సమస్య రాకూడదు

పేదవాడి సొంతింటి కల ఇందిరమ్మ ఇండ్ల నిర్మణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ధరలు, చెల్లింపులు, ఇసుక, సిమ్మెంట్, స్టీల్ విషయంలో ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏ సమస్య రాకుండా చూడాలని అలాగే ధరల నియంత్రణ కమిటీ చురుగ్గా పనిచేసేలా కలెక్టర్లు నిత్యం పర్యవేక్షించాలన్నారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం అవసరమైన ఇసుకను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని , ఇది సరైన విధంగా లబ్దిదారులకు అందేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. లబ్దిదారులపై రవాణా భారం అధికంగా పడకుండా వీలైనంత దగ్గరలో ఇసుక అందేవిధంగా చూడాలన్నారు. బేస్‌మెంట్ నిర్మాణం కోసం అక్కడక్కడ అందుబాటులో ఉన్న మట్టిని తీసుకెళ్తున్న లబ్దిదారులపై పోలీసులు కేసులు నమోదుచేయడం సరైన చర్య కాదని ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా కలెక్టర్లు, ఎస్పీలు చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్-1, ఎల్-2, ఎల్-3 జాబితాలతో సంబంధం లేకుండా నిరుపేదలైతే ఇల్లు కేటాయించాలన్నారు రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులున్నాకూడా ప్రతి సోమవారం చెల్లింపులు జరుపుతున్నామని అయితే సాంకేతిక సమస్యలతో కొంతమంది లబ్దిదారుల ఖాతాలో డబ్బులు జమ కావడం లేదని ముందుగానే గుర్తించి లబ్దిదారునికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. 2 బిహెచ్‌కే ఇండ్లకు సంబంధించి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి అర్హులైన లబ్దిదారులకు కేటాయించాలన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ కు ఐడిఓసి కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తో కలిసి పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం లికలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ. రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భూభారతి చట్టం 2025 అమలులో భాగంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తుల పరిశీలన త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు ఒకవేళ తిరస్కరణకు గురైతే దానికి గల కారణాలను పొందుపరచాలని అధికారులను ఆదేశించారు. ఐదు రోజుల్లో రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన దరఖాస్తుల పూర్తి వివరాలు నివేదికలు అందజేయాలన్నారు. ఆగస్టు 15 నాటికి జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియ వేగవంతం అయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరై నిర్మాణం మొదలు పెట్టని వారిని గుర్తించి త్వరితగతిన నిర్మాణాలు పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇందిరమ్మ నిన్న నిర్మాణానికి అవసరమైన సిమెంటు, మరియు స్టీలు ధరలు నియంత్రించాలని, అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ దసలవారీగా డబ్బులు జమ అయ్యే విధంగా అన్ని ఏర్పాట్లు చేయాలని అలసత్వం ప్రదర్శించరాదని అధికారులను హెచ్చరించారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా వనమహోత్సవ లక్ష్యాలను త్వరితగతిని పూర్తి చేయాలని అటవీ శాఖ అధికారులు సహకారంతో విస్తృతంగా తాటి చెట్లు నాటే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డిడి ట్రైబల్ వెల్ఫేర్ మణెమ్మ, పిడి హౌసింగ్ రవీంద్రనాథ్, షెడ్యూల్ కులాల సంక్షేమ శాఖ అధికారి అనసూయ, బీసీ సంక్షేమ అధికారి ఇందిరా , విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారి, పౌరసరఫరాల శాఖ మేనేజర్ త్రినాథ్ బాబు, ఎక్సైజ్ సూపర్డెంట్ జానయ్య, జిల్లా వైద్యశాఖ అధికారి జయలక్ష్మి మరియు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రాదేశిక ఎన్నికలపై బిగ్ అప్‌డేట్.. బ్యాలెట్ పేపర్ల కలర్ ఫిక్స్..!!

ఓదెల/ పెద్దపల్లి జూలై 22(అక్షరం న్యూస్ (

తెలంగాణ హైకోర్టు రాష్ట్రంలో త్వరలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరగనున్నాయి. ఎలక్షన్స్‌కు సంబంధించిన ఏర్పాట్లలో అధికారులు స్పీడప్ పెంచారు.ఈ క్రమంలో బ్యాలెట్ పేపర్ల కలర్లను ఫైనల్ చేశారు. ఎంపీటీసీకి గులాబీ, జెడ్పీటీసీకి తెలుపు రంగు బ్యాలెట్వినియోగించనున్నారు. దీనిపై ఇప్పటికే జిల్లా అధికారులకు ఆదేశాలు అందాయి. ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్సిబ్బందిని నియమిస్తున్నారు. పోలింగ్, బ్యాలెట్పేపర్, బ్యాలెట్బాక్సులు, స్టేషనరీ తదితర వాటన్నింటినీ మరోసారి సరిచూసుకొని సిద్ధంగా ఉండాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది.

### 400 మందికి ప్రిసైడింగ్ అధికారి

ఒక పోలింగ్కేంద్రంలో 400 మంది వరకూ ఓటర్లు ఉంటే ఒక ప్రిసైడింగ్అధికారి, నలుగురు పోలింగ్అధికారులను నియమించనున్నారు. 400 నుంచి 600 వరకూ ఓటర్లు ఉంటే ఒక ప్రిసైడింగ్ఆఫీసర్, ఐదుగురు పోలింగ్అధికారులను నియమిస్తారు. ఓటు వేసేటప్పుడు ఓటరు ఎడమ చేతి చూపుడు వేలుకు సిరా వేస్తారు. బాణం క్రాస్మార్క్‌బ్బరు స్టాంపుతో ఓటు వేస్తారు. మొదట ఎంపీటీసీకి ఓటు వేసిన తర్వాత జెడ్పీటీసీ బ్యాలెట్పేపర్ఇస్తారు. ఒకే సారి రెండు బ్యాలెట్పేపర్లు ఇవ్వరు. ఓటు ఎవరికీ కనిపించకుండా వేయాల్సి ఉంటుంది. ఇష్టం వచ్చినట్టు చూపించి వేస్తామంటే నిబంధనలు అంగీకరించవు. ప్రతి బ్యాలెట్పేపర్ వెనకాల ప్రిసైడింగ్అధికారి తప్పకుండా సంతకం చేయాల్సి ఉంటుంది. ప్రతి బ్యాలెట్ పేపర్ వెనుక ప్రత్యేక గుర్తు ఒక వలయంలో భిన్నంగా ఉంటుంది. ఇందులో గణితంలో భాగాహారం విధానంలో పైన మండల ప్రజా పరిషత్కోడ్, కింద జిల్లా ఎన్నికల అధికారి ఆమోదించిన పోలింగ్స్టేషన్ నంబర్ ఉంటుంది.

### ముగ్గురు ఎంపీటీసీలకు ఒక రిటర్నింగ్ అధికారిబిలి

మూడు అంత కంటే ఎక్కువ కానీ తక్కువ ఉన్న ఎంపీటీసీలకు ఆయా జిల్లాల్లో ఉన్న పరిస్థితులకు అనుగుణంగా ఒక గెజిటెడ్అధికారిని రిటర్నింగ్ఆఫీసర్‌గా నియమిస్తారు. జెడ్పీటీసీకి మరో రిటర్నింగ్అధికారిని నియమిస్తారు. ఎంపీటీసీ స్థానాల రిటర్నింగ్అధికారులందరూ జెడ్పీటీసీ రిటర్నింగ్అధికారికి సహాయ రిటర్నింగ్ఆఫీసర్‌గా వ్యవహరిస్తారు. 2018 తెలంగాణ పంచాయతీరాజ్చట్టం 243(3) ప్రకారం ఏ అభ్యర్థి కూడా ఒక మండల ప్రజాపరిషత్లేదా జిల్లా ప్రజా పరిషత్‌లోని ఒకటి కంటే ఎక్కువ ప్రాదేశిక నియోజకవర్గాలకు పోటీ చేయొద్దని స్పష్టం చేస్తోంది. ప్రతి ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థి నామినేషన్వేసేందుకు కనీసం ఒక రోజు ముందుగా ఎన్నికల వ్యయం కోసం ప్రత్యేకంగా బ్యాంకులో ఖాతా తెరిచి, ఖాతా నంబర్నామినేషన్వేసే సమయంలో ఆర్‌వోకు రాత పూర్వకంగా ఇవ్వాలి. ఎన్నికల వ్యయం మొత్తం ఈ ఖాతా ద్వారా మాత్రమే చేయాలి. అభ్యర్థి సొంత నిధులతో సహా ఇతర మార్గాల ద్వారా వచ్చిన డబ్బును సైతం ఈ ఖాతాలో జమ చేసి ఖర్చు పెట్టాల్సి ఉంటుంది.

### పోటీ చేయాలంటే 21 ఏళ్లు నిండాల్సిందే..

జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు మెంబర్‌కు పోటీ చేసే




వారు ఖచ్చితంగా 21 ఏండ్లు నిండి ఉండాలి. ఏదైన గ్రామ సేవలకు కానీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక సంస్థల అధికారి, ఉద్యోగి, ప్రభుత్వ నిధుల నుంచి సహాయం పొందుతున్న ఏదేని సంస్థలోని ఉద్యోగి, శాసనసభ లేదా పార్లమెంట్ఉభయ సభలు చేసిన చట్టం కింద ఏర్పాటైన ఏదైనా సంస్థ కార్యనిర్వహక సభ్యుడు, ఉద్యోగి, వీరిలో ఎవరు కూడా స్థానిక సంస్థల్లో పోటీ చేసేందుకు అనర్హులు. ఇద్దరు పిల్లల కంటే ఎక్కువగా ఉన్న వారు సైతం ఈ ఎన్నికల్లో పోటీ చేయొచ్చు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్చట్టంలో మార్పు తీసుకొచ్చింది. ఈ సారి నోటా గుర్తు సైతం బ్యాలెట్పేపర్‌లో ఉండనుంది.

# హరిహరవీరమల్లు హీరోలు ఆ ఇద్దరే

**మనసు విప్పిన దర్శకుడు క్రిష్**




ఇద్దరు లెజెండ్స్ వల్లే 'హరి హర వీరమల్లు' సాధ్యమైందని దర్శకుడు క్రిష్ జాగర్లమూడి అన్నార . ఈ పీరియాడికల్ యాక్షన్ చిత్రానికి మొదట క్రిష్ దర్శకత్వం వహించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ఆయన స్థానంలో జ్యోతికృష్ణ దీన్ని పూర్తి చేశారు. తాజాగా దీనిపై క్రిష్ మౌనం వీడారు. మరో రెండు రోజుల్లో ఈ సినిమా విడుదల కానున్న నేపథ్యంలో సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టారు. ఇప్పుడు ఈ వీరమల్లు ప్రపంచంలోకి అడుగుపెడుతున్నాడు. నిశ్శబ్దంగా కాకుండా ఓ గొప్ప ఆశయంతో చరిత్రను ప్రజల ముందుకు తీసుకురానున్నాడు. ఈ చిత్రం ఇద్దరి లెజెండ్స్ వల్లే సాధ్యమైంది. వారు సినిమాల్లోనే కాదు.. నిజ జీవితంలోనూ ఎందరికో స్ఫూర్తి. వారిలో ఒకరు పవన్ కళ్యాణ్..మరొకరు నిర్మాత ఎఎం రత్నం అని అన్నారు. అసాధారణ శక్తికి రూపం వస్తే అది పవన్ అవుతుంది. ఆయన నిత్యం రగిలే అగ్నికణం. ఎందరికో ఆదర్శం. 'హరి హర వీరమల్లు'కు ప్రాణం పోసింది ఆయనే. ఆయన ఈ చిత్రానికి వెన్నెముక వంటి వారు.

ఇక మరో వ్యక్తి నిర్మాత ఏఎం రత్నం.. భారతీయ సినీ రంగంలో తనకంటూ గొప్ప అనుభవాలను పోగేసుకున్న శిల్పి. ఎంతో విశ్వాసంతో దీన్ని నిర్మించారు. ఇలాంటి సామర్థం, పట్టుదల చాలా అరుదుగా ఉంటాయి. ఆయన అచంచలమైన నమ్మకం వల్లే ఇది సాధ్యమైంది. నాకెంతో ఉత్సాహాన్నిచ్చిన ప్రాజెక్టులలో ఈ సినిమా ఒకటి. ఎన్నో జ్ఞాపకాలను ఇచ్చింది. దర్శకుడిగా మాత్రమే కాకుండా.. ఈ సినిమా కథను రూపొందించచడంలోనూ ఎన్నో విషయాలు తెలుసుకున్నాను అని క్రిష్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.

# కోపాన్ని వదిలేయమన్న రజనీ: మోహన్ బాబు



రజనీకాంత్ తనకు బెస్ట్ ఫ్రెండ్ అని నటుడు మోహన్‌బాబు చెప్పారు. తాజాగా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన రజనీకాంత్‌తో తనకున్న స్నేహాన్ని గుర్తుచేసుకున్నారు. ఐదు దశాబ్దాలకు పైగా తమ మధ్య అనుబంధం ఉందని తెలిపారు. రజనీకాంత్ గొప్ప వ్యక్తిత్వం ఉన్న మనిషి. మా ఇద్దరి మధ్య 50 ఏళ్లకు పైగా అనుబంధం ఉంది. నేను అతడిని 'ఏయ్ బ్లడీ తలైవా' అని ముద్దుగా పిలుస్తాను. మా మధ్య అంత చనువు ఉంది. 50 ఏళ్ల క్రితం మా వద్ద ఏమీ లేనప్పుడు నటులుగా పరిచయం కాకముందు మద్రాసు ప్లాట్‌ఫామ్‌పై మొదటిసారి కలుసుకున్నాం. అప్పటినుంచి మా బంధం కొనసాగుతోంది. రోజులో కనీసం 3, 4 సార్లైనా మెసేజ్ చేసుకుంటాం. ఇటీవల కలిసినప్పుడు అతడు ఒకమాట చెప్పాడు. 'నాకు గతంలో ఎంత కోపం ఉండేదో నీకు తెలుసు. నేను తర్వాత కాలంలో దాన్ని వదిలేశాను. నువ్వెందుకు వదల్లేకపోతున్నావు. పుస్తకాలు చదవడం కాదు.. అందులోని సారాంశాన్ని అర్థం చేసుకొని కోపాన్ని వదిలెయ్' అని సలహా ఇచ్చాడు' అని మోహన్‌బాబు గుర్తుచేసుకున్నారు. రజనీ హైదరాబాద్ వచ్చిన ప్రతిసారీ మోహన్‌బాబుని కలుస్తుంటారు. ఈవిషయాన్ని సందర్భం వచ్చినప్పుడల్లా ఇద్దరూ వెల్లడిస్తూనే ఉంటారు.



# ఉస్తాద్ భగత్ సింగ్‌లో మరో హీరోయిన్

**శ్రీలీలకు తోడుగా రాశీఖన్నా చేరిక**

పవన్ కల్యాణ్ ,హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న చిత్రం 'ఉస్తాద్ భగత్‌సింగ్' సినిమా అప్‌డేట్స్ కోసం పవన్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా వారికి ఈ టీమ్ ఓ అప్‌డేట్‌ను అందించింది. ఇందులో శ్రీలీలతో పాటు మరో కథానాయిక కూడా ఉన్నట్లు– తెలుపుతూ పోస్టర్‌ను పంచుకుంది. ఉస్తాద్ భగత్‌సింగ్'లో నటి రాశీఖన్నా భాగమైనట్లు ఎన్నో రోజులుగా వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. ఇప్పుడీ విషయాన్నే దర్శక నిర్మాతలు అధికారికంగా ప్రకటిస్తూ పోస్టర్ విడుదల చేశారు. ఇందులో ఆమె 'శ్లోక' పాత్రలో కనిపించనున్నట్లు వెల్లడించారు. తన పాత్రతో సినిమాకు మరింత అందాన్ని తెస్తుందన్నారు. ప్రస్తుతం ఆమె షూటింగ్‌లో పాల్గొంటున్నట్లు– చెప్పారు. ఇప్పటికే ఈ సినిమాలో శ్రీలీల భాగమవగా ఇప్పుడు రాశీ కూడా ఇందులో నటిస్తుండడం మరింత ఆసక్తిగా మారింది. గబ్బర్‌సింగ్' తర్వాత పవన్‌కల్యాణ్, హరీశ్ శంకర్ కాంబోలో రూపొందుతోన్న ఈ చిత్రంపై ప్రేక్షకులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. ఇందులో పవన్ కల్యాణ్ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. ఇకపోతే పవన్ నటించిన 'హరి హర వీరమల్లు' జులై 24న విడుదల కానుంది. ఈసందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో పవన్ లుక్‌కు అందరూ ఫిదా అయ్యారు. దీనిపై ఓ అభిమాని పోస్ట్ పెట్టగా.. దానికి హరీశ్ శంకర్ సరదాగా రిప్లై ఇచ్చారు. పవన్ ఉస్తాద్ లుక్ అదిరిపోయింది. ఓ అభిమానిగా హరీశ్ శంకర్ ఆయన్ని అద్భుతంగా చూపించనున్నారని అర్థమవుతోందని పోస్ట్ పెట్టారు. దీనికి దర్శకుడు రిప్లై ఇస్తూ.. 'తరతరాలుగా.. నరనరాల్లో ఆయనపై అభిమానం ఉప్పొంగుతోంది' అని అన్నారు.

# ఆసక్తికరమైన గణాంకంలో ముందున్న జడేజా, కేఎల్ రాహుల్

భారత్–ఇంగ్లాండ్ మధ్య జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో భారత జట్టులో కీలక ఆటగాళ్లుగా ఉన్న రవీంద్ర జడేజా, కేఎల్ రాహుల్ ఒక ఆసక్తికరమైన గణాంకంలో ముందున్నారు. ప్రస్తుత భారత టెస్ట్ జట్టులోని ఆటగాళ్లలో ఇంగ్లాండ్‌పై అత్యధిక టెస్టు పరుగులు సాధించిన జాబితాలో ఈ ఇద్దరు టాప్–2లో నిలిచారు. ఇది వారిద్దరి నిలకడైన ప్రదర్శనకూ, ఇంగ్లాండ్ గడ్డపై వారి పోరాట పటిమకూ నిదర్శనం. భారత టెస్ట్ జట్టులో రవీంద్ర జడేజా కేవలం బౌలర్‌గా మాత్రమే కాకుండా, బ్యాటింగ్‌లోనూ తన విలువను నిరూపించుకుంటున్నారు. ముఖ్యంగా గత కొన్ని సిరీస్‌లుగా అతను బ్యాటింగ్‌లో అద్భుతమైన ఫామ్‌ను కనబరుస్తున్నాడు. ఇంగ్లాండ్‌పై జడేజా టెస్టుల్లో నిలకడగా పరుగులు సాధిస్తూ వస్తున్నాడు. దిగువ ఆర్డర్‌లో వచ్చి జట్టుకు ఎన్నో కీలకమైన పరుగులు అందించాడు. అతని బ్యాటింగ్ టెక్నిక్, ఒత్తిడిలో నిలబడే సామర్థ్యం ప్రశంసనీయం. ప్రస్తుత ఇంగ్లాండ్ సిరీస్‌లో కూడా జడేజా బ్యాట్‌తో చాలా కీలకమైన ఇన్నింగ్స్‌లు ఆడాడు. లార్డ్స్‌లో జరిగిన మూడో టెస్టులో, భారతదేశం విజయం కోసం 193 పరుగులు ఛేదించాల్సి ఉండగా, 112 పరుగులకే 8 వికెట్లు కోల్పోయినప్పుడు, జడేజా ఒంటరి పోరాటం చేసి 61 పరుగులు (నాటౌట్) సాధించాడు. ఇది అతని పోరాట పటిమకు నిదర్శనం. ఇంగ్లాండ్ గడ్డపై 1000 టెస్ట్ పరుగులు పూర్తి చేయడానికి జడేజా కేవలం 58 పరుగుల దూరంలో ఉన్నాడు, తద్వారా సర్ గార్ఫీల్డ్ సోబర్స్ తర్వాత ఈ ఘనత సాధించిన రెండో బ్యాట్స్‌మెన్‌గా నిలుస్తాడుకేఎల్ రాహుల్ గత కొన్నేళ్లుగా భారత టెస్ట్ జట్టులో కీలకమైన ఆటగాడిగా కొనసాగుతున్నాడు. ఓపెనర్‌గా, మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్‌గా అతను తన సామర్థ్యాన్ని నిరూపించుకున్నాడు. ఇంగ్లాండ్‌పై రాహుల్ టెస్టుల్లో అద్భుతమైన రికార్డును కలిగి ఉన్నాడు.




ముఖ్యంగా ఇంగ్లాండ్ గడ్డపై అతని బ్యాటింగ్ చాలా మెరుగుపడింది. బంతిని ఆలస్యంగా ఆడటం, సరైన షాట్ ఎంపిక చేసుకోవడం అతని బలాలు. ప్రస్తుత ఇంగ్లాండ్ సిరీస్‌లో కూడా రాహుల్ మంచి ఫామ్‌లో ఉన్నాడు. ఇప్పటికే రెండు సెంచరీలు, ఒక అర్ధ సెంచరీతో 375 పరుగులు సాధించాడు. ఇంగ్లాండ్‌లో టెస్టుల్లో 1000 పరుగులు సాధించిన నాల్గవ భారతీయుడిగా నిలవడానికి కేఎల్ రాహుల్ కేవలం 11 పరుగుల దూరంలో ఉన్నాడు. గతంలో సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రవిడ్, సునీల్ గవాస్కర్ మాత్రమే ఈ మైలురాయిని చేరుకున్నారు. నిజానికి, ఈ ఇద్దరు ఆటగాళ్లు ప్రస్తుత టీం ఇండియా జట్టులో ఇంగ్లాండ్ పై అత్యధిక టెస్ట్ పరుగులు చేసిన భారత ఆటగాళ్ల జాబితాలో టాప్–2లో ఉన్నారు. అదే సమయంలో, రవీంద్ర జడేజా, కేఎల్ రాహుల్ కూడా అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. కాబట్టి మాంచెస్టర్ టెస్ట్ తర్వాత ఈ జాబితాలో ఏ ఆటగాడు ముందుకు వస్తాడో చూడటం ఆసక్తికరంగా ఉంటుంది. ప్రస్తుతం, రవీంద్ర జడేజా ఇప్పటివరకు ఇంగ్లాండ్ పై 1358 పరుగులు చేశాడు. ఇది అతన్ని ఈ జాబితాలో అగ్రస్థానానికి తీసుకువచ్చింది. అతని తర్వాత, కేఎల్ రాహుల్ 1330 పరుగులతో రెండవ స్థానంలో ఉండగా, రిషబ్ పంత్ (1206 పరుగులు), శుభ్మాన్ (1199 పరుగులు), యశస్వి జైస్వాల్ (945 పరుగులు) కూడా ఈ జాబితాలో ఉన్నారు. మాంచెస్టర్ టెస్ట్‌లో, ఇద్దరు ఆటగాళ్ళు ఈ రికార్డును తమ సొంతం చేసుకోవాలని చూస్తున్నారు. తన ఆల్ రౌండ్ సామర్థ్యానికి ప్రసిద్ధి చెందిన జడేజా, ఈ జాబితాలో తన ఆధిక్యాన్ని బలోపేతం చేసుకోవడానికి ముందుకు వస్తాడు. అదే సమయంలో, కేఎల్ రాహుల్ ఇటీవల బ్యాటింగ్‌లో మెరుగుపడటం, అతని సంయమనంతో కూడిన ఆట అతన్ని ఈ రేసులో బలమైన పోటీదారుగా చేస్తుంది. మాంచెస్టర్‌లో రాహుల్ జడేజాను వెనుకబడి ఉంచుతాడా లేదా జడేజా నంబర్–1గా ఉంటాడా అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సిరీస్‌లో ఇప్పటివరకు రవీంద్ర జడేజా, కేఎల్ రాహుల్ చెరో 300 కి పైగా పరుగులు సాధించారు. రాహుల్ 3 మ్యాచ్‌లలో 6 ఇన్నింగ్స్‌లలో 375 పరుగులు చేశాడు. ఇందులో 2 సెంచరీలు, 1 హాఫ్ సెంచరీ ఉన్నాయి. అదే సమయంలో, రవీంద్ర జడేజా 3 మ్యాచ్‌లలో 6 ఇన్నింగ్స్‌లలో 327 పరుగులు చేశాడు. ఈ సమయంలో, అతను వరుసగా 4 హాఫ్ సెంచరీలు కూడా చేశాడు. ఇటువంటి పరిస్థితిలో, టీం ఇండియా సిరీస్‌లో తిరిగి రావాలంటే, ఈ ఇద్దరు ఆటగాళ్ల బ్యాట్‌లు బాగా రాణించడం చాలా ముఖ్యం.

# గాయాలతో కీలక ప్లేయర్లు దూరం!

- ఆకాష్ దీప్, అర్షదీప్ సింగ్ లకు గాయాలు
- ఫిట్ నెస్ సాధించని రిషబ్ పంత్
- దారుణంగా విఫలమవుతున్న కరుణ్ నాయర్
- భారత్ కనీసం డ్రా చేసుకోవడం కష్టమే!!
- మాంచెస్టర్ లో నేటినుండి నాలుగో టెస్టు

భారత్, ఇంగ్లాండ్ మధ్య నాలుగో టెస్ట్ మ్యాచ్ బుధవారం ప్రారంభం కానుంది. ఇప్పటివరకూ జరిగిన మూడు టెస్టుల్లో 2 ఆతిథ్య ఇంగ్లాండ్ నెగ్గా, భారత్ ఒక మ్యాచ్ లో విజయం సాధించింది. ఇప్పుడు రెండు జట్లు మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో తలపడనున్నాయి. అయితే రికార్డులు భారత్ కు అంత సానుకూలంగా లేవు. భారత జట్టు ఇప్పటివరకూ మైదానంలో ఒక్క టెస్ట్ మ్యాచ్ కూడా నెగ్గలేదు. ఇటీవల రెండో టెస్టులోనే అదే మాట వినిపించింది. కానీ యువ ఆటగాళ్లతో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ జట్టుకు అద్భుత విజయాన్ని అందించాడు. నాలుగో టెస్టు జరగనున్న మాంచెస్టర్ లోనూ అదే సీన్ రిపీట్ చేయాలని టీమిండియా భావిస్తోంది. లేకపోతే నాలుగో టెస్ట్ ఓడితే భారత్ సిరీస్ చేజారిపోతుంది. ఓవైపు తర్వాత టెస్టులో విజయాల గురించి కంటే ఎవరు గాయపడ్డారు, ఎవరు అందుబాటులో ఉంటారు అనేది హాట్ టాపిక్గా మారింది. ఇప్పటికే గాయంతో ఆకాష్ దీప్, అర్షదీప్ సింగ్ ఈ టెస్టుకు అందుబాటులో ఉండరు. రిషబ్ పంత్ విషయానికొస్తే ఫిట్ నెస్ లేదు. భారత్ లో అరుదైన ఆటగాడిగా ఉన్న ట్రిపుల్ సెంచరీ వీరుడు కరుణ్ నాయర్ దారుణంగా విఫలమవుతున్నాడు. ఇలా ఆడితే జట్టు విజయాలు కాదు కదా, కనీసం డ్రా చేసుకోవడం కష్టమే.నాల్గవ టెస్ట్‌లో రిషబ్ పంత్ ఆడటం కష్టమని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. అతడు ఫిట్ నెస్ సమస్యతో బాధ పడుతున్నాడు. ఒకవేళ మాంచెస్టర్ టెస్టులో పంత్ బరిలోకి దిగితే కేవలం బ్యాటర్‌గా ఆడనున్నాడు. ధ్రువ్ జురెల్ కీపింగ్ బాధ్యతలు తీసుకునే అవకాశం కూడా ఉంది. ప్రస్తుతం యశస్వి జైస్వాల్, కెఎల్ రాహుల్ ఓపెనింగ్ చేస్తూ జట్టుకు మంచి స్కోర్లు అందిస్తున్నారు. ఆ తర్వాత నెం.3లో కొత్త కుర్రాడు సాయి సుదర్శన్‌కు అవకాశం దొరుకుతుంది. అయితే, రిషబ్ పంత్ ప్లేయింగ్ ఎలెవన్ లో కాకపోతే వీరిలో ఒకరికి జట్టులో చోటు దక్కుతుంది. మాంచెస్టర్ టెస్ట్‌లో శార్దూల్ ఠాకూర్, వాషింగ్టన్ సుందర్‌లలో ఎవరికి ఛాన్స్ అనేది ప్రశ్నగా మారింది. వాస్తవానికి, పిచ్ మీద గడ్డి ఉంది. అంటే ఇక్కడ ఫాస్ట్ బౌలర్లకు పిచ్ నుంచి సహకారం దొరుకుతుంది. కానీ సుందర్ మూడవ టెస్ట్‌లో బాగా రాణించాడు. దీనిని మనం విస్మరించలేము. కనుక సుందర్ ప్లేయింగ్ లెవన్ లో చోటు దక్కించుకుంటే శార్దూల్ కు మరోసారి నిరాశే.ఫస్ట్ క్లాస్ క్రికెట్లో ఓ మ్యాచ్ ఇన్నింగ్స్ లో 10కి 10 వికెట్లు తీసిన ఘనత అన్షుల్ కంబోజ్ సొంతం. ఇంగ్లాండ్ లో ఆటగాళ్ల గాయాలు, ప్రస్తుత పరిస్థితిని చూస్తే ఈ యువ ఫాస్ట్ బౌలర్‌కు అరంగేట్రం చేసే అవకాశం దొరుకుతుందని మాజీ క్రికెటర్లు సైతం భావిస్తున్నారు.

# పెద్ది మూవీ కోసం విలేజ్ సెట్

'ఉప్పెన'తో సెన్సేషనల్ డెబ్యూ ఇచ్చిన బుచ్చిబాబు సాన డైరెక్షన్‌లో రామ్‌చరణ్‌తో పెద్ది మూవీ తెరకెక్కుతోంది. కథకు ప్రధానమైన సన్నివేశాలు విజయనగరం నేపథ్యంలో చిత్రీకరించాల్సి ఉంది. అయితే అక్కడి వాతావరణం షూటింగ్‌కు అనుకూలంగా లేకపోవడంతో, ఆ సీన్లను హైదరాబాద్‌లో ప్రత్యేకంగా సెట్ వేసి తీయాలని చిత్రబృందం నిర్ణయించింది. ఈ సెట్ కోసం ఏకంగా రూ. 5 కోట్లు ఖర్చు చేస్తున్నట్టు– సమాచారం. ఈ సినిమా రూరల్ స్పోర్ట్స్ డ్రామా కాగా, ఇందులో రామ్ చరణ్ ఒక క్రికెటర్ పాత్రలో కనిపించబోతున్నాడు. ఇప్పటికే విడుదలైన చిన్న గ్లింప్స్‌కి అభిమానుల నుంచి భారీ స్పందన వచ్చింది. కథ, లుక్ విభిన్నంగా ఉండనుందని తెలుస్తుంది. వచ్చే ఏడాదిలో ఈ మూవీ రిలీజ్ కానుంది. చిత్రానికి ఆస్కార్ విన్నింగ్ కంపోజర్ ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే ట్యూన్స్ రెడీ అయ్యాయని సమాచారం. మాస్ నేపథ్యంలో సాగే కథకు రెహమాన్ ఇచ్చే మ్యూజిక్ ఎంతగా ఎలివేట్ చేస్తుందో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా బాలీవుడ్ బ్యూటీ– జాన్వీ కపూర్ నటిస్తున్న విషయం తెలిసిందే. దేవరతో టాలీవుడ్ ఎంట్రీ– ఇచ్చిన ఆమె, వెంటనే రామ్ చరణ్ సరసన ఛాన్స్ కొట్టేసింది. ఇక 'పెద్ది' కోసం రామ్ చరణ్ బాడీ ట్రాన్స్ఫర్మేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాడు.. ఇటీ–వల ఆయన జిమ్‌లో వర్కౌట్ చేస్తున్న ఫోటో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.



Printed, Published and Owned by Shaik Yacoob Pasha, at Sri Venkateshwara Printers. Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Districrt : Khammam Editor: Shaik Yacoob Pasha, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609